





తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక



Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

సోమవారం 18.03.2024 | సంపుటి : 10 సంచిక : 248 | పేజీలు : 12 వెల: రూ. 4/-

Follow :

కరీంనగర్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్









# విపక్షాలకు తలుపులు తెరిచాం

రైతు భరోసా గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 5 ఎకరాలు ఉన్న వారికి నగదు జమ చేశాం. ఇకపై గుట్టలు, రోడ్లు, బంగళాలు, లేఔట్లకు రైతు భరోసా ఇవ్వబోం. ఏ ప్రభుత్వ పథకం అందకపోయినా దరఖాస్తు చేసుకోవాలి.పరిశీలించి అందిస్తాం

- 'మీట్ ది మీడియా' కార్యక్రమంలో సీఎం రేవంత్


## ఎవరైనా వచ్చిచేరొచ్చు:సీఎం రేవంత్

### ఇక నుంచి రాజకీయాలు చేస్తాం • ప్రభుత్వాన్ని పడగొడతామంటే చూస్తూ ఊరుకుంటామా?

- అన్నదాలకు రైతు భరోసాపై ఆందోళన వద్దు
- ఏ పథకం అందకపోయినా దరఖాస్తు చేసుకోవాలి.. పరిశీలించి అందిస్తాం
- తెలంగాణకు ఇతర రాష్ట్రాలతో కాదు. ప్రపంచంతోనే పోటీ
- మేం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఫిరాయింపులకు పాల్పడలేదు
- 'మీట్ ది మీడియా' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** భారాస ప్రభుత్వ హయాంలో రాచరికాన్ని తీసుకురావాలని కేసీఆర్ చూశారని సీఎం రేవంత్ విమర్శించారుకాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు 100 రోజులు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది మీడియా' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు."వారసత్వాన్ని తమపై రుద్దాలని చూసినప్పుడు తెలంగాణ సమాజం ఏకమైంది. ప్రజలు దానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. కేసీఆర్ కుటుంబాన్ని అధికారం నుంచి దించారు. ప్రజాస్వామ్యంపై ఆయనకు నమ్మకం లేదు. ఏనాడూ ప్రజల స్వేచ్ఛను గౌరవించలేదు. నిజాం నకలునే కేసీఆర్ చూపించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నాశనం చేశారు. 1948 సెప్టెంబర్ 17కు చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. 2023 డిసెంబర్ 3కూ అంతే ప్రాధాన్యం ఉంది. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాచరిక పాలన అంతమైతే.. 2023 డిసెంబర్ 3న కేసీఆర్ పాలన పోయింది. నియంతలు ఎప్పుడూ సంస్కృతిని ధ్వంసం చేయాలని చూసారు. గత ప్రభుత్వంలో తెలంగాణ వాహన రిజిస్ట్రేషన్‌లో టీజీ బదులు టీఎస్ తీసుకొచ్చారు. టీఆర్ఎస్‌కు నకలుగానే టీఎస్‌ను తెచ్చారు. 'జయ జయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గీతంగా గుర్తించలేదు. మా ప్రభుత్వంలో ధర్నా చౌక్‌లో నిరసనలకు అనుమతులు ఇచ్చాం. తెలంగాణ తల్లి విగ్రహంలో కూడా మార్పులు తీసుకొస్తున్నాం. రాష్ట్ర సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాటు చేస్తాం. అధికారంలోకి రాగానే ప్రగతి భవన్ గోడలు బద్దలుకొట్టాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు పనిలో స్వేచ్ఛను ఇచ్చాం. 26 కోట్ల మంది మహిళలు ఇప్పటి వరకు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. 32 లక్షల కుటుంబాలు 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్ పథకాన్ని అందుకున్నాయి. రైతు భరోసా గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మిగతా 2లో..






# వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా'దే విజయం

## కూటమి నేతల ధీమా

- ఎలక్టోరల్ బాండ్లతో భాజపా అవినీతి బండారం బయటపడింది
- దేశ ప్రజలు ఓటు ఆయుధంతో నియంతృత్వాన్ని అంతం చేయాలి
- ఈడీ, సీబీఐ, ఐటీలు లేకుండా మోదీ గెలవలేరు
- రాజ్యాంగాన్ని మార్చేంత ధైర్యం భాజపాకు లేదు
- ఆ పార్టీ హడావుడి తప్ప మరేం చేయలేదు: రాహుల్
- ముంబైలో ఘనంగా 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ముగింపు సభ
- కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్

**ముంబయి(జనంసాక్షి):** 'ఈడీ, ఈవీఎంలు, సీబీఐ, ఐటీ'ల సాయం లేకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభ ఎన్నికల్లో గెలవలేరని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అవినీతిపై ప్రధాని మోదీకే గుత్తాధిపత్యం ఉందని ఆరోపించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్వేషాలను ఎత్తిచూపేందుకే 'భారత్ జోడో యాత్ర'లను నిర్వహించినట్లు తెలిపారు. "శివసేన, ఎన్సీపీలు ఊరికే చీలిపోయి అధికార కూటమిలో చేరాయని భావిస్తున్నారా?" అని ప్రశ్నించారు. ముంబయిలోని శివాజీ పార్కులో నిర్వహించిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ముగింపు సభకు 'ఇండియా కూటమి' నేతలు హాజరై భాజపాపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చేది ఇండియా కూటమే నని, తాము లౌకిక, సమ్మిళిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ బాండ్లతో భాజపా అవినీతి బయటపడిందన్నారు. కమలదళం నాశనం చేసిన భారతదేశపు ఆత్మను పరికించే ప్రయత్నమే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' అని స్టాలిన్ పేర్కొన్నారు."విదేశీ పర్యట

మిగతా 2లో..

# పార్లమెంటు ఎన్నికల వేళ భారాసకు ఎదురుదెబ్బ

### కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డి • అదే బాటలో ఎమ్మెల్యే దానం నాగేందర్

కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ

**హైదరాబాద్(జనంసాక్షి):** భారాసకుషాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు.సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు రంజిత్‌రెడ్డి భారాసకు రాజీనామా చేశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు.



# భాజపాకే భారీ విరాళాలు

### అత్యధికంగా రూ.6,986.5 కోట్లు • ఎలక్టోరల్ బాండ్ల కొత్త డేటా విడుదల

- రెండో స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ రూ. రూ.1397 కోట్లు
- అత్యల్పంగా నేషనల్ కాన్ఫరెన్స్‌కు రూ.50 లక్షలు
- కాంగ్రెస్‌కు రూ.1334 కోట్లు, బీఆర్ఎస్‌కు రూ.1,322 కోట్లు
- సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచిన ఎన్నికల సంఘం

**ఢిల్లీ(జనంసాక్షి):** ఎలక్టోరల్ బాండ్లపై కేంద్ర ఎన్నికల సంఘం రెండో జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సమర్పించిన డేటాను మరోసారి అందుబాటులో ఉంచినట్లు ఆదివారం ఎన్నికల సంఘం వెల్లడించింది. సీల్డ్ కవరులో కోర్టుకు ఇచ్చిన వివరాలు కూడా ఇందులో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ పార్టీ అత్యధికంగా రూ.6,986.50 కోట్ల విరాళాలను పొందినట్లు తెలిపింది. కేవలం 2019-2020 మధ్య బీజేపీకి రూ.2,555 కోట్ల బాండ్లు అందినట్లు ఈసీ విడుదల చేసిన డేటా వెల్లడిస్తోంది. ఇక.. బీజేపీ పార్టీ తర్వాత అత్యధికంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ)కి రూ.1,397కోట్ల విలువైన బాండ్లను విరాళాలుగా పొందినట్లు తెలిపింది. ఈసీ వెల్లడించిన డేటా ప్రకారం..




మిగతా 2లో..

# కవితను విచారించిన ఈడీ అధికారులు

### ఎమ్మెల్సీతో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆదివారం ఈడీ అధికారులు విచారించారు. ఈడీ కస్టడీలోకి తీసుకున్న నేపథ్యంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంరెడ్డి తదితరులు ఆదివారం ఢిల్లీకి వెళ్లారు.సాయంత్రం ఈడీ కార్యాలయానికి హరీష్ రావు, కేటీఆర్, కవిత భర్త అనిల్,

మిగతా 2లో..






# అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం కౌంటింగ్ తేదీల్లో మార్పు

### ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

**ఢిల్లీ(జనంసాక్షి):** సార్వత్రిక ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం పోలింగ్ షెడ్యూల్ విడుదల చేసింది. అయితే తాజాగా.. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల ఎన్నికల సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించిన కౌంటింగ్ తేదీల్లో మార్పులు చేసింది సీఈసీ. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల

మిగతా 2లో..

# రాబోవు సర్కారుకు మోదీ రోడ్‌మ్యాప్

### తొలి 100 రోజులకు ప్రణాళికలు సిద్ధం చేయండి • మంత్రులకు మోదీ ఆదేశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడే నూతన ప్రభుత్వం కోసం మొదటి 100 రోజులకు, వచ్చే ఐదేళ్ల పాలన కోసం రోడ్‌మ్యాప్‌ను సిద్ధంచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ మంత్రులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ రోడ్‌మ్యాప్ రూపొందించడంలో సంబంధిత మంత్రిత్వ శాఖ కార్యదర్శులు, అధికారుల సలహాలను తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన మరుసటి రోజే ఈ సమావేశాన్ని ప్రధాని నేతృత్వంలో నిర్వహించినట్లు సమాచారం. మార్చి 3న ప్రధాని నేతృత్వంలోని మంత్రిమండలి వికసిత్ భారత్-2047 లక్ష్యంపై జరిపిన మేధోమథనంలోనూ ఈ అంశంపై చర్చించారు.మరోవైపు, ఏడు దశల్లో ఎన్నికలను నిర్వహించాలన్న

మిగతా 2లో..

## ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చాలని కాంగ్రెస్ కుట్ర

### వచ్చే ఐదేళ్లు అవకాశం ఇవ్వండి : ప్రధాని మోదీ



**చిలకలూరిపేట(జనంసాక్షి):** రాష్ట్రంలో అవినీతి సర్కారుకు చరమగీతం పాడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఏపీ మంత్రులు అవినీతి, అక్రమాల్లో ఒకరిని మించి మరొకరు పోటీ పడుతున్నారన్నారు.తెదేపా, భాజపా, జనసే

మిగతా 2లో..

# రేపు సీడబ్ల్యూసీ కీలక భేటీ

### 20న కాంగ్రెస్ అభ్యర్థుల తదుపరి జాబితా • ఆ రోజే ఎన్నికల మేనిఫెస్టో విడుదల



**దిల్లీ(జనంసాక్షి):** సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ వెలువడిన వేళ కాంగ్రెస్ పార్టీ సర్వ సన్నద్ధత దిశగా కరసత్తు చేస్తోంది. ఈ ఎన్నికల బరిలో నిలిపేందుకు ఇప్పటికే రెండు విడతల్లో 82మందితో లోక్‌సభ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన హస్తం పార్టీ మిగతా అభ్యర్థుల ఖరారుతో పాటు మేనిఫెస్టో విడుదలపై కసరత్తు ముమ్మరం చేసింది. ఇందుకోసం మార్చి 19న కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి సీడబ్ల్యూసీ భేటీ కానుంది. ఈ భేటీలో చర్చించి ఎన్నికల మేనిఫెస్టోకు తుది రూపం ఇవ్వనున్నారు. మార్చి 19న ముసాయిదా మేనిఫెస్టోకు సీడబ్ల్యూసీ ఆమోదం తెలుపుతుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఇప్పటికే తమ పార్టీ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు యువత, మహిళలు, రైతులు, శ్రామికులు తదితర వర్గాల ప్రజలకు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఏ ఒక్క వ్యక్తో ఇచ్చినవి కాదని.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినవని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ మార్చి 19, 20 తేదీల్లో సమావేశమై మిగతా అభ్యర్థుల జాబితాను ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మార్చి 20న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా విడుదలవుతుందని ఆ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో ఈసారి 20 లోక్‌సభ స్థానాలు గెలుచుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అంటే ప్రధాని మోదీకి భయమని, అందుకే ఖర్గే సొంత జిల్లా

మిగతా 2లో..

# భాజపాలో చేరిన అరూరి రమేష్

భారాస మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ భాజపాలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆయనకు కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు. భారాస వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రమేశ్.. శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. భారాసను వీడనున్నారనే ప్రచారం తర్వాత ఇటీవల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ముఖ్యనేతలు ఆయన్ను బుజ్జగించారు. అధినేత కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్లి సముదాయించినా ఫలితం లేకపోయింది. అరూరి రమేశ్ భాజపా తరఫున వరంగల్ అభ్యర్థిగా బరిలో ఉండే అవకాశముంది. ఈ మేరకు

మిగతా 2లో..



# బీజేపీకి ప్రయోజనంగా ఎలక్షన్ షెడ్యూల్

### మండిపడ్డ 'మల్లికార్జున్ ఖర్గే'

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఎలక్షన్ కమిషన్ ప్రకటించిన ఏడు దశల ఓటింగ్ ప్రణాళిక అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి ప్రయోజనం చేకూర్చే విధంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు 'మల్లికార్జున్ ఖర్గే' పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ కూడా ఈ షెడ్యూల్‌ను విమర్శించింది.మేము రాష్ట్రంలో ఒకటి లేదా రెండు దశల లోక్‌సభ ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాము. కానీ ఎలక్షన్ కమిషన్ ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ చేపట్టడం వల్ల ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం

మిగతా 2లో..



# ఈసారి అమెరికా ఎన్నికలు చరిత్రలో నిలిచిపోనున్నాయి

## నేను గెలవకపోతే అమెరికాలో 'రక్తపాతమే': ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్ష పీఠం కోసం జో బైడెన్‌తో పోటీకి సిద్ధమైన డొనాల్డ్ ట్రంప్ శనివారం కీలక వ్యాఖ్యలు చేశారు. నవంబర్ 5న జరగబోయే ఎన్నికలు యూఎస్ చరిత్రలో నిలిచిపోనున్నాయని అన్నారు. తాను తిరిగి అధికారంలోకి రాకపోతే దేశంలో 'రక్తపాతం' మొదలవుతుందని పేర్కొన్నారు. బైడెన్ విధానాలను విమర్శిస్తూ ఒహైయోలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మెక్సికోలో కార్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్న చైనా నిర్ణయాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే అక్కడ ఉత్పత్తయ్యే కార్లను అమెరికాలో విక్రయించడానికి అనుమతించబోనని తెలిపారు. 100 శాతం దిగుమతి సుంకాలు విధిస్తామని చెప్పారు. పరోక్షంగా బైడెన్ వాహన పరిశ్రమ విధానాలను లక్ష్యంగా చేసుకొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈసారి తాను గెలవకపోతే.. బహుశా అమెరికాలో మరోసారి ఎన్నికలు ఉండబోవని అన్నారుట్రంప్ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో ఆయన ఎన్నికల ప్రచార బృందం అధికార ప్రతినిధి కారోలిన్ లీవిట్ వివరణ ఇచ్చారు. బైడెన్ (ఏసీవ ఃతిటవని) విధానాల వల్ల అమెరికా వాహన పరిశ్రమలో 'ఆర్థిక రక్తపాతం' మొదలవుతుందనే కోణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. మరోవైపు ప్రస్తుతం జైల్లో ఉన్న తన మద్దతుదారులకు ట్రంప్ సానుభూతి ప్రకటించారు. గత అధ్యక్ష ఎన్నికల సమయంలో క్యాపిటల్ హిల్‌పై దాడి ఘటనలో అరెస్టయిన వారిని ఆయన 'బందీలు'గా, 'దేశభక్తులు'గా అభివర్ణించడం గమనార్హం.ట్రంప్ వ్యాఖ్యలను బైడెన్ ప్రచార బృందం తప్పుబట్టింది. గత ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన ఆయన మరోసారి రాజకీయ హింసకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించింది. ఆయన ప్రతీకారాన్ని, అతివాదాన్ని ఓటర్లు మరోసారి ఓడిస్తారని వ్యాఖ్యానించింది. అధ్యక్ష అభ్యర్థిత్వానికి కావాల్సిన ప్రతినిధుల మద్దతును డెమోక్రాటిక్ పార్టీ తరఫున జో బైడెన్, రిపబ్లికన్ పార్టీ నుంచి ట్రంప్ సాధించిన విషయం తెలిసిందే. నవంబర్‌లో జరగబోయే ఎన్నికల్లో వీరు తలపడనున్నారు.ట్రంప్ అభ్యర్థిత్వానికి తాను మద్దతివ్వడం లేదని ఆయన సొంత పార్టీ కీలక నేత మైక్ పెన్స్ తెలిపారు. అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ట్రంప్ అనేక విషయాల్లో పార్టీ విధానాలకు కట్టుబడలేదని వ్యాఖ్యానించారు. తనకు, ట్రంప్‌నకు మధ్య చాలా వ్యత్యాసముందన్నారు. తాను ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో రాజ్యాంగానికి లోబడే పనిచేశానన్నారు. ఎక్కడా ఒత్తిళ్లకు తలొగ్గి దారి తప్పలేదని.. అందుకు తాను గర్విస్తున్నానని తెలిపారు.ట్రంప్ హయాంలో పెన్స్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఈసారి అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీ పడ్డవారిలో ఆయన కూడా ఉన్నారు. కానీ, ప్రైమరీ ఎన్నికలు ప్రారంభం కావడానికే ముందే రేసు నుంచి వైదొలిగారు. గత ఎన్నికల సమయంలో ఫలితాల అనంతరం ట్రంప్ అనుసరించిన వైఖరి, ఆయన మద్దతుదారులు క్యాపిటల్ హిల్‌పై దాడికి దిగడాన్ని పెన్స్ తీవ్రంగా తప్పుబట్టిన విషయం తెలిసిందే.

# ప్రవేశ పరీక్షలో మార్పు ఉండదు

**- యూజీసీ ఛైర్మన్**

**దిల్లీ(జనంసాక్షి):** ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష-యూజీ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు ఉండదని యూజీసీ స్పష్టం చేసింది. గతంలో ప్రకటించిన మాదిరిగా మే 15 నుంచి 31 మధ్య ఈ పరీక్షలు జరుగుతాయని యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ అన్నారు.ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని.. రిజిస్ట్రేషన్లు ముగిశాక స్పష్టమైన డేట్ షీట్‌ను ఔం విడుదల చేస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సీయూఈటీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు ఉండొచ్చంటూ గతంలో చెప్పిన విషయంపై తాజాగా ఆయన ట్వీట్ చేశారు. 'సీయూఈటీ - యూజీ పరీక్షలు ఎన్‌టీఏ గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి. ఈ షెడ్యూల్‌లోని రెండు తేదీల్లో (మే 20, 25) ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 26న సీయూఈటీ (యూజీ) దరఖాస్తుల గడువు ముగిసిన తర్వాత అసలు ఎంతమంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు? ప్రాంతాల వారీగా ఎంతమంది ఉన్నారనే డేటా, పరీక్ష తేదీల ఆధారంగా ఎన్‌టీఏ డేట్ షీట్‌ను రూపొందించి విడుదల చేస్తుంది' అని యూజీసీ చీఫ్ పేర్కొన్నారు. గతేడాది 14.9లక్షల మంది రిజిస్టర్ చేసుకున్న విషయం తెలిసిందే.

# బీహార్ ఫలితాలు అందర్నీ ఆశ్చర్యపరుస్తాయి

**తేజస్వీ యాదవ్**

**లక్నో(జనంసాక్షి):** రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరుస్తాయని బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి 'తేజస్వి యాదవ్' విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు.ఆర్జేడీ మంచి ఫలితాన్ని సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని అన్నారు.మా పాలనలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు తెలుసు. గత 10 సంవత్సరాల్లో బీహార్ కోసం ప్రధాని మోదీ ఏమి చేశారు? బీహార్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఏమీ రాలేదు. ద్రవ్యోల్బణం, రైతుల సమస్య ఇప్పటికీ అలాగే ఉందని తేజస్వి యాదవ్ అన్నారు. దేశంలో సార్వత్రిక ఎన్నికలు ఏడు దశల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్, ఏప్రిల్ 26న రెండో దశ, మే 7న మూడో దశ, మే 13న నాలుగో దశ, మే 20వ తేదీన ఐదో దశ పోలింగ్, మే 25న ఆరో దశ, జూన్1న ఏడో దశ పోలింగ్ ఉంటుందని సీఈసీ తెలిపారు. మరి కొన్ని రోజుల్లో ఏ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రానుందని విషయం తెలుస్తుంది.

# పాకిస్థాన్ చేతికి చైనా నిఘా నౌక..!

**జనంసాక్షి:** పాకిస్థాన్ నేవీలో మొట్టమొదటి సారి నిఘా నౌక చేరింది. చైనా సాయంతో సమకూర్చుకున్న ఈ షిప్‌నకు అణు వార్ హెడ్‌లు ఉన్న బాలిస్టిక్ క్షిపణులను కూడా ట్రాక్ చేసే సామర్థ్యం ఉంది.దీంతోపాటు ఇతర కీలక సమాచారాన్ని కూడా సేకరించగలదు. 87 మీటర్ల పొడవున్న దీనికి 'పీఎన్ఎస్ రిజ్వాన్' అని పేరుపెట్టారు. దాదాపు 19 మీటర్ల వెడల్పు ఉన్న దీనిలో 48 సిబ్బంది ప్రయాణించవచ్చు. ఇందులో రాడార్లు, ఇతర ట్రాకింగ్ సిస్టమ్‌లు ఉన్న మూడు డోములున్నాయి. హిందూ మహా సముద్రంపై చైనా దృష్టి పెట్టడంతో పాక్ నౌకాదళ సామర్థ్యాన్ని పెంచే పనిని చైనా మొదలుపెట్టింది. గతేడాదే దీనిని చైనా నుంచి పాక్‌కు చేర్చారు. ఈ క్రమంలో జూన్‌లో ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ను ఆపేశారు. నాటి నుంచి ఇటీవల వరకు ఇది కరాచీ పోర్టులోనే ఉంది. ఇక ఈ నౌకను ఫూజౌలోని ఫుజియాన్ మావై షిప్‌బిల్డింగ్ సంస్థ నిర్మించింది. ఇది చైనాలో అత్యంత పురాతనమైన నౌకా నిర్మాణ కంపెనీ.ఇప్పటికే భారత్ వినియోగిస్తున్న ఐఎన్ఎస్ ధ్రువ్ కంటే ఇది చిన్నది. మన నౌకను 2021లో నౌకాదళంలో చేర్చారు. దీని నిర్మాణానికి దాదాపు ఏడేళ్ల సమయం పట్టింది. రూ.1500 కోట్ల వ్యయం అయింది. ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, భారత్ వద్ద మాత్రమే ఇటువంటి నౌకలున్నాయి. తాజాగా ఈ జాబితాలో పాక్ కూడాచేరినట్లైంది.




# విపక్షాలకు తలుపులు తెరిచాం

5 ఎకరాలు ఉన్న రైతుల వరకూ రైతుబంధు వారి ఖాతాల్లో పడింది. 62 లక్షల మందికి నగదు జమ చేశాం. ఇకపై గుట్టలు, రోడ్లు, బంగళాలు, లేఔట్లకు రైతు భరోసా ఇవ్వబోం. ఏ ప్రభుత్వ పథకం అందకపోయినా దరఖాస్తు చేసుకోవాలి.. పరిశీలించి అందిస్తాం.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని భారాస, భాజపా నేతలు పదేపదే అంటున్నారు. వాళ్లు ప్రభు త్వాన్ని పడగొడ తామంటే చూస్తూ ఊరుకుంటామా? కుక్కకాటుకు చెప్పు దెబ్బ అని పెద్దలు చెప్పారు.. కొట్టకుండా ఊరుకుంటామా?మేం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఫిరాయింపులకు పాల్పడలేదు. ఈరోజు నుంచే నేనూ రాజకీయం ప్రారంభించాను. మా పార్టీలోకి పొద్దున్నే ఒక గేటు తెరిచా.. మొత్తం ఇంకా తెరవలేదు. ఇవాళ ఒక ఎంపీ, ఎమ్మెల్యేకు గేటు ఓపెన్ చేశాం. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాకు మంచి మిత్రుడు. ఆయనకు బలహీనవర్గాల పట్ల నిబద్ధత ఉంది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా ఉండాలని కోరారు.. తిరస్కరించారు. కానీ.. కేసీఆర్ ఎలాంటి వారి నుంచైనా సగం బలం గుంజుకుంటారు. ప్రవీణ్‌కుమార్ భారాసలో చేరుతున్నారంటే నేనేమీ కామెంట్ చేయలేను" అని వ్యాఖ్యాని ంచారు.

### మేం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఫిరాయింపులకు పాల్పడలేదు

తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఫిరాయింపులకు పాల్పడలేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగిందని, ఇక నుంచి పార్టీ అధ్యక్షుడిగా తన పని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్?క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది మీడియా కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పదే పదే అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లు ప్రభుత్వాన్ని పడగొడుతుంటే చూస్తూ ఊరుకుంటామా? అని సీఎం హెచ్చరించారు. కుక్కకాటుకు చెప్పు దెబ్బ అని పెద్దలు




చెప్పారని, కొట్టకుండా ఊరుకుంటామా? అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఎన్నికల నగారా మోగిందని, నేటి నుంచి తన రాజకీయాన్ని చూపిస్తానని రేవంత్? రెడ్డి వెల్లడించారు.రైతు భరోసా గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు 5 ఎకరాలు ఉన్న రైతుల వరకూ రైతు బంధు వారి ఖాతాల్లో పడింది. 62 లక్షల మంది రైతులకు రైతు బంధు సాయం అందింది. ఇకపై గుట్టలు, రోడ్లు, బంగళాలు, లే ఔట్లకు రైతు భరోసా ఇవ్వబోము. ఏ ప్రభుత్వ పథకం అందకపోయినా దరఖాస్తు చేసుకో వాలి. పరిశీలించి అందిస్తాం. రైతుబంధు దుర్విని యోగాన్ని ఆపుతాం. అర్హులందరికీ ఇస్తాం. దుబారా తగ్గించడమే సంపద సృష్టించడం. గత సర్కారు అడ్డగోలుగా జీఎస్టీ మినహాయింపులు ఇచ్చింది. కేంద్రం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేస్తాం. కేసీఆర్ జమానాలో నచ్చితే నజరానా - నచ్చకపోతే జరిమానా అన్నట్లుగా వ్యవహరించారు' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.తమ పోటీ ఏపీ, కర్ణాటకతో కాదని, తమ పోటీ ప్రపంచంతోనేనని సీఎం రేవంత్?రెడ్డి స్పష్టం చేశారు. పెట్టుబడిదారులకు సమాన అవకాశాలు కల్పిస్తామన్నారు. దావోస్ పర్యటనతో రూ.వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామన్న ఆయన, స్థూలంగా రూ.8 లక్షల కోట్ల రుణభారం తెలంగాణపై ఉందని చెప్పారు. రాష్ట్రం వచ్చిన మొదట్లో ఏడాదికి చెల్లించాల్సిన అప్పులు రూ.6 వేల కోట్లు ఉంటే, ఇప్పుడు రాష్ట్రం చెల్లించాల్సిన అప్పులు ఏడాదికి రూ.64 వేల కోట్లు ఉన్నాయని వివరించారు. రాష్ట్రాన్ని నడిపించడానికి ప్రతి నెల రూ.11 వేల కోట్లు కావాలని, కేంద్రంతో చిల్లర తగాదాలకు వెళ్లమని పునరుద్ఘాటించారు. గవర్నర్ వ్యవస్థతో కూడా వివాదాలు కోరుకోవడం లేదని చేశారు. పదవుల పంపకంలో సామాజిక న్యాయం పాటిస్తున్నాం. ఈ విషయంలో మమ్మల్ని వేలెత్తి చూపలేరు. గత సర్కారు రూ.వేల కోట్ల అక్రమాలకు పాల్పడింది. గత సర్కారు అక్రమాలపై విచారణకు ఆదేశించాం. పారదర్శకంగా విచారణ జరుగుతుంది. బాధ్యులపై చర్యలు తప్పవు. జీవోలు దాచి పెట్టే అవసరం లేదు. అన్నీ ప్రజల ముందు ఉంచుతాం. మేం ఎక్కువ విద్యుత్ ఇస్తున్నా, కొన్నిచోట్ల కోతలు జరుగుతున్నాయి. కొందరు కావాలనే వీఐపీల ప్రాంతాల్లో విద్యుత్ కోతలు చేయిస్తున్నారు. అక్కడక్కడ కొన్ని గంజాయి మొక్కలు ఈ పనులు చేస్తున్నాయి అని అన్నారు.

# కేజ్రీవాల్‌కు మరోసారి సమన్లు

**దిల్లీ(జనంసాక్షి):** దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు రెండు సమన్లు జారీ చేశారు.దిల్లీ జల మండలిలో చోటుచేసుకున్న అవకతవకలకు సంబంధించిన కేసులో మార్చి 18న ఈడీ కేంద్ర కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. అంతకముందు శనివారం సాయంత్రం దిల్లీ మద్యం పాలసీ కేసులో మనీలాండరింగ్‌కు సంబంధించి కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేశారు. అందులో మార్చి 21న విచారణకు హాజరుకావాలని తెలిపారు. ఈ కేసులో సమన్లు ఇవ్వడం వరుసగా తొమ్మిదోసారి. గతంలో ఇదే కేసులో ఎనిమిది సార్లు సమన్లు జారీ చేయగా, వాటికి ఆయన స్పందించకపోవడంతో దిల్లీ కోర్టులో ఈడీ రెండు ఫిర్యాదులు నమోదు చేసింది. దీనిపై శనివారం విచారణ సందర్భంగా కేజ్రీవాల్ కోర్టు ముందు హాజరయ్యారు. చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. అదే రోజే సాయంత్రం, మరుసటి రోజు ఆయనకు సమన్లు జారీ చేయడంపై ఆప్ వర్గాలు కేంద్రంపై విమర్శలు చేస్తున్నారు. దిల్లీ జలమండలికి సంబంధించిన కేసులో తప్పుడు కేసు నమోదు చేశారని దిల్లీ మంత్రి అతిశీ ఆరోపించారు. "దిల్లీ జలమండలి బోర్డు కేసు గురించి ఎవరికీ తెలియదు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయలేమని భావించిన కేంద్రం మరో తప్పుడు కేసుతో ఆయన్ను ఇబ్బంది పెట్టాలని చూస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన్ను ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకు భాజపా పన్నిన కుట్రలో భాగమే తాజా సమన్లు. గతంలో కూడా కేజ్రీవాల్‌ను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చేసేందుకునే దిల్లీ మద్యం కేసులో సమన్లు జారీ చేశారు" అని విమర్శించారు.

# అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం కౌంటింగ్ తేదీల్లో మార్పు

కౌంటింగ్‌ను సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కంటే రెండు రోజుల ముందే జూన్ 2వ తేదీన చేపట్టనున్న ఈసీ వెల్లడించింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీల గడువు జూన్ రెండో తేదీన ముగియనున్న నేపథ్యంలో ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.ఇక.. ఏప్రిల్ 19న మొదటి విడతలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అరుణాచల్ ప్రదేశ్‌లో 60 అసెంబ్లీ స్థానాలు, సిక్కింలో 32 స్థానాలకు పోలింగ్ జరగనుంది. తాజా మార్పు ప్రకారం ఫలితాలు జూన్ రెండున వెల్లడికానున్నాయి.

# రేపు సీడబ్ల్యూసీ కీలక భేటీ

అయిన కలబురిగి నుంచి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారని వ్యాఖ్యానించారు. కలబురిగితో పాటు 20 సీట్లలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 28 స్థానాలకు గానూ భాజపా 25 సీట్లు గెలుచుకోగా.. కాంగ్రెస్ కేవలం ఒకే ఒక్క సీటుకు పరిమితమైన విషయం తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి ఏడు విడతల్లో జరగనున్నాయి.

# కవితను విచారించిన ఈడీ అధికారులు

అడ్వకేట్ మోహిత్ రావు చేరుకున్నారు. వీరంతా కవితతో గంటపాటు భేటీ కానున్నారు. కాగా ఈడీ కస్టడీలో ఉన్న సమయంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7గంటల వరకు కుటుంబ సభ్యులను కలిసేందుకు కోర్టు అనుమతిచ్చింది.కవితతో భేటీ అనంతరం న్యాయవాదులు, నిపుణులతో కూడా మాట్లాడుతారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వస్తారని తెలుస్తోంది. న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలన్నదానిపైనే వీరు ప్రధానంగా దృష్టిసారించనున్నారు. ఇక కాగా ఢిల్లీ మద్యం పాలసీ మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను శుక్రవారం సాయంత్రం ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.శనివారం ఉదయం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఆమెను హాజరుపరిచారు. ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్ పాల్ ఎదుట హాజరు పరిచారు. కవిత తరపు న్యాయవాదులు, ఈడీ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ఈనెల 23వరకు కోర్టు ఈడీ కస్టడీ విధించింది. ఆరోజు మధ్యాహ్నం తిరిగి కవితను కోర్టులో హాజరుపర్చాలని అధికారులను కోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పుతో కవితను కస్టడీలోకి తీసుకున్న ఈడీ అధికారులు.. తమ కేంద్ర కార్యాలయంలోని ప్రత్యేక సెల్‌లో ఆమెను ఉంచారు.

# భాజపాకే భారీ విరాళాలు

ఆయా పార్టీకు వచ్చిన విరాళాలుఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల సంఘానికి ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ పూర్తి సమాచారం ఇవ్వలేదని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల నంబర్లు ఎందుకు లేవో చెప్పాలని మార్చి 15 నోటీసులు జారీ చేసింది. తమ ఆదేశాల ప్రకారం బాండ్ల పూర్తి వివరాలు వెల్లడించకపోవటంపై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌బీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తృణమూల్ కాంగ్రెస్ - రూ.1,397 కోట్లు కాంగ్రెస్ పార్టీ - రూ.1,334 కోట్లు భారత రాష్ట్ర సమితి - రూ.1,322 కోట్లు బిజు జనతాదళ్ - రూ.944 కోట్లు డీఎంకే - రూ.656.5కోట్లు. ఇందులో రూ.509 కోట్లు లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ (రాజీనిబితిజీణనీ ఓజీతీబితిని) నుంచే వచ్చాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ - రూ.442.8 కోట్లు తెదేపా - రూ.181.35 కోట్లు సమాజ్‌వాదీ పార్టీ - రూ.14.5 కోట్లు అకాలీదళ్ - రూ.7.26కోట్లు ఏఐఏడీఎంకే - రూ.6.05కోట్లు నేషనల్ కాన్ఫరెన్స్ - రూ.50లక్షలు

# రాబోవు సర్కారుకు మోదీ రోడ్‌మ్యాప్

ఃఎన్నికల సంఘం సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూకు పంపడం ద్వారా ఎన్నికల ప్రక్రియను కెబినేట్ ప్రారంభించింది. ఏప్రిల్ 19న జరగనున్న తొలి దశ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మార్చి 20న జారీ చేస్తారు. నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ఆ దశ పోలింగ్‌కు నామినేషన్ ప్రక్రియ మొదలవుతుంది.మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల షెడ్యూల్? వచ్చిన వెంటనే ఈ సార్వత్రిక మహాసంగ్రామానికి తాము సర్వసన్నద్ధంగా ఉన్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. తన పదేళ్ల హయాంలో దేశం అన్ని రంగాల్లో అమోఘమైన అభివృద్ధిని సాధించిందని తెలిపారు. ప్రస్తుతం విపక్షాల పరిస్థితి చుక్కాని లేని నావలాగ ఉందంటూ ఎద్దేవా చేశారు.తన పదేళ్ల హయాంలో దేశం అన్ని రంగాల్లో అమోఘమైన అభివృద్ధిని సాధించిందని తెలిపారు. ప్రస్తుతం విపక్షాల పరిస్థితి చుక్కాని లేని నావలాగ ఉందంటూ ఎద్దేవా చేశారు. ప్రజలకు విన్నవించుకోవడానికి వారి వద్ద అంశాలే లేవని చురకలు అంటించారు. ' మేము మళ్లీ అధికారంలోకి వస్తే పేదరికం, అవినీతిపై యుద్ధాన్ని మరింత వేగవంతం చేస్తాం. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తాం. గత పాలకులు సృష్టించిన అంతరాలను సరిచేసేందుకు దశాబ్ద కాలం సరిపోయింది. మా పాలనలో దేశ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాం. సుసంపన్న, స్వయంసమృద్ధ భారత్ ఆవిష్కరణకు బాటలు వేశాం. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం ' అని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

# వచ్చే ఎన్నికల్లో ఇండియాదే విజయం

నలు, దుష్ప్రచారం.. పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన పనులివే. ప్రతిపక్షాలు తమ కూటమికి 'ఇండియా' అని పేరు పెట్టినప్పటి నుంచి.. భయంతో భాజపా ఈ పదాన్నే ఉపయోగించడం మానేసింది. ప్రధాని మోదీ విపక్ష నేతలను అవినీతిపరులుగా ముద్ర వేయడం ప్రారంభించారు. కానీ, ఎలక్టోరల్ బాండ్లు మాత్రం.. భాజపానే అవినీతికి పాల్పడిందని నిరూపించాయి. ఇది ఆ పార్టీ వైట్ కాలర్ అవినీతి" అని స్టాలిన్ ఆరోపించారు. దేశానికి ఆ పార్టీ కంటే పెద్ద ముప్పు మరొకటి లేదని దుయ్యబట్టారు. కమలం పార్టీని ఓడించాలని, కన్యాకుమారిలో ప్రారంభమైన ప్రయాణం.. దిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతో ముగియాలని చెప్పారు. దేశ పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది. భాజపా తప్పుడు హామీలు ఇచ్చి దేశ ప్రజలను వంచించింది. కలిసికట్టుగా ఆ పార్టీని గద్దె దించాలి. 'క్విట్ ఇండియా' మాదిరి ముంబయి నుంచే ఆ పిలుపు ఇస్తున్నామని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ ఈడీ, సీబీఐల సా యంలో కేంద్రం ప్రభుత్వాలను పడగొడుతోంది. మా పోరాటం విద్వేష భావజాలంపైనే. వ్యక్తిగతంగా ప్రధాని మోదీ, అమిత్ షాలపై కాదు అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అన్నారు. ప్రజలు ఏకమైతే.. నియంతృత్వం అంతం అవుతుంది శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే దేశాన్ని రక్షించేందుకే 'ఇండియా' కూటమి పక్షాలు ఏకమయ్యాయని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా అన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకే 400కుపైగా సీట్ల గురించి భాజపా మాట్లాడుతోంది. రాహుల్ గాంధీ పేరులో 'గాంధీ' అంటే ఆ పార్టీకి భయం అని మహబూబా ముఫ్తీ అన్నారు. మేం జైలుకు వెళ్లేందుకు కూడా భయపడటం లేదు. అందుకే ఐక్యంగా ఉన్నాం. గెలవాలంటే పోరాడాల్సిందేఅని ఆప్ నేత, దిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు కుట్రలో భాగంగానే నా భర్తను జైల్లో పెట్టారు అని ఝార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ సతీమణి కల్పన వచ్చే ఎన్నికల్లో భాజపాను ప్రజలు ఓడిస్తారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. "భారత్ జోడో వంటి యాత్రలు చేయగల వ్యక్తులు చాలా అరుదు. ఈ విషయంలో బలమైన సంకల్పాన్ని చాటిన మీకు అభినందనలు" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి రాసిన లేఖ విడుదల చేశారు. మణిపుర్‌లో ప్రారంభమైన న్యాయ్ యాత్ర ముంబయిలో ముగిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అఖిలేశ్ కూడా హాజరు కావాల్సింది. అయితే.. ఎన్నికల సన్నద్ధత నేపథ్యంలో రాలేకపోతున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చాలని కాంగ్రెస్ కుట్ర

న కూటమి ఆధ్వర్యంలో బొప్పూడిలో నిర్వహించిన 'ప్రజాగళం' సభకు ప్రధాని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగన్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదని.. వీటిని ఒకే కుటుంబం నడుపుతోందని విమర్శించారు. "ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు రెండు సంకల్పాలు తీసుకోవాలి. ఒకటి.. కేంద్రంలో ఎన్డీయే సర్కారును మూడోసారి స్థాపించటం, రెండోది.. రాష్ట్రంలో అవినీతి వైకాపా సర్కారుకు చరమగీతం పాడటం. ఐదేళ్లలో ఏపీ అభివృద్ధి కుంటుపడింది. దేశంతో పాటు, ఏపీ అభివృద్ధి కాంక్షించే వారంతా ముందుకొచ్చి ఎన్డీయేకు ఓటేయాలి. రాబోయే ఐదేళ్లు చాలా కీలకం. ఎన్డీయేతోనే రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ పన్నాగాన్ని గుర్తించి ఎన్డీయేకు ఓటు వేయాలి" "కోటప్ప కొండ దగ్గర బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల ఆశీర్వాదం లభించినట్టు భావిస్తున్నా. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి దృఢమైన నిర్ణయాలు తీసుకోవాలి. ఈసారి ఎన్నికల ఫలితాలు జూన్ 4న రాబోతున్నాయి. అంటే ఎన్డీయే కూటమికి 400 పైచిలుకు సీట్లు వస్తాయని సూచనలా కనిపిస్తోంది. ప్రాంతీయ భావాలతోపాటు, జాతీయ భావాలను కలుపుకొని కూటమి ముందుకెళుతోంది. ఇందులో భాగస్వాముల సంఖ్య పెరిగితే మరింత బలం పెరుగుతుంది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇద్దరూ చాలా కాలం పాటు ఆంధ్ర రాష్ట్ర వికాసానికి చేసిన కృషి, వారి పోరాటాన్ని గుర్తించాలి. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాలి. అప్పుడే వికసిత ఆంధ్రప్రదేశ్ సాధ్యం""ఇండియా కూటమిలోని పార్టీలు పరస్పరం విరుద్ధంగా మాట్లాడుతుంటాయి. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ కూటమి పరస్పరం పోటీ పడతాయి. దిల్లీలో మాత్రం కలిసిపోతాయి. కాంగ్రెస్ ఇండియా కూటమి మిత్రులను వాడుకుని వదిలేస్తుంది. ఇండియా కూటమి అవసరాల కోసం ఏర్పాటైన స్వార్థపరుల బృందం. నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శత జయంతి సందర్భంగా రూ.100 వెండి నాణెం విడుదల చేశాం. రాముడు, కృష్ణుడిని ఎన్టీఆర్.. తెలుగు సమాజంలో సజీవంగా ఉంచారు. ఆయన పోషించిన రాముడు, కృష్ణుడి పాత్రలు అజరామరం. తెలుగు వారికి కాంగ్రెస్ చేసిన అవమానంతోనే తెదేపా పుట్టింది. కాంగ్రెస్‌ను ఎన్టీఆర్ మట్టికరిపించారు. తెలుగువారి ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు ఎన్డీయే ప్రభుత్వం.. 'భారత రత్న' ఇచ్చి గౌరవించింది""ఎన్డీయే సర్కారులో ప్రతిఒక్కరూ పేదల కోసం పనిచేస్తారు. ఆవాస్ యోజన కింద ఏపీలో 10 లక్షల ఇళ్లు ఇచ్చాం. జలజీవన్ మిషన్ కింద కోటి ఇళ్లకు తాగునీరు అందించాం. కిసాన్ సమ్మాన్ నిధితో పల్నాడు ప్రజలకు రూ.700 కోట్లు ఇచ్చాం. ఆయుష్మాన్ భారత్‌తో ఏపీలో 1.25 కోట్ల మందికి లబ్ధి జరిగింది. ఆంధ్రప్రదేశ్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాం. విజయనగరం జిల్లాలో జాతీయ గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. విశాఖలో ఐఐఎం, ఐఐఈ, తిరుపతిలో ఐఐటీ, ఐసర్, మంగళగిరిలో ఎయిమ్స్ నిర్మించాం. పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ యువత కోసం అనేక జాతీయ విద్యా సంస్థలు నెలకొల్పాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఇవి స్థాపించాం. వచ్చే ఐదేళ్లూ డబుల్ ఇంజిన్ సర్కారుకే అవకాశం ఇవ్వండి. ఏపీలో నీలి విప్లవానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. మహిళలు, యువతకు కొత్త అవకాశాల సృష్టికి ప్రణాళికలు ఏర్పడుతాయి" అని మోదీ అన్నారు.

**లైటింగ్ టవర్లపైకి అభిమానులు.. వెంటనే జోక్యం చేసుకున్న ప్రధాని**

చిలకలూరిపేట: బొప్పూడిలో ఎన్డీయే కూటమి ప్రజాగళం సభలో ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగిస్తున్న సమయంలో పలువురు అభిమానులు..బారికేడ్లు, లైటింగ్ టవర్లపైకి ఎక్కారు. అది ప్రమాదకరం కావటంతో ప్రధాని మోదీ వెంటనే జోక్యం చేసుకున్నారు. దయచేసి కింద దిగాల్సిందిగా యువకులను కోరారు. విద్యుత్ తీగల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అర్థం చేసుకోవాలన్నారు. ప్రధాని మాటలు అర్థం చేసుకోవాలని పవన్ కూడా చెప్పటంతో అభిమానులు కిందకు దిగారు.

# భాజపాలో చేరిన అరూరి రమేష్

ఆ పార్టీ నుంచి ఆయనకు హామీ లభించినట్లు సమాచారం. ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో భాజపాకు సంబంధం లేదని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భారాస నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ భాజపాలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ఎమ్మెల్సీ కవిత పీఏలు, బినామీలు అప్రూవర్‌గా మారి మద్యం కుంభకోణం కేసులో వివరాలు ఇస్తున్నారని చెప్పారు. "అవినీతిపరులు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదు. కోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని కవిత చెప్పాలి. బినామీలతో మద్యం వ్యాపారాలు మీరు చేసి మాపై విమర్శలా? ఈడీ స్వతంత్ర సంస్థ.. దానికి అధికారాలు ఉంటాయి. హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీపై గెలుస్తాం. కాంగ్రెస్ హామీలు ఫ్లెక్సీల వరకే అమలవుతున్నాయి." అని కిషన్‌రెడ్డి అన్నారు.

# బీజేపీకి ప్రయోజనంగా ఎలక్షన్ షెడ్యూల్

చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లయిందని ప్రతిపక్షాలు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వచ్చే లోక్‌సభ ఎన్నికలే చివరి అవకాశం అని కాంగ్రెస్ స్పష్టం చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే 2024 లోక్‌సభ ఎన్నికలు భారతదేశానికి న్యాయ్ తలుపును తెరుస్తాయి. ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాం గాన్ని నియంతృత్వం నుంచి రక్షించడానికి ఇది బహుశా చివరి అవకాశం కావచ్చని పేర్కొన్నారు. ప్రజలమైన మనం అందరూ కలిసి ద్వేషం, దోపిడీ, నిరుద్యోగం, ధరల పెరుగుదల, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడదామని ఖర్గే అన్నారు. నేను దా దాపు 12 ఎన్నికల్లో పోటీ చేసాను. అప్పుడు నాలుగు దశలు కూడా లేవు. అయితే ఇప్పు డు ఎలక్షన్ కమిషన్ మోదీ ప్రచారం కోసం ఏడు దశలు పెట్టినట్లు అనిపిస్తోందని అన్నారు.

# ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్

(ప్రత్యేక ప్రతినిధి - జనం సాక్షి)





ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించవచ్చని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. రాబోయే జనరల్ ఎన్నికల చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి అవగాహన కల్పించేందుకు కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులకు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రానున్న జనరల్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని దానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని అన్నారు. అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, ఎన్నికల డ్యూటీ చేస్తున్నటువంటి అధికారులు మోడల్ కోడ్ అఫ్ కండక్ట్‌లోని అంశాలపై, ఎన్నికల బందోబస్తు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, సిబ్బంది మోహరింపు, కేంద్ర బలగాలతో సమన్వయం తదితర అన్ని అంశాలపై పోలీసు అధికారులకు స్పష్టత ఉండాలని అన్నారు. దానికి అనుగుణంగా పోలీసు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులకు ఎన్నికల నియమావళి పట్ల ఎటువంటి అవగాహనా రాహిత్యం లేకుండా, వారికి గల పలు సందేహాలను నివృత్తి చేసేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు వల్నరబుల్ పోలింగ్ ప్రాంతాలకు గుర్తింపు పట్ల స్పష్టత ఉండాలని, ఎన్నికల నిర్వహణలో పోలీస్ పాత్ర భద్రత దళాల మోహరింపు నామినేషన్ దాఖల నుండి ప్రచారం పోలింగ్ రోజు నిర్వహణ తదితర అంశాలపై చేపట్టే ప్రణాళికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఎలా శాంతి భద్రతను పర్యవేక్షించాలని, ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్ల చేపట్టవలసిన ప్రత్యేక చర్యలు, ప్రత్యేక బందోబస్తుపై సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని గత ఎన్నికల్లో అమలు చేసిన గుడ్ ప్రాక్టీస్‌ను అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ముందే ఈ విధంగా అయినా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల ఎన్నికల నిర్వహణ మరింత సులభతరంగా ఉంటుందని అన్నారు. ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఉత్తమ విధానాలు, పారదర్శకత పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. గత ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలి. వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలి. ఎన్నికల సమయంలో జైలు నుండి బయటకు వచ్చిన వారి వివరాలు సేకరించాలి. ట్రబుల్ మంగర్స్ పై నిఘా ఉంచాలి వారిని పోలీస్ స్టేషన్ లకు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలి. సేన్సేసినల్ కేసులలో నిందితులు, కమ్యూనల్ ఆఫెండర్స్, గొడవలు సృష్టించే వారిని లా అండ్ ఆర్డర్ సమస్య కలింగించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. ఎన్‌బిడబ్ల్యూలు, మిగిలిన వారిని కూడా గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ఆయుధ లైసెన్స్ కలిగిన వారి వద్ద నుండి ఆయుధాలను డిపాజిట్ చేపించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం అక్రమ రవాణా, అనుమానిత వాహనాల తనిఖీ, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ తదితర భద్రతా సంబంధిత అంశాలను సీపీ తెలిపారు. రామగుండం కమిషనర్ పరిధిలోని ఈరోజు నుండి వారం రోజులపాటు పోలీస్ అధికారులకు తరువాత ఏ ఎస్సై హెచ్ సి , పీసీ లకు ఎన్నికల సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రెండు జిల్లాలకు సంబంధించిన ఏసీపీలు సిఐలు, ఎలక్షన్ సెల్ సీఐ,ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ‘ఫిషరీస్ ఫెడరేషన్’ పాలకమండలి ఎన్నికలు నిర్వహించాలి

- తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పిట్టల రవీందర్



**హైదరాబాద్, మార్చి 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఫిషరీస్ ఫెడరేషన్)కు నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామిక స్ఫూర్తికి, సహకార వ్యవస్థ నియమ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పిట్టల రవీందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుండి పది సంవత్సరాలుగా రాష్ట్రంలో మత్స్య సహకార సంఘాల వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. అదే సాంప్రదాయాన్ని, పద్ధతులను కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూడా కొనసాగించడం శోచనీయమన్నారు. కొత్తగా ఏర్పాటు అయిన 23 జిల్లాలకు సహకార సంఘాలను నమోదు చేసి, ప్రజాసామిక పద్ధతిలో సహకార చట్టాల ప్రకారం 33 జిల్లాలలో ఎన్నికలు నిర్వహించి, రాష్ట్రస్థాయి సమాఖ్య (ఫిషరీస్ ఫెడరేషన్)కు పాలక మండలిని నియమించాల్సి అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలలో ఇప్పటికే అడహాక్ (తాత్కాలిక) కమిటీలను ఎంపిక చేసుకొని, జిల్లా సహకార సంఘాల నమోదు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని, కొన్ని జిల్లాలలో జిల్లా సహకార సంఘాలకు కూడా పూర్తిస్థాయి ఎన్నికలు నిర్వహించారని, మిగిలిన జిల్లాల అన్నింటికీ పూర్తిస్థాయి కమిటీల ఏర్పాటుకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి రాష్ట్రస్థాయి ఫెడరేషన్ కు పూర్తిస్థాయి పాలక మండలిని నియమించవలసిన తరుణంలో మళ్లీ నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్ ను నియమించడం చట్టవిరుద్ధమని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునరాలోచించుకొని, నామినేటెడ్ చైర్మన్‌ను నియమించే పద్ధతికి స్వస్తి పలికి, ప్రజాస్వామికంగా అన్ని జిల్లాలకు జిల్లా సహకార సంఘాల ఎన్నికలను పూర్తిచేసి, రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఫిషరీస్ ఫెడరేషన్)కు పూర్తిస్థాయి పాలక మండలిని ఎంపిక చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు.

# కార్పొరేషన్ అభివృద్ధి పేరుతో సింగరేణి కార్మిక కుటుంబాలను తరలించడం సరికాదు

- బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య



గోదావరిఖని, మార్చి 17 (జనం సాక్షి): సింగరేణి డైరెక్టర్ -పా ఎన్ వి కే శ్రీనివాస్ కు సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ యూనియన్ ఆధ్వర్యంలో మెమోరాండం ఇచ్చారు. అనంతరం యాదగిరి సత్తయ్య అధ్యక్షులు మాట్లాడుతు సింగరేణి క్వార్టర్స్ నివాస ప్రాంతాలైన సంస్థలో 30 సంవత్సరాల నుండి నివాసం,క్వార్టర్ అలాట్ మెంట్ సంస్థ ద్వారా తీసుకొని నివసిస్తున్న న్యూ అశోక్ నుండి కళ్యాణ్ నగర్, ఓల్డ్ అశోక్ ఎదురుగా వికె రెడ్డి స్వీట్ హౌస్ నుండి మసీద్ టర్నింగ్ వరకు ప్రభుత్వం అభివృద్ధి పేరిట కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నా విధానాలను ఖండిస్తున్నామని జాతీయ సంపదను తీయడం కీలక భూమిక పోషించిన కార్మికుల సంక్షేమాన్ని వదిలి యాజమాన్యం కూడా నిబంధనలకు నీళ్లు వదిలి అక్రమంగా నోటీసులు జారీ చేసి నివాసం ఉన్న క్వాటర్స్ ఖాళీ చేయాలని నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ప్రభుత్వ, యాజమాన్యం విధానాలను పునరాలోచించాలని కోరారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వాలు మారినాకొద్ది నిబంధనలు మార్చి కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడడం హాస్యాస్పదమని తెలిపినారు, కార్మికుల నివాస ప్రాంతాలైన క్వార్టర్స్ మినహాయించి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్ జీ-1 బీ ఎం ఎస్ ఉపాధ్యక్షులు ఆకుల హరిన్ పటేల్ , కార్యదర్శి సాయవేని సతీష్ డిమాండ్ చేశారు.

## యూఎస్ సియాటిల్ నగరంలో
# కాంగ్రెస్ వంద రోజుల పాలన వేడుకలు



**హైదరాబాద్, మార్చి 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అమెరికాలోని సియాటిల్ నగరంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర నేషనల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, సియాటిల్ ఐఓసీ అధ్యక్షులు రాహుల్ సూర్యోదయ సిటెల్ ఐఓసీ నాయకులు యశ్వంత్ రిషి, సాయి చరణ్ ల ఆధ్వర్యం లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి సోదరులు జగదీశ్వర్ రెడ్డి అనుముల హాజరయ్యారు. వీరితో పాటు ఐఓసీ నేషనల్ టీం సభ్యులు సందీప్ వంగల, నరేందర్ ఎల్మరెడ్డి, మాధవ నెమలి, శ్రీనివాస్ రామసహాయం, తిరుపతి పోచంపల్లి, రామ రాజు, సుధీర్ రెడ్డి, నర్స, ప్రణయ్ ముత్యాల, అజయ్ గౌడ్, బీవీ రెడ్డి, వివిధ రాష్ట్రాల నుండి పాల్గొన్నారు. ముఖ్య అతిథులు, వరంగల్ ఎమ్మెల్యే కుమార్తె నాయిని రాజేందర్ రెడ్డి కుమార్తె డాక్టర్ గోదా నాయిని పాల్గొన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి వంద రోజుల పాలన బాగుందని చెప్పారు. ఈ కార్యక్రమం అమరవీరులు, గద్దరన్నకు నివాళి అర్పిస్తూ ప్రారంభించారు. ఎన్ఆర్ఐల కోసం తాను మధ్యవర్తిగా వ్యవహరించి సమస్యలను ప్రభుత్వానికి చేరవేస్తానని జగదీశ్ సభాముఖంగా తెలియజేశారు.

# కొత్తపల్లి మాజీ తహసీల్దార్ ఇంట్లో సోదాలు



- మాదాపూర్‌కు వెళ్లి తనిఖీ చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు

**కరీంనగర్ బ్యూరో, మార్చి 17 (జనం సాక్షి) :** నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడంతో పాటు బాధితుడి భూమిని ఆక్రమించిన కేసులో కరీంనగర్ జైలులో రిమాండ్లో ఉన్న కొత్తపల్లి మాజీ తహసీల్దార్ చిల్లా శ్రీనివాస్ ను శనివారం ఉదయం కోర్టు ద్వారా 48 గంటల పోలీసు కస్టడీకి తీసుకుని అదే రోజు కరీంనగర్ లోని శ్రీనివాస్ ఇల్లు, గెస్ట్ హౌస్లో సోదాలు నిర్వహించిన పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్న విషయం విధితమే, అయితే ఆదివారం నాడు హైదరాబాద్ మాదాపూర్ లోగల తన మరో ఇంటిలో కూడా సోదాలు నిర్వహించి అక్కడి నుండి కూడా కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నారని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

## నగదు, మద్యం
# అక్రమ తరలింపుపై నిఘా

**హైదరాబాద్, మార్చి 17 (జనంసాక్షి) :** లోక్ సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో నేడు మొదటి రోజున పోలీస్ శాఖ ద్వారా 1,46,350 రూపాయల విలువ గల వస్తువులను సీజ్ తో పాటు 9.11లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకొని ఇద్దరి అరెస్టు చేయడమే కాకుండా ఇద్దరి వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జి హెచ్ ఏం సి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మొదటి రోజు నుండే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయుటకు యస్ యస్ టి, ఎఫ్ యస్ టి బృందాలు పోలీస్ శాఖ తనిఖీ లు ముమ్మరంగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అసెంబ్లీ నియోజక వర్గానికి ఉదయం ఒక టీమ్ రాత్రి మరొక టీమ్ రెండు టీమ్ లను ప్రస్తుతం ఏర్పాటు చేసినట్లు, అతి త్వరలో నియోజక వర్గానికి మరొక టీమ్ మొత్తం 3 టీమ్ లు 3 షిఫ్ట్ లలో 24 గంటల పాటు తనిఖీ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

# మోసాల పునాధులపైన అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ

- పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



**మంథని, మార్చి 17 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ మోసాల పునాదుల పైన వచ్చిన పార్టీ అని, కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రభుత్వం లోకి రావడానికి 420 హామీలు చెప్పి ప్రజలను మోసం చేసి గద్దకక్కారని, కొన్ని చానాల్లను కొనుక్కొని, ఈ ఆరు అమలు చేయకుండానే చేసినట్లు హామీలను ప్రచారం చేసుకుంటున్నారని బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్చార్జ్ పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆరోపించారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో నేపథ్యంలో మంథని నియోజకవర్గం పరిధిలోని కమాన్ పూర్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ యువ నాయకులు ఇనుగంటి రామారావు నివాసంలో పార్టీ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ దిశా నిర్దేశం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసమే బిసి కుల గణన అని తెరలేపారని అన్నారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. అంటున్న ముఖ్యమంత్రి, హామీ గాని ఆరు గ్యారంటీ ల ప్రచారం కోసం పేపర్ ప్రకటనల కోసం డబ్బులు ఎక్కడ నుండి వస్తున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గంలో నడిచే ఇసుక లారీలు పుట్ట మధువి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేశారు.. కానీ ఇప్పుడు బాజాప్తగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో ఇసుక లారీలు నడుస్తున్నాయని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



# ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలికిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, మార్చి 17 (జనంసాక్షి) :** ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధంఖర్ తెలంగాణ పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణం అవుతున్న సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో గవర్నర్ తమిలీసై తో కలిసి, రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వీడ్కోలు పలికారు.

# కక్షిదారులకు సత్వర న్యాయం దిశగా కోర్టులు పని చేయాలి

- హైకోర్ట్ జడ్జి కె.లక్ష్మణ్




**నర్సంపేట జనం సాక్షి (మార్చి 17) :** కక్షిదారులకు సత్వర న్యాయం దిశగా కోర్టులు పని చేయాలని హైకోర్టు జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. నర్సంపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జ్, అదనపు జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ మరియు నామావరపు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ. 1937 వ సంవత్సరంలో ప్రారంభమైన నర్సంపేట కోర్టుకు ఎంతో ఘన చరిత్ర కలిగి ఉందని,ఎంతో అనుభవజ్ఞులైన ప్రతిభ గల న్యాయవాదులు ఈ కోర్టులో పనిచేయడం ఈ ప్రాంత వాసుల అదృష్టం ఆని తెలిపారు. ఈ కోర్టు ద్వార అనేకమంది పేద ప్రజలకు న్యాయం చేకూర్చడం జరిగిందని తెలిపారు. కేసులు ఎక్కువ పెండెన్సీ ఉన్న కారణంగా అడిషనల్ కోర్ట్స్ మంజూరు చేశామని, ఇకనుండి సంవత్సరాల కొద్ది పెండింగ్ ఉన్న అనేక కేసులకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. న్యాయవాదులంతా ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ,ప్రతిభను సంతరించుకుంటూ కక్షదారులకు న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించెలా చేయాలని కోరారు. ఈ సందర్భంగా నర్సంపేట బార్ అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు పూర్వకాలపు బిల్డింగ్ ను రెనోవేషన్ చేయించాలని, రికార్డు రూమ్లను సరైన రీతిలో భద్ర పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా అదనపు జిల్లా న్యాయస్థానాన్ని నర్సంపేటకు మంజూరు చేయాలని కోరగా నేటి ముఖ్య అతిథులైన జడ్జిలు సానుకూలంగా స్పందించారు. నేటి కార్యక్రమంలో భాగంగా 30 సంవత్సరాల పైగా న్యాయవాద వృత్తిలో నర్సంపేట కోర్టులో పనిచేస్తున్న సీనియర్ న్యాయవాదులు ముఖ్య అతిథులచే సన్మానం పొందారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు రిజిష్టర్ నందికొండ నర్సింగరావు వరంగల్ జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, హన్మకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి,సబ్ జడ్జి సాయి కుమార్,జూనియర్ సివిల్ జడ్జి శిరీష మరియు జిల్లా లోనీ వివిధ కోర్టు ల న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్ యాదవ్ , కార్యదర్శి సీలువేరు కిరణ్ కుమార్ , ఉప అధ్యక్షుడు పుట్టపాక రవి మరియు సీనియర్ అడ్వకేట్ అంబటి శ్రీనివాస్ ,కొడిదెల సంజయ్ కుమార్,తండా సరంగపాని,తోగరు నర్సింహారెడ్డి,అర్ లక్ష్మీ నారాయణ,,షేక్ రెహముద్దిన్, మోటురీ రవి, పోనుగోటి అజయ్, కొడెం శ్రీధర్, జన్ను మహెంధర్,టీ సునిత,డి రంగనాధ స్వామి, గుళ్ల ప్రభాకర్, మంకలి ప్రభాకర్,తిరుమల్ చౌహాన్, బొడ్డుపెల్లీ అజయ్, టి స్రవంతి, నాగుల రమేష్,చాగంటి సూరయ్య,జంపాల కెదారి,కోంగరి రాజు, రాజేందర్,మంచిక రమేష్, రఫీ,బోట్ల పవన్,తాళ్లూరి కృష్ణ,కంశాని అశోక్,నాందగిరి రజనీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రజాకార్లు సినిమాకు నారాయణమూర్తి ఇమేజ్!

నారాయణ మూర్తి సినిమా దర్శకుడు నిర్మాతగా మారినప్పటి నుండి అనేక ఆర్థిక సమస్యల మధ్య తనకు తోచిన పద్ధతిలో ప్రజా ఉద్యమాలు సాయుధ పోరాటాలు కమ్యూనిజం ఇతివృత్తంగా సినిమాలు తీస్తూ మాస్ ను ఆకర్షించే మాస్ సినిమాలు గా సక్సెస్ అయినాడు.ఆ సినిమాలు కమ్యూనిస్ట్ లు లేదా నక్సలైట్ల సినిమాలు అని సాధారణ ప్రజలు భావించారు. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా దోపిడీ విధానాల పై ప్రజలు ఇష్ట పడ్డారు.కానీ ఆ సినిమాలలో వ్యక్తిగత హీరో వర్షిప్ ను అరాచక పద్ధతులను చూపించడం లాంటి విమర్శ గురి అయ్యే విషయాలు అనేకం వున్నాయి.

ఇతర దర్శకులు, నిర్మాతలు ,నటులు సినిమాలు రిలీజ్ అయిన సందర్భంగా లేదా హిట్ అయిన సందర్భంలో తమ సినిమాలను ప్రమోట్ చేసుకోవడానికి ఎర్ర సినిమా దర్శకుడుగా నారాయణ మూర్తి కి వచ్చిన ఇమేజ్ ను వాడుకుంటున్నారు.వివిధ ఈవెంట్ లలో నారాయణ మూర్తి చేత ప్రసంగం చేయించడం ద్వారా సినిమా బూస్టింగ్ ను కొనసాగిస్తున్నారు. నారాయణ మూర్తి ప్రసంగాలలో కమ్యూనిజం ఏమి లేదు .వారికి భజన చేయడం వ్యాపార విలువలను పెంచే విధంగా వుంటూ నిర్మాతలను డైరెక్టర్లను నటులను ఆకాశానికి ఎత్తి పట్టడమే వుంటున్నది. అయితే ఇవి ఎప్పుడు సమాజంలో తీవ్ర చర్చ విషయాలుగా ముందుకు రాలేదు.కానీ రజాకార్లు సినిమా రిలీజ్ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడిన ప్రసంగంలో చరిత్రకు విరుద్ధమైన వ్యాఖ్యానాలు మత రాజకీయ వ్యాఖ్యానాలు వున్నాయి. నారాయణ మూర్తి బిజెపి మత రాజకీయాలకు మద్దతు ఇస్తూ భూస్వాములకు నైజాంకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పటేల్ నాయకత్వం లోయూనియన్ సైన్యాలు అణచివేయడం తెలంగాణ ప్రజల విముక్తిగా చెప్పడం బిజెపి మత రాజకీయంలో



భాగమే అవుతుంది

రజాకార్ల దుర్మార్గానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ ప్రసిద్ధి చెందింది.ఈ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ కమ్యూనిస్ట్ పార్టీ.ఈ పోరాటంలో వేలాది ప్రజలు కమ్యూనిస్ట్ కార్యకర్తలు త్యాగం చేసినారు.నిజాం రజాకార్ల ను మట్టి కరిపించి తెలంగాణ లో శ్రామిక వర్గ అధికారం కోసం ఘర్షణ పడుతున్న సందర్భంగా యూనియన్ మిలటరీ వచ్చి నాటకీయంగా నిజాంను లొంగ తీసుకొని ఒప్పందం చేసుకున్న చరిత్ర కేంద్ర ప్రభుత్వ విద్రోహ కర పాత్రగా చరిత్ర లో నమోదు అయింది .నిజాంతో ఒప్పందం చేసుకొని కమ్యూనిస్ట్ యోధుల పై ప్రజల పై కొనసాగించిన మారణకాండ భూస్వాములు తిరిగి ఆధిపత్యం చెలాయించడానికి ఉపయోగ పడింది.

కమ్యూనిస్ట్ లను దెబ్బతీసి గ్రామ రాజ్యాల అధీనం లో వున్న భూస్వాముల భూములను భూస్వాములకు కట్ట పెడుతూ తిరిగి భూస్వామ్య ఆధిపత్యాన్ని కొనసాగించిన చరిత్రనే పటేల్ నాయకత్వం లో యూనియన్ సైన్యాలు కొనసాగించిన తెలంగాణ ప్రజల పై యుద్ధ భీభత్సంతెలంగాణ సాయుధ పోరాటంలో అన్ని కులాల మతాల ప్రజలు వుంటే ముస్లిం వ్యతిరేక పోరాటం గా చిత్రీకరించడం బిజెపి మత రాజకీయాలలో భాగం గా అనేక సంవత్సరాల నుండి చేస్తున్న ప్రచారం తెలంగాణ ప్రజలు నిరంతరం తిప్పి కొట్టు తున్నారు.

చరిత్రను బిజెపి వక్రీకరించడం సాధ్యం కాదు . నైజాం ముస్లిం గా వుండి రజాకార్ల గ్యాంగ్ లో హిందువులు వున్న విషయం నైజాంకు గ్రామాల్లో పునాది హిందూ భూస్వా ములే వున్న విషయం చరిత్ర ను తుడిపెస్తే పోయేది కాదు. తెలంగాణ సాయుధ పోరాటం నైజాం కు వ్యతిరేకంగా భూస్వాములకు వ్యతిరేకంగా కుల మత బేధాలు లేకుండా తెలంగాణ సమాజం అంతా పోరాడిన చరిత్ర ను ఎవరు మార్చలేరు.

నారాయణ మూర్తి ప్రజా ఉద్యమాల చరిత్ర కు భిన్నంగా భూస్వామ్య మత భావజాలల మధ్య బంధీ అయి బిజెపి ద్వారా ప్రయోజనాలు ఆశిస్తే భంగ పాటే అవుతుంది.

నారాయణ మూర్తి ఎప్పుడు ఎక్కడ కమ్యూనిస్ట్ పార్టీ సాధారణ సభ్యుడు కూడా కాదు.అయితే మొదటి నుండి కమ్యూనిజం కోరుకునే వ్యక్తి.దానర్థం నిస్వార్థ కమ్యూనిస్ట్ ఏమి కాదు. తాను అర్థం చేసుకున్న కమ్యూనిస్ట్ రాజకీయాల తో సినిమా అనే వ్యాపార కళా రంగంలో కొంత ఉదర పోషణ కొంత కళా పోషణ కొంత ప్రజా. ఉద్యమాల మద్దతు పాత్ర వహిస్తున్న వాడు.ఇప్పుడు మత రాజకీయాలకు దోపిడీ వర్గాలకు వంత పాడుతాడా?

**- జంపన్న**

# ఎర్రజెండా పార్టీలే కీలకం!

తెలంగాణ లోని మొత్తం 17 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి లో ఎర్రజెండా పార్టీ లకు మూడు నుంచి ఐదు పర్సెంట్ ఓట్లు ఉంటాయి. కోల్ బెల్ట్ లో అయితే 12 నుంచి 25 శాతం ఓట్లు ఉంటాయి. కోల్ బెల్ట్ లోని 11 అసెంబ్లీ నియోజకవర్గం లలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు సిపిఐ పార్టీ ప్రముఖంగా దోహద పడింది. కొత్తగూడెంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కు ఉన్న వ్యక్తిగత పలుకుబడి, పార్టీ బలం తో పాటు , కాంగ్రెస్ మద్దతు తో ఆ స్థానంను సిపిఐ సాదించుకోగలిగింది. సిపిఎం, సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ పార్టీల మద్దతు కూడ కాంగ్రెస్ కు పలు చోట్ల ఎస్సెట్ అయ్యింది.త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడ కమ్యూనిస్టుల మద్దతు కాంగ్రెస్ కు ఎంతో ముఖ్యం, ప్రధానం అనే విషయాన్ని కాంగ్రెస్ లో గుర్తిస్తున్నారా, లేదా, తెలియదు కాని, రాష్ట్రంలో చాప క్రింద నీరులా బీజేపీ విస్తరిస్తున్న విషయాన్ని విస్మరించడం మంచిది కాదు! లౌకికవాద శక్తులు రాష్ట్రానికి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కి అవసరం, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మద్దతు కూడ కాంగ్రెస్ కు గత అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా పని చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లోను టిజెఎస్ మద్దతు కొనసాగుతుంది. స్వయం కృతా పరాధం ఫలితం గా,ఒక వైపు బిఆర్ఎస్ బలహీన పడిపోయింది. బిఆర్ఎస్ స్థానం లో బీజేపీ ని తీసుకుని రావాలని కొన్ని శక్తులు చేస్తున్న ప్రయత్నాల కు రాష్ట్రంలో 2019 పార్లమెంట్ ఎన్నికల్లోనే బీజం పడింది. విషయాన్ని అప్పుడు రెండోసారి అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ , ముఖ్యం గా కేసీఆర్ నిర్లక్ష్యం చేసారు.ముందు టిడిపి, ఆ తర్వాత



కాంగ్రెస్ ను బలహీనం చేసే పనిలో మాజీ సీఎం కెసిఆర్ పడ్డారు, తప్ప బీజేపీ ఈ పరిస్థితి ని తనకు అనుకూలంగా మార్చుకుంటున్నదని, ఆ పార్టీ తనని బిఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం అనుకుంటున్నదని కేసీఆర్ భావించలేదు. పైగా పీఎం నరేంద్ర మోడీ తో మంచి సంబంధాలు ఉన్నాయి, అనే నమ్మకం తో ఉన్నారు, అనిపిస్తుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు వామపక్షాలతో పొత్తు ఖాయం అనుకున్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో వారి మద్దతు తీసుకుని బిఆరెస్ అభ్యర్థి గెలిచాడు!అంతా రాసుకుని, పూసుకుని తిరిగారు. తీరా అసెంబ్లీ ఎన్నికలు వచ్చే సరికి, వామపక్షాలతో దోస్తీ కట్ చేసేసారు. ఎందుకు? ఏమిటి? తెలియదు! అదే కేసీఆర్ ప్రత్యేకత!ఆయన ఎవరితో ఎప్పుడు స్నేహం చేస్తారో అంతు చిక్కని విషయం!అందుకే ఆయన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహం బెడిసి గద్దె దిగే పరిస్థితి కి ఒక కారణం గా కూడ చెప్పవచ్చు!ఇప్పుడు ఆయన ఒంటరి అయ్యారు. అటు బీజేపీ తో దోస్తానా బెడిసి కొట్టడం తో, బిఆర్ఎస్ తో తమకు ఎలాంటి బంధం, ఒప్పందం లేదని పార్లమెంట్ ఎన్నికలకు ముందే తేల్చి చెప్పాలనే ఉద్దేశం కావచ్చు,ఎమ్మెల్సి కవితను మద్యం స్కాం లో అరెస్ట్ చేశారు.పీఎం మోడీ మూడు రోజులు తెలంగాణ లో, అటు ఆంధ్రప్రదేశ్ లో పర్యటించారు. సభల్లో మాట్లాడారు. హెూమ్ మంత్రి అమిత్ షా కూడ వస్తూ పోతూ ఉన్నారు. బిఆర్ఎస్, కెసిఆర్ సంగతి పక్కన పెడితే, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ని నిలవరించాలి అంటే తప్పని సరిగా వామపక్షాల మద్దతు కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలి. ఆ దిశన టిపిసీసీ అధ్యక్షుడు కూడ అయిన, సీఎం రేవంత్ రెడ్డి యోచించాలి. ఇప్పటికే ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా పని చేస్తారు అనే ఉద్దేశం తో కాబోలు, సీఎం 40 కి పైగా కార్పొరేషన్ లకు ఛైర్మెన్ లుగా పార్టీ నేతలను నియమించారు. వారు అంతా సహజంగానే పదవులు, ప్రోటోకాల్ లు ఉంటాయి కాబట్టి, పార్టీ గెలుపుకు ప్రయత్నం చేస్తారు. టిక్కెట్ల ప్రకటన కూడ త్వరగా జరిగితే రంగం లోకి అభ్యర్థులు కూడ వెలుతారు. గెలిచే గుర్రాల సంగతి పక్కన బెడితే కాంగ్రెస్, దాని కూటమి హవా ప్రస్తుతం తెలంగాణ లో ఉంది కాబట్టి, జాగ్రత్తగా, సమన్వయంతో పని చేసుకుంటే కాంగ్రెస్ కు మంచి ఫలితాలు వచ్చే పరిస్థితి ఉన్నది,అంటే అతిషయోక్తి కాదు! కామ్యూనిస్ట్ పార్టీ ( సిపిఐ ) తమకు ఖమ్మం లేదా వరంగల్ పార్లమెంట్ స్థానం ఇవ్వాలని పట్టు పడుతున్నది.

**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223



# ప్రజాస్వామ్యానికి 'ఓటే' ఊపిరి

ఓటు బుల్లెట్ కంటే బలమైంది
ఓటు మనతల రాతలు మార్చే ఆయుధం
అవినీతి అక్రమార్కుల
రౌడీ మాఫీయా ధన స్వాముల నేర చరితుల రాజకీయాలకు
ఓటుతో వేటు వెయ్యాలి
ఓటరు తనతల రాతను మార్చి రాసే విశ్వసనీయ
అభ్యర్థులకు ఓటు వేసి
సామాజిక ఆర్థిక సాంస్కృతిక వికాసానికి
మార్గదర్శిగా నిలువాలి
అభివృద్ధిచేసే సత్తా ప్రగతి శీల ప్రణాళికలతో ముందుకు వచ్చే
అభ్యర్థులకు ఓటరు మదిలో చోటు ఇవ్వాలి
రాజకీయ అవినీతి అక్రమాలకు ఓటుతో వేయాలి వేటు..

ఎన్నికల్లో ఓటర్లే దేవుళ్ళు
భీరు బిర్యానీ కానుకలకు లొంగక హామీలు అమలు చేసి
అభివృద్ధికి పాటుపడే ఉత్తమ అభ్యర్థులకు ఓటు వేసి
ప్రజాస్వామ్య రక్షకులుగా నిలువాలి
మాయ మాటలు టక్కు టమార విద్యలతో నూతన జిమ్మిక్కుల
తో నీచెంతకు...
వచ్చే నాయకుల నయా వంచనకు పొంగిపోకు
మందు విందు వినోదాలకు
కుంగి పోయి ఆదమరచి ఓటు వేస్తే అవినీతి
రాజ్యమేలుతుంది
పార్టీలు మారి జెండాలు మారి బహు రూపాలతో వచ్చే
ఆయారాం గాయరాం లకు ఓటుతో నిగ్గ తీసి బుద్ధి చెప్పు

అధికారమే ఎజెండాగా
ఎన్నికల్లో గెలుపే పరమావధిగా పోటీ చేసే
అభ్యర్థులను ఓటుతో అడ్డుకోవాలి
ప్రభుత్వాల మార్పుకు ఓటే వజ్రాయుధం
సామాన్యుని సాధికారిత
మహిళా యువజన సాధికారిత సృష్టికి ఓటే మూలం
అరాచక అక్రమాల దోపిడి రాజకీయాల అంతం ఓటరు
పంతం కావాలి
ఓటు చైతన్య దీపిక కావాలి..
ఓటు చట్ట సభలకు నిజమైన ఊపిరి...
ఓటు ప్రభుత్వాల ఏర్పాటుకు ప్రాణావాయువు..
ఓటు కొరకు ఎందరినో పరుగులు తీయిస్తావు.

ఎందరినో ఉరికించి ఊరడిస్తావు...
నచ్చని అభ్యర్థులను ఓడించి గద్దిని కరిపిస్తావు ప్రజా జీవితం
నుండి బహిష్కరిస్తావు
ఓటరా నీకు నీవే ధీటు ప్రపంచమే ఏదీ రాదునీసాటి
ఏపార్టీ అయిన ఏపాటి నాయకుడైన ఓటును
అర్థించాల్సిందే
ప్రజాస్వామ్య ప్రపంచాన్ని నడిపించే నాయకులు
ఓటరుకు సలాం చేయాల్సిందే
ఓటరు నాయకులకు ఆకర్షణ పుంజం
ఓటే నాయకుల గుండెల్లో దడ
పుట్టిస్తుంది
ఓటరు తీర్పే మార్పుకు నాంది
ఓటు బుల్లెట్ కంటె బలమైనది
ఐదేళ్లకు ఒక సారే కదా
నీవు సర్వభౌమునివి
నీ ఓటు నోటుకు నాటుకు లొంగొద్దు
నీఓటు నీచేతిలో పాశుపతాస్త్రం
మెరుగైన రాజకీయాల కొరకు నీ ఓటే
పునాది ..



పోలింగ్ రోజు ఓటు వేయి
ఐదేళ్ల ప్రగతికి బాటెయ్యి
ప్రభుత్వాలు ఏర్పాటులో ఓటే వేగు చుక్క
గెలుపు ఓటములు
ఓటరు చేతుల్లోనే ఉంది
మనీ మందు మత్తులో పడి పోకు ఓటరు ప్రజల తలరాతలు
మార్చి రాసే విధాత కావాలి ప్రజాస్వామ్య విలువలను
రక్షకుడిగా నిలచిపో
పౌర సమాజం ఉన్నతి ఉద్ధరణ నీ చేతిలోనే
ఉంది..
ఓటరా నీచైతన్యంతో
కుళ్లు కుతంత్ర రాజకీ యాలకు చెల్లు చీటి
అవినీతి కి వేటు ఓటు

**నేదునూరి కనకయ్య**
**( నేదునూరి కళ్యాణ్)**
**ఫ్రీలాన్స్ రైటర్ సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక, తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్**
**9440245771**

# జనక్ ప్రసాద్‌కు న్యాయం!



ఐఎన్టియుసి సెక్రటరీ జెనరల్, బొగ్గుగని కార్మికుల వేతన కమిటీ సభ్యులు జనక్ ప్రసాద్ భాజ్ పాయ్ ని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు ఛైర్మెన్ గా నియమించింది.జనక్ కు ఈ విధంగా సీఎం రేవంత్ రెడ్డి పార్టీ లో సీనియారిటిని గౌరవించినట్లు అయ్యింది. జనక్ ప్రసాద్ గతంలో మాజీ పీఎం రాజీవ్ గాంధీ చే కో ఆర్డినేటర్ గా నియమించబడ్డారు.అప్పుడు దేశంలో పార్టీ కో ఆర్డినేటర్ ల హవా ఉండేది. వీరికి పీఎం తో డైరెక్ట్ కాంటాక్ట్ ఉండేది. అలా జనక్ ప్రసాద్ అప్పుడు ఒక వెలుగు వెలిగారు.అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం దివంగత వైఎస్. రాజశేఖర్ రెడ్డి తోను జనక్ కు మంచి అనుబంధం ఉండేది!నేరుగా అపాయింట్మెంట్ లేకుండా ఆయనను కలిసే వారు!ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా కాంగ్రెస్ పార్టీని పట్టుకుని ఉన్నారు జనక్!రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా, స్పోక్స్ మెన్ గా కూడ పనిచేసారు. సింగరేణి లో ఉద్యోగం చేస్తూనే క్లరికల్ సంఘం ( సిక్కా )ఏర్పాటు చేసారు. సిర్పూర్ లో ఒకసారి పార్టీ టికెట్ మీద పోటీ చేసి ఓడిపోయారు.సింగరేణి లో క్రాఫ్ట్ (వృత్తి ) సంఘాలను ఐక్యం చేసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సాజాక్) ఏర్పాటు చేసారు. యూనియన్ ఎన్నికల్లో ఈ సంఘం అప్పట్లో మందమర్రి తదితర ఏరియా లలో విజయం కూడ సాధించింది. కొద్దికాలం తర్వాత ఐఎన్టియుసి లో చేరిపోయారు. జనక్ ప్రసాద్ మంచి వాగ్దాటి ఉన్న నేతగా పేరు ఉన్నది. కాంగ్రెస్ పార్టీ లో సీనియర్ నాయకుడు, సింగరేణి తోనే ఆయన జీవితం, ఎదుగుదల ముడి పడి ఉన్నది, అంటే అతిషయోక్తి కాదు! మొత్తం ఐదు జిల్లాలలో విస్తరించి ఉన్న కోల్ బెల్ట్ నుంచి ప్రభుత్వం లో ఒక నామినేటెడ్ పదవి లభించడం ప్రస్తుతం ఇదే మొదటి సారిగా పేర్కొనవచ్చు!మందమర్రి పట్టణం తో దశాబ్దాల అనుబంధం ఉన్న, అక్కడే ఎక్కువ కాలం నివసించిన జనక్ ప్రసాద్ కు అభినందనలు! తన పదవికి తప్పకుండ న్యాయం చేసి చిరు ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేస్తారని ఆశిద్దాం!

**ఎండి. మునీర్,**
**సీనియర్ జర్నలిస్ట్,**
**9951865223,**

# దాహం దారి

కబురు తెచ్చె పక్షి
నీటి జాడలు లేవని
ఊరి చెరువులు కానరావు
ఊట బావులు లేనె లేవు
ఉన్నచోట ఇండ్లు వెలసె...
జలం తరిగెను
జనాభా పెరిగెను
ఊరుదాటి ఏటిబాట
దాహం తీరె నీటిబాట
వలస పక్షి లాగ జనులు
దారిపట్టే రోజు లొచ్చాయ్...

నీరులేనిజి

చెరువు లేని
చినుకు రాలని
నేల విడిచి
పోక తప్పదు...

నీరే కదా జీవనం
నీరే కదా జీవగంజీ
నీరే కదా బతుకు తెరువు
నీరే కదా చావు పుట్టుక

**రేడియమ్.**
**9291527757**


# తెలుగు సాహితీ సామాజిక అన్వేషణ తదేక

సాహిత్యం అనేది చారిత్రక, రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంకేతిక, అంశాలతో మిళితమై భాష భావుకతతో చెప్పబడినది. పదునైన అక్షరాలతో, లోతైన అర్థాలతో, చెప్పబడిన శిల్ప సౌందర్యం సాహిత్యం. నాటి వేదా కాలము నుండి నేటి సాంకేతిక యుగం వరకు ఈ ప్రపంచం మానవ పరిణామ క్రమంలో వచ్చిన మార్పులు. అది జ్ఞానమైన, ఆత్మజ్ఞానమైన, విద్యా విజ్ఞానమైన, యుద్ధమైన, విప్లవమైన, ఏ సామాజిక పరిణామమైన. పద్యం, గద్యం, పాట, నవల, నాటకం, కథా, కవిత ,వ్యాసంగాలతో రూపుదిద్దబడినది. దీనికి నిదర్శనం డాక్టర్ మహమ్మద్ హసేన గారు రచించిన సామాజిక సాహితి విశ్లేషణతో రూపుదిద్దబడిన సాహిత్య విమర్శ వ్యాసాల సమూహారం "తదేక" ఈ సాహితీ విమర్శలో ఇది ఉంది ఇది లేదు అనే సందేహం లేకుండా సాధ్యమైనా అంతవరకు పాఠకుడికి కావలసిన విధంగా సాహిత్యాన్ని కాచి వడపోసి అత్యంత విలువైన భలమైన సాహిత్యాన్ని అందించారు డాక్టర్ హసేన గారు. ఒకవైపు తెలుగు సాహిత్యంలో మైనార్టీ స్త్రీవాద జీవన చిత్రణ, మరొకవైపు దళిత మైనార్టీ స్త్రీవాద సాహిత్యం తులనాత్మక పరిశీలన, ఇంకొక వైపు తెలుగు సాహితీ కవిత గుబాలింపుల పాటల ప్రవాహాలతో తెలుగు సాహితీ వరవడిని సృష్టించారు హసేన గారు. ఒక తండ్రి కన్నీళ్లు భయాలు బయటికి కనిపించవు. అతను ప్రేమను బయటికి ప్రకటించడు. అతను ఇచ్చే మనోధైర్యమే మన జీవితాలను తీర్చిదిద్దుతాయి."ఏమైనా నాన్న మాటలకందని పదం) నాన్న లేకుంటే అంతా ఉత్తదే/ నా ప్రతి అడుగులో ఆయన పాదముద్రలే"ఎంత పాడిన ఒడవని గీతం అని తెలంగాణ ఉద్యమ గొంతుక అంబటి వెంకన్న గారి కలం నుండి నాన్నపై కవిత ప్రేమ అక్షర ప్రవాహం ఆలోచింపజేస్తుంది.

పెన్నును "గన్ను"గా అక్షరాన్ని "అస్త్రంగా" లేదా "ఆయుధంగా" కూడా వాడతారు సాహితీవేత్తలు. అక్షరాలను ఆత్మగా చేసుకుని బ్రతికిన వాళ్ళు కొందరు. అక్షరాన్ని ఆత్మగా ఆవాహన చేసుకుని మనసుని మదించిన వారు మరికొందరు. "ఇప్పుడొక పలక దొరికితే బాగుండు/చెరిపి రాయాల్సిన జీవితపు పాఠాలు/చాలా గుర్తుకొస్తున్నాయి"బాల్యపు జ్ఞాపకాలు ఎవరికైనా మధురమే. తీరిక లేకుండా జీవితపు పోరాటం చేస్తే నాకు అలానే అనిపిస్తుంది. కొత్త పలక దొరికితే బాగుండునని హసేన్ తన బాల్య జ్ఞాపకాలను కూడా గుర్తు చేసుకున్నారు. అలిశెట్టి స్వరం కవితా భాస్వరం బ్రతికింది కొద్ది కాలమే అయిన బలమైన సాహితి ముద్రవేశారు. సమాజంలోని అవినీతి అక్రమాలను అదరక, చెదరక, బెదరక, కళాని ముందుకు నడిపి కవిత సేద్యం చేసిన కవికర్షకుడు అలిశెట్టి ప్రభాకర్. ఒక నక్క/ప్రమాణ స్వీకారం చేసిందంట/ఇంకెవర్ని మోసగించనని/ఒక పులి/పశ్చాతాపం ప్రకటించిందట/తోటి జంతువుల్ని సంహరించినందుకు/ఈ కట్టు కథ విని/గొర్రెలింకా/పుర్రెలుపుతూనే ఉన్నాయ్/అంటు నాటి నేటి రాజకీయ నాయకుల వర్తించే అక్షర సత్యాలను తన కవిత్వంతో ఆజ్యం పోసిన అలిశెట్టి ప్రభాకర్ జీవితంపై హసేన గారి సాహితీ విమర్శ ద్వితీయ.

తెలుగు సినిమా పూతోటలో పాటల సిరివెన్నెలను కురిపించిన కవి. తాత్వికత, తార్కికత, భావకత, ఆవేదన ఆర్ద్రతతో అచ్చమైన, స్వచ్ఛమైన, సాహితి సొబగులతో సృజనాత్మక పాటలు రాసిన సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి సాహితీ ప్రస్థానం. ఎప్పుడు ఒప్పుకోక వద్దురా ఓటమి.../ఎప్పుడు వదులు కోవద్దురా ఓరిమి/విశ్రమించవద్దు ఏ క్షణం..../విస్మరించవద్దు నిర్ణయం. అంటు నిరాశ, నిస్పృహల, మధ్య కొట్టుమిట్టాడుతున్న వారికి "ఆత్మవిశ్వాసం" కలిగించే ఎన్నో పాటలను అందించిన సిరివెన్నెల సీతారామశాస్త్రికి అక్షర సిరాను ధారపోశారు హసేన గారు.

నూరు సంవత్సరాలలో సాంఘికంగా, రాజకీయంగా, కవిత్వాపరంగా, ఆంధ్రప్రదేశంలో అనేక ఉద్యమాలు తలెత్తాయి.




జాతీయోద్యమం, భావకవితోద్యమం, అభ్యుదయ, దిగాంబర, విప్లవ ,ఉద్యమాలు. స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీ వాద ఉద్యమాలు కూడా చరిత్రకు మరో మార్గం చూపాయి. షాజహానా అనే ముస్లిం కవయిత్రి ముస్లిమ్ స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ఊహ తెలియని వయస్సులో/గుమ్మానికి పరదా కడితే/రంగురంగుల కుచ్చులు చూసి మురిసిపోయే దాన్ని/అప్పుడే స్వేచ్ఛకి మొదటి బేడి అని/తెలుసుకోలేని పసి దాన్ని.../గుమ్మానికి కట్టినట్టే అమ్మ ముఖానికి బురఖా కడితే/స్వప్నం లాంటి జిందగీ కి శాపమని అప్పట్లో తెలియని దాన్ని/ఇలా ముస్లిం స్త్రీల జీవితం పదాల మాటున నలిగిపోవడాన్ని నిరసిస్తూ మీరు బిగించిన ఇనుప సంకెళ్లని విదిలిచ్చి వేయగల గుండె ధైర్యం చాలా ఉందంటూ కవయిత్రి షాజహాన్ తో మిగిలిన ముస్లింవాద కవుల రచన విశ్లేషనను తెలుగు సాహితీ మైనారిటీ స్త్రీవాద జీవన చిత్రణ చేశారు డాక్టర్ హసేన్ గారు.

మన సంస్కృతిలో మన దేశ అభివృద్ధిలో బంజారాల పాత్ర చరిత్ర మరవదు గిరిజన తండాలలో నేడు పాశ్చాత్య సంస్కృతి ప్రవేశించడంతో విషనాగు కోరల్లో చిక్కుకొని విలువలాడుతున్నాయి. బాయీ!/ముంబై గాలి తన్నుకుపోయిందా/అడవి పుష్పమా! నా బంజారా భాష్పమా!!/లంబాడి ఆడపిల్ల/చంప్లి/చంపకండిరా/అది రేపటి ఛాంపియన్/ఆడపిల్లలను అమ్ముకునే దుస్థితిని నేటికీ గిరిజన ప్రాంతాల్లో చూస్తూనే ఉన్నాం. అలానే గర్భంలో ఉన్నప్పుడో, పుట్టిన తర్వాతనో, ఆడపిల్లలను చంపటం గిరిజనుల అమాయకత్వానికి నిదర్శనం. ఆడపిల్లల్ని చంపకండి అదే ఆడపిల్ల రేపటి ఒలంపిక్ ఛాంపియన్ కావచ్చు అని డాక్టర్ హసేన విశ్లేషణ ఆలోచింప చేస్తుంది.

రణరంగం కాని చోటు/భూస్థలమంత వెతికిన దొరకదు/గతమంతా తడిసే రక్తమున/కాకుంటే కన్నీళ్ళతో/ఇతిహాసపు చీకటి కోణం/అట్టడుగున పడి కనిపించని/కథలన్నీ కావాలిప్పుడు/దాచేస్తే దాగని సత్యం/మహాప్రస్థానం ఈ కావ్యం లో దేశ చరిత్రలు శీర్షికతో ఈ కవితను శ్రీ శ్రీ చారిత్రక దృక్పథాన్ని తెలియజేశారు. 1972లో ఓల్గా ప్రతి స్త్రీ ఒక నిర్మలా కావాలి అంటూ స్త్రీవాద కవిత్వానికి బీజం వేశారు. అందమైన దోపిడీకి/పవిత్రమైన హింసకు/న్యాయమైన దాస్యానికి/బలైపోయిన నేను/భారత స్త్రీని!! అంటూ విప్లవ తిరుగుబాటు స్ఫురిస్తు స్త్రీవాద కవిత్వాన్ని సృష్టించారు. నేను పుట్టక ముందే/దేశద్రోహుల జాబితాలో నమోదైఉంది నాపేరు/ముస్లింలను దేశద్రోహులుగా చిత్రించడాన్ని ఖాదర్ మొహీముద్దీన్ కవిత్వీకరించిన తీరును, దళిత మైనార్టీ స్త్రీవాద సాహిత్యాన్ని తులనాత్మక పరిశీలన చేశారు హసేన గారు. తెలంగాణ జీవన చిత్రనకు దర్పణం "పొత్తి"ఈ నవల తెలంగాణలోని సామాజిక జీవన విధానాన్ని గ్రామీణ ప్రాంతపు నేపథ్యాన్ని మాండలిక భాషా పదాలను ఉపయోగించి తెలంగాణ శిల్పాన్ని తెలియజేశారు. తెలుగు సాహిత్యంలో ఇటు భావకవిత్వానికి, అటు అభ్యుదయ కవిత్వానికి, మధ్యయ మార్గంగా సాహిత్యాన్ని కొనసాగించిన వారు బాలగంగాధర్ తిలక్ ఆయన రచన అమృతం కురిసిన రాత్రి/అందరూ నిద్రపోతున్నారు/నేను మాత్రం తలుపు తెరిచి ఇల్లు విడిచి/ఎక్కడికో దూరంగా/కొండ దాటి కోన దాటి/వెన్నెల మైదానంలోకి/వెళ్లి నిలుచున్నాను. అనే తిలక్ గారి అద్భుతమైన కల్పానికి భావ కవిత్వానికి ఓ నిదర్శనం ఈ కవితా సంపుటి 1971లో కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు దక్కించుకొని తెలుగు సాహిత్యానికి గౌరవం దక్కించిన తీరు అద్వితీయంగా వివరించారు రచయిత. ఇక తెలుగు సాహిత్యం విషయానికొస్తే చాలామంది కవులు పలు సృజనాత్మక రచనలు చేసి సమాజంపై జరగని ముద్ర వేశారు. వారిలో డాక్టర్ సి.నారాయణరెడ్డి గారు ప్రముఖులు. నేను పుట్టక ముందే/నెత్తి మీద నీలి తెర/కాళ్ళ కింద ధూళి పొర/ధూళి పొరల్లో పొడిచిన/విత్తుల పొత్తికడుపులో/చెట్లు నెత్తురు పోసుకున్నాయి. ఈ వాక్యాలలో మనకు అర్థమవుతుంది. సీనారే కవిత్వం యొక్క తీరు ఈ విశ్వంభరకు 1988లో జ్ఞానపీఠ అవార్డు వరించటం సీనారే కవిత్వంలోని మానవతావాదం తాత్విక చింతన ప్రకృతి విశ్వాంతరాలకు అద్దం పట్టింది అని డాక్టర్ హసేన అక్షరార్చన అద్భుతం. తెలుగు సాహిత్యము నుండి 2004వ సంవత్సరంలో గుంటూరు శేషేంద్ర శర్మ గారి "నా దేశం నా ప్రజలు" కావ్యం నోబుల్ సాహిత్య బహుమతికి నామినేట్ కావటం తెలుగు సాహిత్యం యొక్క గొప్పతనం. "నదులు కవులు భూగోళపు రక్తనాళాలు/నదులు ప్రవహిస్తాయి/కవితల్లా పక్షుల కోసం పశువుల కోసం/మనుషుల కోసం/నదులు కంటున్న కలలు పొలాల్లో/ఫలిస్తాయి/దరిత్రిని హలం దున్నితే/అప్పుడు అవుతుంది/అది ఒక దేశం/దరిత్రిని కలం దున్నితే/అది ఒక ఇతిహాసం. శేషేంద్ర గారి కవిత్వం గూర్చి ఎంత చెప్పినా తక్కువే అంటున్నారు హసేన గారు. గగనమెక్కిన పాట గద్దరన్న అనే శీర్షికతో గద్దర్ ఒక ప్రభంజనం, ఒక ఉప్పెన, జన సమ్మోహన శక్తి, ప్రజా ఉద్యమకారుడు, ఒక చరిత్ర ,విప్లవం, ఎర్రజెండా చేతబట్టి ,వేదికలెక్కి మానవ సంబంధాల వారధిగా సాహితీ వేతగా ,విప్లవ సాహిత్యానికి సారథిగా ఇలా అనేక కోణాల్లో గద్దర్ ను పరిశీలించి పరిశోధన వ్యాసం రాశారు విమర్శకులు డాక్టర్ హసేన గారు.

హసేన గారు అటు సమాజాన్ని ఇటు సాహిత్యాన్ని మిళితం చేసి చారిత్రక, రాజకీయ, ఆర్థిక ,సామాజిక, సాంస్కృతిక, అంశాలను కోడీకరించి నేటి సాహితీ యువతరానికి సరికొత్త మార్గం చూపారు. ఇది తెలుగు సాహిత్యానికి ఒక పరిశోధనా గ్రంథం "తదేక" సాహిత్యానికి ఒక దిక్సూచిగా చెప్పవచ్చు. తెలుగు సాహిత్య విమర్శకు యువ రక్తం మహమ్మద్ హసేన అని ఆచార్య ధార్ల వెంకటేశ్వరరావు గారు అభిప్రాయాన్ని అక్షరాల నిజం చేశారు. డాక్టర్ మహమ్మద్ హసేన గారికి సాహితీ అక్షర అభినందనలు తెలియజేస్తూ..

**పూసపాటి వేదాద్రి**
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694



## జీవితంలో ఉన్నత చదువులకు తొలిమెట్టు పదిపరిక్షలు

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు మార్చి 17(జనం సాక్షి)**

విద్యార్థిని విద్యార్థుల జీవితంలో ఉన్నత చదువులకు తొలిమెట్టు పదిపరిక్షలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడి, భయాందోళనలకు లోనుకాకండా పరీక్షలు రాసి విజయం సాధించాలని పేర్కొన్నారు. సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసే విద్యార్థిని, విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.జీవితంలో ఉన్నత చదువులకు తొలిమెట్టు అయిన పదో తరగతి పరీక్షలు బాగా రాసి మేరుగైన ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రజా ఉద్యమల ద్వారానే ఫలాలను సాధిస్తాం

- ఎన్నో పార్టీలు పుట్టాయి, కనుమరుగైపోయాయి
- ప్రజా సమస్యలపై పోరాడేదే సిపిఐ పార్టీ
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు




**శంషాబాద్, మార్చి 17 (జనం సాక్షి)**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రంగారెడ్డి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను గత రెండు రోజుల నుంచి శంషాబాద్‌లోని ఎలైట్ హెూటల్లో నిర్వహించారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు శిక్షణా తరగతులో పాల్గొని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో అనేక పార్టీలు పుట్టాయి కనుమరిగిపోయాయి, కానీ సిపిఐ గత 100 సంవత్సరాల నుంచి దేశంలోని అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టి బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం తరపున అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి తోడ్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల తరపున పోరాడి ఫలితాలను రాబట్టాలన్నారు. ప్రజా ఉద్యమం ద్వారానే ఫలితాలను రాబట్టగలం. సిపిఐ అనుబంధ సంఘలను కలుపుకొని ప్రజల తరపున పోరాడాలన్నారు. ఎక్కడ సమస్య వచ్చినా అక్కడ సిపిఐ పార్టీ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు శంకర్ నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, కార్యవర్గ సభ్యుడు రవీంద్ర చారి, సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగరావు, సిపిఐ రాష్ట్ర సభ్యుడు పానుగంటి పర్వతాలు, ఎం యాదిరెడ్డి, సయ్యద్, అప్సర్, యాదయ్య, జిల్లా సభ్యులు కే రామస్వామి, శేఖర్ రెడ్డి, ప్రభు లింగం, జంగయ్య, ఎం శ్రీను, లక్ష్మణ్ ,నీలమ్మ, కిషోర్ ,సిపిఐ మండల కార్యదర్శి నర్రగిరి, జిల్లా సమితి సభ్యులు యాదగిరి పాల్గొన్నారు.

## బోడుప్పల్ వక్ఫ్ భూముల సమస్యకు పరిష్కారం చూపూతాం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**మేడిపల్లి మార్చి 17 (జనం సాక్షి)**

గత కొన్ని సంవత్సారాలుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిదిలో ప్రజలు ఎదుర్కోంటున్న వక్ఫ్ బోర్డు భూమి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంతి రేవంత్ రెడ్డి అన్నారు. అదివారం నాడు నగరంలోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రిగా వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టీయూడబ్ల్యూజే అద్వర్యంలో ఏ ర్పాటు చేసిన మీట్ దా మీడియా సమావేశంలో బోడుప్పల్ వక్ఫ్ బోర్డు భూముల సమస్యపై బోడుప్పల్ వాసి సినియర్ జర్నలిస్టు రాములు కల్కురి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడతూ బోడుప్పల్ వక్ఫ్ బోర్డు సమస్యపై తనకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందని ఎన్నికలకు ముందే అ సమస్యపై పలు కాలనీల వాసులు వినతి పత్రాలు కూడా అందించారని త్వరలోనే అధికారులతో నివేధికలు తెప్పించుకుని సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు.



## కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుదాం

- రూ.3.80లక్షలు కార్మికుల కుటుంబాలకు అందజేత
- కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్

**జవహర్ నగర్, మార్చి 17 (జనం సాక్షి)**

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుదామని, ప్రతి ఒక్కరూ కార్మిక సంక్షేమ బోర్డులో పేరు తప్పక నమోదు చేసుకోవాలని కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్ పిలుపునిచ్చారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లో కార్మిక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ కార్మికులు తమ హక్కులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని, పనికి వెళ్ళి ప్రమాదాలకు గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కార్మికులను చూస్తుంటే కళ్ళల్లో కన్నీరే కారుతుందని అన్నారు. కార్మికులు సంక్షేమ బోర్డులో పేరును నమోదు చేసుకుంటేనే... తమ కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని, కార్డుపొందిన వారు ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలని పేర్కొన్నారు. సహజ మరణం పొందిన వారికి 1.30లక్షలు, ప్రమాదానికి గురైతే 30వేలు సంక్షేమ బోర్డు అందజేస్తుందని తెలిపారు. భర్తలు మరణించగా వారి కుటుంబాలైన లలిత, రాధమ్మకు ఒక్కొరికి 1.30 చొప్పున అందజేయగా, ప్రమాదానికి గురైన 4గురికి ఒక్కొక్కరికి 30వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సవితాగౌడ్, మిరా, నాగమణి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.




## 30, 31న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై కాన్ఫరెన్స్

**హైదరాబాద్, మార్చి 17 (జనం సాక్షి)**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ పై భారతదేశంలో అతిపెద్ద కాన్ఫరెన్స్ ఏఐ డేస్ 2024 హైదరాబాద్‌లో ఈ నెల 30, 31వ తేదీలలో నిర్వహించనున్నట్లు స్వేఛ్ఛా వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర తెలిపారు. గచ్చిబౌలిలోని స్వేచ్ఛా తెలంగాణ, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు జేఎన్‌టీయూ హైదరాబాద్ వేదిక కానుందన్నారు. ఈ సదస్సులో రెండు వేల మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గల 70కి పైగా స్పీకర్లు పాల్గొంటారన్నారు. ఈ సదస్సుతో హైదరాబాద్ ఏఐ రాజధానిగా మారేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. 'ఏఐ4సొసైటీ' నినాదంగా స్వేచ్ఛా భాగస్వాములతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఏఐ డేస్ వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోటకు చేరుస్తుందన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, అగ్రిటెక్, ఫిన్‌టెక్, సెమీ కండక్టర్స్, ఎడ్యుటెక్, వివిధ స్టార్టప్‌లు-సమాజ శ్రేయస్సు కోసం ఏఐని నిర్మించడంలో ముందుకు సాగే మార్గం కోసం గూగుల్, ఫేస్‌బుక్ (మెటా) మైక్రోసాఫ్ట్, క్వాల్కామ్, మైక్రాన్, ఓజోనెటెల్, టెక్ వేదిక, డిజీక్వాన్టా, ఆర్కా మీడియా వర్క్స్ వంటి ఇతర సంస్థల స్పీకర్‌లు ఈ చర్చల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐ పాలన, విధానపరమైన అంశాలపై చర్చలు జరుగుతాయని చెప్పారు.

## ఏడు దశాబ్దాలుగా అన్నిరంగాల్లో వంజరుల వెనుకబాటు

- కాంగ్రెస్ ప్రభుత్వం తమను గుర్తించి కార్పొరేషన్ కేటాయించాలి
- ట్రేడ్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆరె పవన్ కల్యాణ్ విజ్ఞప్తి



**మేడ్చల్, మార్చి 17 (జనం సాక్షి)**

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాల కోసం ఇటీవలే 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, అయితే ఏడు దశాబ్దాలుగా అన్నిరంగాల్లో వెనుకబాటులో ఉన్న వంజరుల కోసమూ కార్పొరేషన్ కేటాయించాలని ట్రేడ్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆరె పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వంజరి కులస్తులకు ప్రత్యేకంగా ఒక వృత్తి లేదని, కేవలం వ్యవసాయ ఆధారంగానే వారి జీవనం కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వంజరులకు సైతం ఆర్థిక వనరులను సమకూర్చి, వారి ఉపాధికి అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల జనాభా ఉన్న వంజరులకు ఇప్పటివరకు ప్రభుత్వాల ఎలాంటి ప్రోత్సాహకాలు, సహకారాలు అందలేదని గుర్తుచేశారు. వంజరుల్లో దాదాపు అందరూ పేదరికంలోనే మగ్గుతున్నారని, చేతులు ఆడితేగానీ పూట గడవని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నివర్గాలను గుర్తిస్తూ ప్రజాపాలనను కొనసాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. వంజరులకు కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో చోటు కల్పించాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో గుర్తించాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

## కార్మిక రంగానికి అండగా నిలిచే పార్టీకే మా మద్దతు

- కార్మిక వ్యతిరేక బిజెపిని ఓడించండి
- పాత పెన్షన్ బిల్లును వెంటనే పునరుద్ధరించాలి
- హెచ్ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయం




**పటాన్చెరు మార్చి 17 (జనం సాక్షి)**

రాబోయే లోక్ సభ ఎన్నికల్లో కార్మిక రంగానికి అండగా నిలిచే పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, కార్మిక వ్యతిరేకి బిజెపిని ఓడించాలని హింద్ మజ్దూర్ సంఘ్ (హెచ్ఎంఎస్) రాష్ట్ర కమిటీ గెలుపునిచ్చింది. ఆదివారం పటాన్చెరువు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ.. ఈఎస్ఐ సంస్థలో కార్మికుల కష్టార్జితంతో పోగు చేసుకున్న 2000 కోట్ల రూపాయల ఫిక్స్ డిపాజిట్ నిధులను వెంటనే విడుదల చేసి ఈఎస్ఐ ఆసుపత్రుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.. కార్మిక రంగం ఉనికికే ప్రశ్నార్థకంగా మారిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రతి అసంఘటితరంగా కార్మికుడికి పదివేల రూపాయల పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే లోక్సభ ఎన్నికల్లో కార్మిక సంక్షేమానికి కృషి చేసే పార్టీలకు ఓటు వేయాలని, మతతత్వ నినాదంతో కార్మిక వ్యతిరేక చట్టాలను రూపొందిస్తున్న బిజెపి పార్టీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ నర్సయ్య, జనరల్ సెక్రెటరీ రెబ్బ రామారావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, కోశాధికారి భాగ్యవతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




## కంటిచూపుని కబళించే గ్లకోమాపై అవగాహన

**కాప్రా, మార్చి 17 (జనం సాక్షి)**

గ్లకోమా వీక్ సందర్భముగా ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్‌లో ఉన్న సోలిస్ ఆసుపత్రి యాజమాన్య, బృందము, సిబ్బంది, డాక్టర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహనా సదస్సు నిర్వహించారు. గ్లకోమా పై అవగాహనా కల్పించారు. ఇందులో భాగంగా డాక్టర్ అశోక్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ నమ్రత లు మాట్లాడుతూ.. గ్లకోమా అనేది ఆప్టిక్ నరాలకి హాని కలిగించే వ్యాధి అని, ఆప్టిక్ నరాల దెబ్బతినడం వల్ల అంధత్వం ఏర్పడవచ్చు అని, వయస్సుతో పాటు గ్లకోమా ముప్పు పెరుగుతుందని, 40 ఏళ్ల పైబడిన వారిలో ఈ సమస్య ఎక్కువ వస్తుందని పేర్కొన్నారు. కోలుకోలేని దృష్టి నష్టానికి గ్లకోమా ప్రధాన కారణం, గ్లకోమాను ముందుగా గుర్తించడం వలన మరింత దృష్టి నష్టాన్ని నివారించవచ్చు తెలియజేశారు, మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్ 9515999405ను సంప్రదించండి.




## ఆస్తి పన్ను పరిష్కార మార్గంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతులు

**రాజేంద్రనగర్, మార్చి 17 (జనం సాక్షి)**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అభివృద్ధి జరగాలంటే ప్రతి ఒక్కరు తమ తమ ఆస్తి పన్నును సకాలంలో కట్టి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ పేర్కొన్నారు. ఆస్తి పన్ను అవాంతరాలను అధిగమించేందుకు ప్రతి ఆదివారం ఆస్తి పన్ను పరిష్కారం వెదిక కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ పాల్గొని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆస్తి పన్ను విషయంలో విపరీతంగా వేస్తున్నారని దీనికి తగ్గించి వేయాలని కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అభివృద్ధి జరగాలంటే ప్రతి ఒక్కరు ఆస్తి పన్ను కట్టాలని ఆస్తి పన్ను కట్టని వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామని మరికొన్ని రోజుల్లో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మీ అభ్యర్థన మేరకు మీ,మీ ఆస్తి పన్ను విషయంలో క్షుణ్ణంగా పరిష్కరించి వాటిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

## వరల్డ్ వన్ స్కూల్‌లో చెడ్డి గ్యాంగ్ హల్ చల్



### పాఠశాల ఆఫీస్ లాకర్ నుంచి 7.85 లక్షల నగదు ఎత్తుకెళ్లిన వైనం!

**శేరిలింగంపల్లి, మార్చి 17 (జనంసాక్షి) :**

మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చెడ్డి గ్యాంగ్ రూపంలో వరల్డ్ వన్ స్కూల్‌లో చొరబడిన ఇద్దరు ముసుగు దొంగలు పాఠశాల ఆఫీస్ లాకర్‌లో నుండి 7 లక్షల 85 వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లిన వైనం సైబరాబాద్ పరిధిలో సంచలనంగా మారింది. ఈ మేరకు మియాపూర్ ఎస్హెచ్ఓ ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం..చెడ్డి గ్యాంగ్‌ను తలపిస్తూ ఇద్దరు దొంగలు మొహాలకు మాస్కులు వేసుకొని శనివారం అర్ధరాత్రి దాటాక మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరల్డ్ వన్ స్కూల్ లో చొరబడ్డారు. సీసీ ఫుటేజీ ప్రకారం..వారు అచ్చం చెడ్డి గ్యాంగ్ ను తలపిస్తుండడం ఆందోళనకు గురి చేస్తున్న అంశం! అయితే వారు కాసేపు అటు ఇటు తిరిగి చివరకు ఆఫీసు టేబుల్ లాకర్ ను బద్దలు కొట్టి అందులో ఉన్న 7. 85 లక్షల రూపాయల నగదును దొంగిలించుకుని పారిపోయారు. అయితే ఆదివారం ఉదయం కార్యాలయ సిబ్బంది స్కూల్ కు వచ్చి చూడగా ఆఫీస్ టేబుల్ లాఖరు తెరిచి ఉండడం... అందులో ఉండాల్సిన నగదు కనిపించకపోవడంతో మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పాఠశాలలోని సిసి ఫుటేజీని పరిశీలించిన అనంతరం ఇది చెడ్డి గ్యాంగ్ దొంగల పనే అయి ఉంటుందని భావించి కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పాఠశాల ఆఫీసు లాకర్లో అంత సొమ్ము ఉంటుందని దొంగలు భావించడం కొంత అనుమానానికి తావిస్తుందని, ఎవరైనా తెలిసిన వారే ఈ పనికి పాల్పడి ఉంటారా అనే అనుమానాలు స్థానికంగా వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా మియాపూర్ పోలీసుల కేసులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని వీలైనంత తొందరగా దొంగతనం కేసు నిజాలను నిగ్గు తేలిస్తేగాని... వాస్తవాలు వెలుగులోకి రావని చెబుతుండడం గమనార్హం.



## అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి..

### సిసిఎస్ ప్రతినిధి పద్మ రెడ్డి

**కాప్రా, మార్చి 17 (జనం సాక్షి)**

అనుమానితులు కాలనీలలో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చర్లపల్లి కాలనీలా సమైక్య ప్రతినిధి పద్మా రెడ్డి అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ సాయి కృష్ణ ఎంక్లేవ్ కాలనీలో ఉదయం సమయంలో ఇంట్లోకి చొరబడి చిన్నపిల్లల్ని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించడంతో కాలనీ ప్రజలు అప్రతమై రక్షించండి అంటూ కేకలు వేస్తూ పట్టుకున్నారు. ఈ క్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుమారస్వామి ఇతర కాలనీ ప్రతినిధులు అక్కడకు చేరుకొని డయల్ 100కు ఫోన్ చేసి రాచకొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుషాయిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అనుమానంతిని విచారణ నిమిత్తం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పద్మా రెడ్డి మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## చేవెళ్లకు మోడీ గ్యారెంటీ..మోడీకి చేవెళ్ల గ్యారంటీ

### చేవెళ్ల పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**చేవెళ్ల, మార్చి 17 (జనం సాక్షి)**

మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం చేవెళ్ల అసెంబ్లీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం చేవెళ్ల పట్టణంలోని సిహెచ్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చేవెళ్ల పార్లమెంటు భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ....భారతీయ జనతా పార్టీకి పోటీయే లేదు అని అన్నారు. ఎన్నికల క్షేత్రంలో బూత్ కమిటీ సభ్యుల పాత్ర కీలకం. భారతీయ జనతా పార్టీ లో బూత్ సభ్యులకు ఉన్న ప్రాధాన్యత వేరే ఇతర నాయకులకు లేదని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా భారతీయ జనతా పార్టీకి లాభమే. ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు దొరకక ఇతర పార్టీల నుండి చేర్చుకుంటున్నారు. సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి దోచుకున్న సొమ్మును దాచుకోవడానికి అధికార పార్టీ వైపు చూస్తున్నాడని అన్నారు. కచ్చితంగా చేవెళ్ల పార్లమెంటు స్థానం నుండి 2 లక్షల ఓట్ల మెజారిటీతో భారతీయ జనతా పార్టీని గెలిపించాలన్నారు. నేను ఎంపీగా ఉన్నప్పుడే బీజాపూర్ హైదరాబాద్ హైవే తెచ్చానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ వల్ల రోడ్డు పనులు ఆగిపోయినాయి. కచ్చితంగా మళ్ళీ గెలుస్తున్న, ఆ తర్వాత రోడ్డును పూర్తి చేస్తా అని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాష్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాపరెడ్డి, జాయింట్ కన్వీనర్ సింగపురం రమేష్,అసెంబ్లీ ప్రభారి రాజ వర్ధన్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు అంజన్ కుమార్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీపి విజయలక్ష్మిరమణా రెడ్డి, సర్పంచ్ మాణిక్ రెడ్డి, పులిమామిడి ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు జ్ఞానేశ్వర్, వికారాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు గాలయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శర్వలింగం, జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి, జిల్లా కార్యదర్శి వెంకట రెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షులు పాండురంగా రెడ్డి, షాబాద్ మండల అధ్యక్షుడు కిరణ్, మొయినాబాద్ మండల అధ్యక్షుడ మధుసూదన్ రెడ్డి, శంకర్పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, నవాబ్ పేట మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అతెల్లి అనంతరెడ్డి, వైభవ్ రెడ్డి, బిజేవైఎం నాయకులు పత్తి సత్యనారాయణ, మధుకర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్, గణేష్, అల్లాడ శ్రీనివాస్ రెడ్డి అశోక్ మరియు సీనియర్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
18 మార్చి 2024

# పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన యాదవ యువ నాయకులు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీసీసీ ఆదేశాల మేరకు వివిధ పార్టీలకు చెందిన నాయకులను, కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం జరుగుతుందన్నారు. పార్టీలో చేరి పార్టీ పటిష్టత కోసం కృషిచేసిన కార్యకర్తకు పార్టీ అండగా ఉంటూ వారికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. రాబోయే ఎంపి ఎన్నికల్లో, గత ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజారిటీతో మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు కాంగ్రెస్ ఎంపి అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బహుమతిగా ఇవ్వాలన్న సంకల్పంతో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, మహబూబ్ నగర్ మున్సిపల్టీ లోని 49 కౌన్సిలర్‌లను, సర్పంచ్, ఎంపిటిసి జెడ్పిటిసి ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. బిఆర్ఎస్ పార్టీలో కేవలం ఆ కుటుంబ సభ్యులు నలుగు మాత్రమే మిగులుతారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను బెదిరించి, పీడించిన బిఆర్ఎస్ నాయకులు ఒక్కోక్కరు ఇక జైలు పాలు కాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎన్ పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, చంద్రకుమార్ గౌడ్, సుధాకర్ రెడ్డి, ముకుంద్ రమేష్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌కు గుజరాతి పాటిదర్ సమాజ్ సంపూర్ణ మద్దతు



**కాప్రా, మార్చి 17 (జనం సాక్షి)**

లోక్ సభ సార్వత్రిక ఎన్నికలలో కాప్రా పరిధిలోని శ్రీ కుచ్ కడవ పాటిధార్ సమన్ (గుజరాతి పాటిధార్ సమాజ్) సభ్యులు మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీ కుచ్ కడవ పాటిధార్ సమన్ కమిటీ సభ్యులు ఆదివారం మధ్యాహ్నం కమలానగర్‌లోని గుజరాతి భవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. మల్కాజ్గిరి పార్లమెంట్ నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మోడీ నేతృత్వంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. భారతదేశం నేడు 'ఫీర్‌ఏక్ బార్ మోదీ' అనే నినాదంతో ముందుకు వెళ్తుందని అన్నారు. గుజరాతి పాటిధార్ సమాజ్ అధ్యక్షుడు జావేష్ పటేల్, ప్రధాన కార్యదర్శి కే బి పటేల్, కల్పేశ్ పటేల్ ఈటల రాజేందర్‌ను ఘనంగా సత్కరించారు. తమ సంపూర్ణ మద్దతు భారతీయ జనతా పార్టీకే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు కన్నెబోయిన రమేష్ యాదవ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పెండెర్ల శరత్ చంద్ర, బిజెపి సీనియర్ నాయకుడు మర్రి మోహన్ రెడ్డి, నాయకులు మోహన్ యాదవ్, కుంతల కిరణ్ కుమార్, సురేష్, ధర్మకర్, సందీప్ చారి, సోమేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దళిత కుటుంబాన్ని ఆదుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో మార్చి 17(జనంసాక్షి )**

శ్రీరంగపూర్ మండలం జానంపేట గ్రామానికి చెందిన పేద దళిత కుటుంబానికి చెందిన ఈరపాగ నాగరాజు తండ్రి పేరు మీద ఉన్న ఏకర సాగు భూమితో వారు జీవనాధారం పొందుతున్నారు. అతనికి ఉన్న ఏకరా పొలంలో ఐదు గుంటల భూమి (సర్వే నం. 39/ఎ/1.) గ్రామానికి చెందిన రాఘవ రెడ్డి పేరు మీద ధరణిలో నమోదు అయిందనీ నాగరాజు పేర్కొన్నారు. ఐదు గుంటల భూమిని తన పేరు మీద మార్చుకోవడానికి అధికారుల చుట్టూ నాయకుల చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయిందనీ తెలిపారు. చివరకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిని కలసి తమ దీనస్థితి వివరించగా స్పందించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన సొంత డబ్బులు 70వేలు ఇచ్చి ఐదు గుంటల భూమిని ఖరీదు చేసి దళిత కుటుంబానికి అందించారు. ఐదు గుంటల భూమి ధరణిలో తమ పేరిట చేసుకున్న యువకుడు తన తండ్రి నాగేశ్వర రావుతో వనపర్తి లోనీ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో ఆదివారం వారు కలిసి కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు. నాగేశ్వర రావు మాట్లాడుతూ సొంత అన్న తమ్ములు కూడా సహాయం చేయని ఈ రోజులలో మమ్మలని ఆదుకొన్న నిరంజన్ రెడ్డికి జీవితాంతం ఋణపడి ఉంటామని వారు అన్నారు. మాజీ మంత్రి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, సూర్యవంశం గిరి, జోహేబ్, చిట్యాల రాము, మండ్ల కురుమూర్తి ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ విడుదల

**గద్వాల నడిగడ్డ, మార్చి 18 (జనం సాక్షి):**

భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసినందున జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుండి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల స్క్రూటీని, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని అన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. జిల్లాలో నాగర్ కర్నూల్ యస్సి పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, గద్వాలలో 303, అలంపూర్ లో 290 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో మొత్తం 4,94,945 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందులో 2,43,353 మంది పురుషులు, 2,51,573 మంది మహిళలు, 19 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో 1,25,356 మంది పురుషులు, 1,30,499 మంది మహిళలతో పాటు 11 మంది ట్రాన్స్ జెండర్లు కాగా, అలంపూర్ లో 1,17,997 మంది పురుషులు, 1,21,074 మంత్రి మహిళలు, 8 మంది ట్రాన్స్ జెండర్లు గలరని తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని, దీనికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి బి.యం.సంతోష్ కోరారు.





## బీజేపీ మహిళా మోర్చా వనపర్తి జిల్లా అధ్యక్షురాలిగా అశ్విని రాధమ్మ

### నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు డి. నారాయణ

**వనపర్తి బ్యూరో మార్చి 17(జనం సాక్షి )**

పెద్దమందడి గ్రామానికి చెందిన అశ్విని రాధమ్మ భారతీయ జనతా పార్టీలో కార్యకర్తగా ప్రారంభించి రెండు పర్యాయాలుగా మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ ఆదివారం వనపర్తి బీజేపీ జిల్లా కార్యాలయంలో మహిళా మోర్చా వనపర్తి జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అశ్విని రాధమ్మ మాట్లాడుతూ.. బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలుగా నన్ను ఎంపిక చేసిన జిల్లా అధ్యక్షులు డి. నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మున్నూరు రవీందర్, బి.శ్రీశైలం, జ్యోతి రమణ లకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలుగా పార్టీ విస్తరణకై నిరంతరం శ్రమించి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బి రెడ్డి వెంకట్ రెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర సహ కోశాధికారి జ్యోతి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రామన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సుమిత్రమ్మ, బండారు కుమారస్వామి, ఏ సీతారాములు, ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, కోశాధికారి భాసెట్టి శీను, పార్లమెంట్ కో కన్వీనర్ ప్రవీణ్, మహిళా మోర్చా మాజీ జిల్లా అధ్యక్షురాలు కల్పన, జిల్లా కార్యదర్శులు చిత్తారి ప్రభాకర్, ముప్పూరు చెన్నయ్య, బోయెల్ల రాము, మహిళా మోర్చా నాయకురాలు కవిత, సరోజ, జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందుకు హాజరైన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి బ్యూరో మార్చ్ 17 (జనం సాక్షి)**

గోపాల్ పేట మండలం తాడిపర్తి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లాల చిన్నారెడ్డి ,ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ మెడికల్ జిల్లెల ఆదిత్యా రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జడ్పిటిసి రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ఇఫ్తార్ ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి గణేష్ గౌడ్, వనపర్తి ముస్లిం పెద్దలు కమర్ తాడిపర్తి ఎండి నిజాముద్దీన్, శేర్పదిన్ తాడిపర్తి, కాంగ్రెస్ కార్యకర్తలు ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు మెంబర్ ఎలీషా, కాంగ్రెస్ యువ నాయకులు మండల కాంగ్రెస్ గోపాల్పేట, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కోంకి వెంకటేష్, మండల కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జిల్లెల్ల ప్రవీణ్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు దేవరాజు, గోపాల్పేట మండలం టౌన్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, గొల్ల పుల్లయ్య, కాశీనాథ్, మండల కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- పరీక్ష కేంద్రం ఆవరణంలో 144 సెక్షన్ అమలు
- పరీక్ష కేంద్రాల దగ్గర పోలీస్ బందోబస్తు ఏర్పాటు
- పరీక్ష కేంద్రాలలో సెల్ ఫోన్, స్మార్ట్ వాచ్ అనుమతి లేదు.
- జిల్లా ఎస్పీ రీతి రాజ్

**గద్వాల నడిగడ్డ, మార్చి 17 (జనం సాక్షి)**

రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 10వ తరగతి పరీక్షలు జరుగనున్న దృష్ట్యా జోగులాంబ గద్వాల జిల్లాలో 10వ తరగతి పరీక్షలు జారిగే 41 పరీక్ష కేంద్రాల దగ్గర పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. 41 పరీక్షా కేంద్రాలలో 7,378 మంది



విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నరని, ఈ సందర్భంగా పరీక్షలు జరిగే రోజున భద్రతా చర్యల నిమిత్తము కొన్ని ముఖ్యమైన సూచనలు తప్పనిసరిగా అమలు చేయబడునని,పరీక్షలు జరుగు కేంద్రాల చుట్టు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ఈ సంవత్సరం 7 పేపర్లుగా ఎస్-ఎస్‌సి బోర్డ్ కుదించడం జరిగిందనీ ఈ విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలని ఎవరూ కుడా వత్తిడికి గురి కావద్దు అనీ సూచించారు. పరీక్షల దృష్ట్యా ప్రజలు, విద్యార్థులు పోలీస్ వారి సూచనలూ పాటించి సహకరించాలని ఎస్పీ సూచించారు. పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ విధించబడును, ఇద్దరూ అంతకంటే ఎక్కువ మంది గుమి కూడా రాదనీ,పరీక్షా కేంద్రాల దగ్గర అన్ని జిరాక్స్ సెంటర్స్, మూసి వేయబడునాని, విద్యార్థులు మాత్రమే పరీక్ష కేంద్రం హాలులోకి ప్రవేశము కలదనీ, గేటు మూసివేసిన తర్వాత లోపలికి అనుమతించరనీ, విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్, ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ కూడా పరీక్షా కేంద్రములోనికి మొబైల్ ఫోన్స్ స్మార్ట్ వాచెస్ అనుమతి లేదనీ, పరీక్షా కేంద్రంలో ఏమైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు డయాల్- 100 గాని లేక సంబంధిత పోలీసులకు గాని ఫిర్యాదు చేయగలరనీ ఎస్పీ తెలిపారు.



## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ

**వనపర్తి బ్యూరో మార్చి 17 (జనం సాక్షి)**

శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామ ఎంపీటీసీ శ్రీమతి అంకె పార్వతమ్మ ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ, మండల నాయకుల సమక్షంలో ఎంపిటిసి తోపాటు మండల బిఅరెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంకె వెంకటయ్య, మాజీ సర్పంచ్ గంధం బజారు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు.బిఅరెస్ పాలనలో ఎంపీటీసీ లకు ఎలాంటి గుర్తింపు లేదని, ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని నేడు కాంగ్రెస్ పార్టీ తమను గుర్తించి ప్రాధాన్యత కల్పించడం సంతోషదాయకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీరం రాజశేఖర్ రెడ్డి, సత్య శీలా రెడ్డి గంధం రాజశేఖర్, కురుమన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు జిల్లాలో రెండు ఎంపి స్థానాలు బిజెపివే

### బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**



పాలమూరు ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో బిజెపి విజయం ఖాయమని నారాయణపేట జిల్లా బిజెపి అధికార ప్రతినిధి రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దానికి నిదర్శనం నాగర్ కర్నూల్ కందనూలులో జరిగిన ప్రధాని విజయ సంకల్ప సభ దిగ్విజయం కావడమే నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో మునిగి పోయిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం కానీ హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తున్నాదని అన్నారు. కానీ బిజెపి చెప్పింది చేస్తుందని ప్రజలకు విశ్వాసం ఉన్నదని అందుకు బిజెపిని రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలిపిస్తారన్నారు.

## గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎల్లయ్య నాయక్‌కు సన్మానం

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

రాష్ట్ర గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ విభాగం అధ్యక్షులు బెల్లయ్య నాయక్‌ను ఆదివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన పలువురు ఎస్టీసెల్ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. పార్టీ పటిష్టత కోసం నిరంతరం పనిచేస్తున్న బెల్లయ్య నాయక్‌కు గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షులు లింగంనాయక్, గద్వాల జిల్లా అధ్యక్షులు శివనాయక్, మహబూబ్ నగర్ పట్టణ అధ్యక్షులు రవినాయక్, జిల్లా కో కన్వీనర్ రాంచందర్ నాయక్, కొల్లూరు ఎంపీటీసీ తులసిరాంనాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టొద్దు

## జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

పార్లమెంట్ లోకసభ ఎన్నికల సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం ఒకప్రకటనలో హెచ్చరించారు. రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసిన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు.సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయని తెలిపారు. సామాజిక మధ్యమా లను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియో గించే వాళ్లపైన ప్రత్యేకంగ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.ఈ తరహా నేరలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకొని అట్టి వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24/7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్పీ సూచించారు.

# జితేందర్ రెడ్డి అన్ని పార్టీలు తిరిగారు మిగిలింది ఒక్క ఎంఐఎం మాత్రమే

### బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగురావు నామాజీ



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి అన్ని పార్టీలు మారారని మిగిలింది ఒక ఎంఐఎం పార్టీ మాత్రమే నని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగురావ్ నామాజీ అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీపార్వతి పార్టీ, తెలుగుదేశం పార్టీ, బిఆర్ఎస్, బిజెపి కాంగ్రెస్ పార్టీలు అన్నీ అయిపోయయని, మిగిలింది ఒక ఎంఐఎం పార్టీ మాత్రమే అన్నారు. ఆయన మాత్రం మోడీ మంచితనాన్ని బిజెపి పైన ఉన్న ప్రేమను మర్చిపోలేదని, జితేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరినప్పటికీ ఓటు మాత్రం బిజెపికే వేస్తారని నాగురావు నామాజీ అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన జితేందర్ రెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ళ మధ్యలో ఉండి పత్రికా సమావేశంలో మాట్లాడిన మాటలు చూస్తే వారికి ప్రధాని మోడీ, బిజెపి పట్ల ఉన్న అభిమానం బయటపడుతుందన్నారు . భారతీయ జనతా పార్టీ సముద్రం లాంటిదని పోయే నీరు పోతుంది , వచ్చే నీరు వస్తుంది అన్నట్లు , పార్టీని నమ్మి వచ్చే వాళ్లను పార్టీలో చేర్చుకుంటాఅని , స్థిరత్వం లేని చంచల గుణమున్న వ్యక్తులు పార్టీని విడిచి వెళుతుంటే వద్దనేది లేదన్నారు . క్రమశిక్షణ గల పార్టీ బిజెపి అని అలాంటి పార్టీని వదిలి వెళ్తే వారి భవిష్యత్తుకే నష్టం జరుగుతుంది తప్ప పార్టీకి ఎలాంటి నష్టం జరగదన్నారు . భారతీయ జనతా పార్టీ ఎలాంటి పార్టీ అనేది జితేందర్ రెడ్డికి బాగా తెలుసని, పార్టీలోని కొందరిపై వ్యక్తిగత విభేదాల వల్లే జితేందర్ రెడ్డి పార్టీ నీ వదిలి వెళ్లారని, అలా వెళ్లడం వల్ల ఆయనకే నష్టమన్నారు. పార్టీని వదిలి వెళ్లేవారు ఎవ్వరైనా సరే పార్టీ పై లేనిపోని ఆరోపణలు చేసి వెళ్లడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తో పాటు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా స్వరాజ్యం
సోమవారం
18 మార్చి 2024
తెలంగాణ
జనంసాక్షి
www.janamsakshi.org



నిత్య జీవితంలో మనం ఉపయోగించే వస్తువులపై చాలావరకు మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ చైనా, మేడ్ ఇన్ జపాన్, మేడ్ ఇన్ సౌత్ కొరియా ముద్రలే చూస్తుంటాం. ఆ మాటకొస్తే.. మన దగ్గర కూడా కొన్ని వస్తువులు తయారవుతున్నాయి. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాల ఇందుకు చిరునామాగా నిలిచింది. ప్రొఫెసర్ల మార్గదర్శకత్వంలో.. ఇక్కడి విద్యార్థులు వివిధ ఔషధాలు తయారు చేస్తున్నారు.

# సుగంధద్రవ్యాలు @ స్టూడెంట్స్ మేకింగ్



కాలేజీ.. సృజనకు ద్వారం. జిజ్ఞాసకు ఊతం. ఆవిష్కరణలకు మూల కేంద్రం. మార్పునకు సంకేతం. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాల అక్షరాలా ఆ మార్గంలోనే నడుస్తున్నది. ఇక్కడ టీ బ్యాగ్స్, మల్టీపర్పస్ జెల్, షాంపూ, మునగతో మొరింగా మాత్రలు, కొబ్బరినూనె, కోల్డ్ క్రీమ్, మల్బరీ వైన్ లాంటి ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటిలో ఔషధ గుణాలు అపారం.
రోగ నిరోధకత పెంచడంలో, ఇన్ఫెక్షన్ల నివారణలో, చర్మ సమస్యలను అడ్డుకోవడంలో, కేశ సంపదను పెంచడంలో ఇవి ఉపయోగపడతాయి. పోషక లోపాలను సరిచేయడానికి ప్రత్యేక గుళికలనూ తయారు చేస్తున్నారు. క్యారెట్, బీట్‌రూట్, పాలకూర, ఆనప, చిక్కుడు, డ్రాగన్ ఫ్రూట్.. చాలా ఉత్పత్తులకు ముడి సరుకు. కారు ప్రయాణంలో ఆహ్లాదకర అనుభూతిని అందించడానికి ఎయిర్ ఫ్రెషనర్స్ కూడా అందిస్తున్నారు. సువాసనల అరోమా థెరపీ అలసటను దూరం చేస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.



### రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్

మోజర్ల ఉద్యాన కళాశాల ఉత్పత్తులకు అధికారులు రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్‌నూ పొందారు. ఆరు నెలలకోసారి జాతీయ రహదారిపై ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటుచేసి మేడ్ ఇన్ వనపర్తి మందులను విక్రయిస్తున్నారు. అలాగే ఆన్‌లైన్ సౌకర్యమూ ఉంది. 'హార్టికోజెన్' పేరుతో మొబైల్ గ్రూపు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో రెండువేల మంది సభ్యులు ఉన్నారు. అన్ని రాష్ట్రాల వారికీ తగిన ప్రాతినిధ్యం ఉంది. జూన్ నాటికి మరిన్ని ఉత్పత్తులు మార్కెట్‌లోకి రానున్నాయి. కళాశాల మైదానంలో ఔషధ, పండ్ల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. అలోవేరా, లోరిమోస, నేల ఉసిరి, కుందేటి కొమ్ము, తులసి.. ఇందులో కొన్ని. ఎర్రమందారం, మైదాకు, బార్బడోస్ చెర్రీ, శంఖపుష్ప, శతావరి, సిట్రొనెల్లా, వట్టివేళ్లు, లెమన్‌గ్రాస్, వాటర్ స్పినాచ్ తదితర మొక్కలూ పెంచుతున్నారు. ఆరంభం నుంచే రసాయన మందులను దూరం పెడుతున్నారు. స్కిల్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం ద్వారా ఎంపికైన విద్యార్థులకే తయారీలో పాలుపంచుకునే అవకాశం ఇస్తారు.
ఏటా పదిమందికి మాత్రమే ఈ అదృష్టం దక్కుతుంది. కళాశాల వేళలు ముగిసిన తర్వాతే .. ఈ పనులన్నీ చేసుకోవాలి. 'మా కళాశాలలో ఉత్పత్తి చేసే మందులు చాలా శక్తిమంతమైనవి. ఒకే గోళి రెండు, మూడు రకాల జబ్బులకు పనిచేస్తుంది. చర్మానికి సంబంధించిన మందు వాడితే చర్మ సమస్యతోపాటు చుండ్రు, నెత్తిలో పేలు కూడా పోతాయి' అని సగర్వంగా చెబుతారు శ్రావణి అనే విద్యార్థిని.
'ఇంటర్ తర్వాత జీవితంలో స్థిరపడాలి అనుకుంటే వారికి హార్టికల్చర్ మంచి అవకాశం. అందులోనూ ఇక్కడ చదివితే భవిష్యత్తు బంగారమే' అని వివరిస్తారు డీన్ పిడిగెం సైదయ్య. నిజానికి ఈ విజయం సమష్టి కృషి ఫలితం. డీన్ నుంచి సాధారణ ఉద్యోగి వరకు .. అంతా చేతులు కలిపారు. విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. పట్టా చేతబట్టుకుని ఆవరణ దాటే సమయానికే ప్రతి విద్యార్థీ నూటికి నూరుశాతం ప్రొఫెషనల్ అవుతారు. 'మేడ్ ఇన్ వనపర్తి' ముద్రతో కెరీర్ ప్రయాణం ఆరంభిస్తారు.

### ఉపద్రవాలొచ్చినా తట్టుకోవాలి..

కరోనా వంటి ఉపద్రవాలు వచ్చినా సమాజం తట్టుకోగలగాలి. ఆ సత్తువ రావాలంటే రసాయన, క్రిమిసంహారక మందులకు మనం దూరంగా ఉండాలి. ఈ దిశగా పండ్లు, కూరగాయలతో తయారైన ఔషధాలతో అద్భుతాలు సాధిస్తున్నాం. కళాశాల ఆవరణతోపాటు, కొండకోనల నుంచి మూలికలు సేకరిస్తున్నాం. హిమాలయాల నుంచీ కొన్ని తీసుకొచ్చాం.

- డాక్టర్ జె.శంకరస్వామి అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఉద్యాన కళాశాల, మోజర్ల, వనపర్తి జిల్లా

న్యాయం కోసం!! ఆదివారం సంచిక తరువాయి

# మహిళ చట్టం దుర్వినియోగం

## వివాహ బంధంలో పెరుగుతున్న వైరుధ్యాలు

కాపురం చేసే విషయంలో చిన్న చిన్న విషయాలను సైతం బూతద్దం లో పెట్టి చూస్తూ కూతుర్లకి లేనిపోనివి నూరిపోస్తున్న తల్లులూ లేకపోలేదు. ఇలాంటి చెప్పుడు మాటలతో తప్పుడు నిర్ణయాలు తీసు కోని జీవితాలను చిన్నభిన్నం చేసుకుంటున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండడం బాధాకరం.

### సెక్షన్ 498ఏ ఐపీసీ నుండి రక్షణ పొందడం ఎలా?

ఒక మహిళ చట్టాన్ని దుర్వినియోగం చేయాలని నిర్ణయించుకుని వ్యక్తిగత ప్రయోజనాల కోసం మీపై తప్పుడు కేసు నమోదు చేస్తామని బెదిరిస్తే, సెక్షన్ 498ఏ ఐపీసీకి వ్యతిరేకంగా రక్షణ కోసం ఉపయోగించగల చట్టపరమైన పరిష్కారాలు కూడా చట్టప్రకారం ఉన్నాయి. తప్పుడు ఆరోపణను రుజువు చేయడంలో మొదటి దశ 498ఏ కేసు వివరాలను వివరించే అన్ని ముఖ్యమైన విషయాలను సేకరించి వీలైనంత ఎక్కువ సాక్ష్యాలను సేకరణ ప్రారంభించాలి.
మీరు లేదా మీ కుటుంబ సభ్యుల మధ్య మీ భార్య లేదా ఆమె బంధువులతో ఏదైనా సంక్షిప్త సందేశాలు, ఇమెయిల్‌లు,కాల్ రికార్డిం గ్‌లు మొదలైనవాటితో ఏదైనా సంభాషణ చాలా ముఖ్యం.మీ భార్య మీ ఇంటి నుండి ఇష్టపూర్వకంగా వెళ్లిందని రుజువు చేసే ఏదైనా సాక్ష్యం.
పెళ్లికి ముందు లేదా తర్వాత కట్నం కోసం ఎటువంటి డిమాండ్ లేదని చూపించే ఏదైనా సాక్ష్యం వంటి ఆధారాలతో కొంత ఊరట పొందే అవకాశం ఉంది. భార్య సెక్షన్ 498ఏ కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేయవచ్చని మీరు భావిస్తే, మిమ్మల్ని లేదా మీ కుటుంబ సభ్యుల అరెస్టును నిరోధించడానికి క్రిమినల్ డిఫెన్స్ లాయర్‌ను నియమించు కుని ముందస్తు బెయిల్ పొందాలి.ముందస్తు బెయిల్ అనేది మిమ్మల్ని లేదా మీ కుటుంబ సభ్యులను అరెస్టు చేయడానికి పోలీసులు ముందుకు సాగితే ముందస్తు బెయిల్ లాంటిది. సీఆర్పీసీ లోని సెక్షన్ 438 ప్రకారం సెక్షన్ 498ఏ ఐపీసీ కేసు నుండి రక్షణ కోసం మీరు ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేయవచ్చు.అయితే సుప్రీం కోర్టు ఆదేశాలతో ప్రస్తుతం 498ఏలో అరెస్టుకు బదులుగా 41సీ నోటీసులను పోలీసులు స్టేషన్ పరిధిలోనే సర్వ్ చేయడంతో బాధిత భర్తలకు, వారి తల్లిదండ్రులకు కాస్త ఉపశమనం లభిస్తుంది.మీరు సీఆర్పీసీ లోని సెక్షన్ 482 ప్రకారం హైకోర్టు ద్వారా తప్పుడు 498ఏ అని నిరూపించగలిగితే దానిని పోలీస్ స్టేషన్ పరిధిలోనే రద్దు చేసే అవకాశం పొందవచ్చు. సాధారణంగా ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయడానికి శాంతిభద్రతల ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి కోర్టులు ఇష్టపడవు అయితే తగిన రుజువులు ఉంటే భార్య దాఖలు చేసిన తప్పుడు 498ఏ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసే అధికారం కోర్టుకు ఉంటుంది.
తప్పుడు 498ఏ ఫిర్యాదు కోసం భార్యపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేసే అవకాశం కూడా ఉంది.బ్లాక్ మెయిల్ చేసినందుకు లేదా మీపై తప్పుడు 498ఏ కేసు నమోదు చేసినందుకు మీరు మీ భార్యపై ఎఫ్ఐఆర్ కూడా ఫైల్ చేయవచ్చు. భారతదేశంలోని పోలీసులు సాధారణంగా అలాంటి ఎఫ్ఐఆర్ ని ఇష్టపడరు కానీ మీరు మీ కేసును అనుభవజ్ఞులైన క్రిమినల్ లాయర్ తో ఫైల్ చేస్తే, మీ భార్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని పోలీసులు తిరస్కరించలేరు.మీ ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు నిరాకరిస్తే మీరు పోలీసు అధికారిపై ఆ పోలీస్ స్టేషన్ సూపరింటెండెంట్‌కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. దాంపత్య హక్కుల పునఃస్థాపన



కోసం కేసు నమోదు చేసే అవకాశం కూడా ఉంది.మీ భార్య తన వివాహ గృహాన్ని విడిచిపెట్టి ఆమె కుటుంబంతో కలిసి జీవించడానికి తిరిగి వెళ్లినట్లయితే మీరు ఆర్సీఆర్(వైవాహిక హక్కుల పునరుద్ధరణ)కోసం కేసును దాఖలు చేయవచ్చు.హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 9(2) ప్రకారం మీ భార్యపై దాంపత్య హక్కులను పునరుద్ధరించడం) మీతో మరోసారి జీవించడం ప్రారంభించడానికి ఆమె అనుసరించాల్సిన అన్ని నిబంధనలు,షరతులను మీరు పేర్కొనవచ్చు.

### తప్పుడు 498ఏ కేసుకు పాల్పడితే?:

మీపై తప్పుడు 498.. కేసును నమోదు చేయడం ద్వారా సమాజంలో మీ పరువు కు భంగం కలిగినందుకు, మిమ్మల్ని మీ కుటుంబ సభ్యులను కించపరిచినందుకు మీ భార్యపై కూడా మీరు పరువు నష్టం కేసును దాఖలు చేయవచ్చు.
498ఏ కేసుపై పోరాడుతున్నప్పుడు, కేసు వ్యవధి ఎక్కువగా కోర్టు ముందు సమర్పించబడిన సాక్ష్యంపై ఆధారపడి ఉంటుంది.మీ న్యాయవాది మీ కేసుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కోర్టులో ఎంత సమర్థవంతంగా పోరాడుతారనేది చాలా ముఖ్యం.
సెక్షన్ 498ఏ తక్షణమే మహిళలకు రక్షణ కవచంలా ఉన్నప్పటికీ కాలక్రమేణా దుర్వినియోగమవుతున్న నేపథ్యంలో చట్టాన్ని సవరించడానికి సుప్రీం కోర్టు ఎన్నో ప్రతిపాదనలు తీసుకొచ్చింది.భర్త లేదా అతని కుటుంబం తప్పుడు ఆరోపణల విషయంలో సమాజంలో అవమానాన్ని భరించాల్సిన అవసరం లేదు.

### 498ఏ కేసు తీవ్రతను తగ్గించే మార్గాలు

అనుసరించడానికి కొన్ని సులభమైన మార్గాలు ఉన్నాయి. ప్రతిసారీ ఈ చట్టాలకు వ్యతిరేకంగా పురుషులను బ్లాక్ మెయిల్ చేయలేరు. సెక్షన్ 498ఏ ప్రకారం భర్త లేదా భర్త యొక్క బంధువులు,కుటుంబం భార్యను క్రూరత్వానికి గురిచేసినట్లు తేలితే, అప్పుడు వారికి జరిమానా విధించే బాధ్యతతో మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుంది.
ఏది ఏమైనా సామజిక,మానవీయ సమానత్వం కోసం రూపొందిన చట్టాలు కొందరి అవసరాలకు,అవకాశాలకు అడ్డుపెట్టుకొని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఒప్పుకోకతప్పదు. కష్టాలు ఎదురైనప్పుడు చట్టాలను ఆశ్రయించాల్సిందే కానీ వాటిని అడ్డుపెట్టుకొని అమాయకులని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని కొందరి వేదన.

# ఎమ్మెల్సీ కవిత నిర్దోషిగా బయటికొస్తారు..

### బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్

హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును బీఆర్ఎస్ సీనియర్ నేత నాగం జనార్దన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా.. ఈడీ అధికారులు ఎలా అరెస్టు చేస్తారంటూ ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కవిత అరెస్టు వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని నాగం జనార్దన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా, నిర్దోషిగా బయటికి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. న్యాయస్థానాల మీద తమకు పూర్తిగా నమ్మకం ఉందని చెప్పారు.

# బీఆర్ఎస్ లో చేరనున్న డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

- నేడు కేసీఆర్ సమక్షంలో చేరిక
- నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం



హైదరాబాద్, మార్చి 17 (జనంసాక్షి) : బహుజన్ సమాజ్ పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆదివారం రాత్రి ప్రకటించారు. హైదరాబాదులో వందలాది మంది ఆయన శ్రేయోభిలాషులు,ఆప్తులు, అభిమానులందరి తో సుదీర్ఘంగా మేధోమధనం జరిపిన అనంతరం కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని,దేశంలో లౌకికత్వాన్ని కాపాడడం కోసం, రాజ్యాంగ రక్షణ కోసం,బహుజనుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ చేరబోతున్నట్లు ప్రకటించారు.ఏ పార్టీలో చేరినా బహుజన మహనీయుల సిద్ధాంతాన్ని గుండెలో పదిలంగా దాచుకుంటానని అన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా నాగర్ కర్నూల్ బరిలో నిలువనున్నారు. పార్టీలో చేరిన అనంతరం ఆయన అభ్యర్థిత్వాన్ని కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉంది.


# పార్టీలు మారే వారికి రాజకీయ సమాధే..

### బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 17 (జనంసాక్షి) : చెప్పేవి శ్రీరంగనీతులు.. చేసేవి పరమచండాలపు పనులు అన్నట్టుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారం ఉందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. పార్టీలు మారిన వాళ్లను రాళ్లతో కొట్టి చంపాలని నిన్నటి దాకా పతివ్రతలా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు నిజస్వరూపం చూపిస్తున్నాడని అన్నారు. పార్టీ ఫిరాయింపులను నిర్లజ్జగా, నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. గతంలో వివిధ పార్టీల నేతలు చట్టానికి లోబడి తమ పార్టీలను విలీనం చేసి బీఆర్ఎస్‌లో చేరితే రేవంత్ రెడ్డి తప్పుబట్టారని దాసోజు శ్రవణ్ గుర్తు చేశారు. బీఆర్ఎస్‌లో చేరిన ఆయా ఎమ్మెల్యేల ఇండ్ల దగ్గర అప్పుడు చావు డప్పులు కొట్టి, వాళ్ల శవయాత్రలు చేసి.. వాళ్లపై భౌతికంగా దాడులు చేయాలని రెచ్చగొట్టిన రేవంత్.. ఇప్పుడు చిల్లర వైఖరికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ వైఖరిపై ఏం సమాధానం చెబుతారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. తాను మాట్లాడింది ప్రజలు మరిచిపోతారని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారేమో.. కానీ ఈ డిజిటల్ యుగంలో మాట్లాడిన ప్రతి మాట రికార్డు అయ్యి ఉంటుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో మాట్లాడిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను మీడియా ముందు దాసోజు శ్రవణ్ ప్రదర్శించారు. ' ఒక పార్టీలో అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ మారితే వాళ్లను ఉరి తీసే చట్టాలు కావాలని మీడియా సాక్షిగా గాంధీ టోపీ పెట్టుకుని రేవంత్ రెడ్డి అన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీలోని వాళ్లు ఎవరైనా పార్టీ మారే ప్రయత్నం చేస్తే వాళ్లను కొట్టి చంపుతామని కోమటిరెడ్డి చెప్పారు. వీళ్లిద్దరూ ఇంత పెద్ద ఎత్తున చిలుకపలుకలతో ప్రజలను నమ్మించి మోసం చేశారు.' అని తెలిపారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని దానం నాగేందర్‌ను పార్టీలో జాయిన్ చేసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

# మోదీ అక్కడ, నేను ఇక్కడ ప్రజలకు అండగా ఉంటాం





### మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్

కీసర, మార్చి 17 (జనంసాక్షి) :
మీకు తొక్కుడు బండకు ఉన్నంత ఓపిక ఉంటుందని, మీకు నేను అండగా ఉంటాను అన్ని మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లిలో ఆదివారం పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో మాజీ మంత్రి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీకు ఎప్పుడూ అండగా ఉంటానని, ఏం కావాలన్నా చేసి పెడతానన్నారు. మీకు ఎన్నికలలో ఎవరికి ఏం ఇచ్చినా తీసుకోవాలన్నారు. ఈ నియోజకవర్గంలో డబ్బుకు, ధర్మానికి మధ్య పోటీ ఉంటుందని అన్నారు. మోదీ అక్కడ, నేను ఇక్కడ ప్రజలకు అండగా ఉంటామన్నారు. ప్రశ్నించే గొంతుక అని ఓటు వేయించుకున్న రేవత్ రెడ్డి, మళ్లీ ఒక్కసారి అయినా వచ్చారా ?, ఏమన్నా పనులు చేశాడా ? పైగా నాకేం సంబంధం అని అడుగుతున్నారని ప్రశ్నించారు. మోదీ మొట్టమొదటి ఎన్నికల శంఖారావం మన నియోజకవర్గంలో మొదలు పెట్టారు, అది బర్కత్ కావాలి. 400 సీట్లలో మల్కాజ్గిరి కూడా ఒకటి ఉండాలని కోరారు.

### పద్మశాలి మార్కండేయ భవన నిర్మాణానికి సహకారం అందించాలి:

ఆత్మీయ సమ్మేళనం లో ఈటెల రాజేందర్ కి పద్మశాలి సంఘం తరుపున పద్మశాలి మార్కండేయ భవన నిర్మాణానికి, తమ సహాయ సహకారాలు అందించాలని వినతి పత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ ఛైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షులు కూరపాటి నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు వెంగల మధుసూదన్, అక్కాలా సురేష్, డుడుక రమేష్, మంత్రి వెంకటేష్, మాస్న ఆనంద్, ఇరుకుల శ్రీనివాస్, పెంట చంద్రమౌలి, చిలివర్ నర్సింగ్, భూపతి, రాజయ్య, బాలరాజు, వేంగల పద్మ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

*గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. జిల్లా స్థాయి నాయకుల అండదండలు లేకపోయినా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశారు. ఒక దశలో కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకోవాలంటేనే భయపడే రోజులు ఖమ్మంలో ఉండేవి. అలాంటి సందర్భంలోనూ పార్టీ కోసం, కిందిస్థాయి కార్యకర్తల కోసం ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ కోసం కాపు కాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ చర్యలను అడ్డుకోవడమే అజెండాగా కష్టపడ్డ కాంగ్రెస్ నాయకులు నేడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని మురిసిపోయి నాలుగు నెలలు గడవకముందే వారి సంతోషం ఆవిరి అయిపోతుంది.*

- పార్టీని నమ్ముకున్నోళ్లకు దక్కని న్యాయం
- క్రింది స్థాయి కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహం



# కష్టపడ్డ కార్యకర్తలకు మొండి 'చేయే'నా?

ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):

### మిక్కిలినేని నరేంద్ర పై కేసుల పరంపర

ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీలో ప్రముఖంగా వ్యవహ రించిన నాయకుడు మిక్కిలినేని నరేంద్రబాబు. ఇతనిపై నాటి అధికార పార్టీ నాయకుల దాష్టికాలు అన్నీ ఇన్ని కా వు. వీలు దొరికినప్పుడల్లా కేసులు పెడుతూ నిత్యం వేధించారు. లెక్కకు మించిన కేసులతో పోలీస్ స్టేషన్కు పిలిపించి ఎన్నోసార్లు వేధించారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో ఆయన ఇంట్లో ఉన్న రోజుల కంటే కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ, పోలీసులకు దొరక్కుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిన రోజులే ఎక్కువ. ఆయన భార్య మిక్కిలినేని మంజుల కార్పొరేటర్ గా పోటీ చేస్తే ఆమెను ఓడించేందుకు నాటి మంత్రి అజయ్ కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ కుట్రలను ఛేదిస్తూ, నిర్బంధాలను అధిగమిస్తూ బిఆర్ఎస్ ప్రభంజనాన్ని తట్టుకొని తన భార్యను కార్పొరేటర్ గా గెలిపించుకున్నాడు. డివిజన్లో తనకు సపోర్ట్ చేసే కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులతో వేధించిన వారికి అండగా నిలిచి పార్టీని కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. పార్టీ కష్ట కాలంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన మిక్కిలినేని నరేంద్రబాబుకు పార్టీ నాయకత్వం నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించి ఆయన కష్టానికి తగిన గుర్తింపు ఇస్తారని ఆశించిన కార్యకర్తలు నిరాశ చెందారు.

### సంవత్సరం పాటు జైల్లోనే ముస్తఫా...



ఖమ్మం నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేసిన నాయకుల్లో మహమ్మద్ ముస్తఫా పేరు ఉంటుంది. ఈయన నాటి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తోనే ఘర్షణకు దిగాడు. ముస్తఫాను అణగదొక్కేందుకు నాటి అధికార పార్టీలో ప్రముఖంగా ఉన్న మాజీ మంత్రి అజయ్ కుమార్, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు చేయాల్సిన అన్ని కుట్రలు చేశారు. ముస్తఫా భార్య రఫీదా బేగం కార్పొరేటర్ గా పోటీ చేసిన సమయంలో పోలీస్ సహాయంతో అధికార పార్టీ నాయకులు వారి ఓటమికి శాయశక్తులా ప్రయత్నించారు. అతని ప్రచారాన్ని సైతం అడ్డుకొని ఇబ్బందులు కొనసాగించారు. వీటిని దాటుకుంటూ ప్రజాబలంతో తన భార్యను కార్పోరేటర్ గా గెలిపించుకున్నాడు. తనకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ పార్టీ బలోపేతానికి నిత్యం కృషి చేస్తున్నాడు. ఒక దశలో ముస్తఫాను పీడీ యాక్ట్ పెట్టి సంవత్సరం పాటు జైల్లోనే ఉంచారు. ఈ నేపథ్యంలో కుటుంబానికి సైతం దూరమైనా పార్టీ పట్ల ఉన్న ప్రేమ, విధేయతను ముస్తఫా వదులుకోలేదు. ముస్తఫాపై పోలీస్ స్టేషన్లో నమోదు చేసిన కేసులు లెక్కకు మించి ఉన్నాయి. డివిజన్లో ఎలాంటి గొడవలు జరిగిన పోలీసులు మొట్టమొదట ముస్తఫాతో పాటు అతని తమ్ముడిని పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి వేధించేవారు.
మిక్కిలినేని నరేందర్, మహమ్మద్ ముస్తఫా పై పెట్టిన కేసులు నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న రేవంత్ రెడ్డి దృష్టికి రేణుక చౌదరి తీసుకెళ్లారు. వీరికి మానసిక స్థాయిలో ఇచ్చేందుకు ఎంతగానో కృషి చేశారు. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మహమ్మద్ జావిద్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పొంటి నాయకులు కష్టపడ్డారు. ఖమ్మం నగరంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఓటమిలో, ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గెలుపులో వీరి పాత్ర ఎవరూ కాదనలేనిది. ఇలాంటి వారిని పార్టీ అధిష్టానం గుర్తించి నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పిస్తారని జిల్లా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆశించారు. అయితే వీరికి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకుండా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు పార్టీలోకి వచ్చిన వారికి పదవుల్లో ప్రాధాన్యతను ఇవ్వటం స్థలాలు కిందిస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు రుచించడం లేదు. అధిష్టానం ఇలాంటి కార్యకర్తలను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



# రూ 6.50 కోట్లు మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్

### అద్దాల్లా మెరవనున్న గిరిజన గ్రామాల రహదారులు

**పాలకవీడు (జనంసాక్షి):**
మండలంలోని పలు గిరిజన గ్రామాల రహదారుల నిర్మాణాలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ నలమధ ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ 6.50 కోట్లు మంజూరీ చేశారని పాలకవీడు ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పిటిసి మాలోతు బుజ్జి మోతిలాల్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్ వి సుబ్బారావు లు తెలిపారు. ఆదివారం పాలకవీడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బెట్టే తండా గ్రామం నుండి శూన్య పాడు గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 3.5 కోట్లు,మూసి ఒడ్డు సింగారం గ్రామం నుండి రోడ్ల వారి గూడెం గ్రామానికి రూ 1.80 కోట్లు,రాఘవాపురం గ్రామం నుండి అలింగాపురం వరకు రూ 1 కోటి, బెట్టె తండా గ్రామం నుండి మూసి నదికి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణానికి రూ 10 లక్షలు, మూసి ఒడ్డు సింగారం గ్రామం నుండి రోళ్ళవారిగూడెం గ్రామానికి వెళ్లే రహదారిలో కల్వర్టు నిర్మాణానికి రూ 10 లక్షలు కలుపుకొని మొత్తం రూ 6.5 కోట్లు మంజూరి చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాలక వీడు మండలానికి తాజాగా మంజూరు చేసిన నిధులతో కలుపుకొని మొత్తం 10 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. నిర్మాణాలు పూర్తయితే పాలకవీడు మండలంలోని దాదాపు అన్ని రహదారులు అద్దాల్లా మెరవనున్నట్లు పేర్కొన్నారు. పాలకీడు మండల అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి ఉత్తమ్ కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాలోతు మోతిలాల్ నాయక్, పాలక వీడు శూన్య పాడు ఎంపీటీసీలు మీసాల ఉపేందర్ , కవిత నియమా నాయక్, నాయకులు సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా

# జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

### జిల్లా కలెక్టర్,ఎన్నికల అధికారి దాసరి హరిచందన

**నల్గొండటౌన్, మార్చి 17 (జనంసాక్షి):**
నల్గొండ జిల్లాలో పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన కోరారు.శనివారం కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసిన నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎన్నికల గజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని, ఏప్రిల్ 25 న నామినేషన్ దాఖలు చేసేందుకు చివరి తేదీ గా నిర్ణయించడం జరిగిందని, 26 న నామినేషన్ల పరిశీలన, 29 న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, పార్లమెంటు ఎన్నికల పోలింగ్ మే 13 న జరుగుతుందని, జూన్ 4 వ తేదీన దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుందని ఆమె వెల్లడించారు. నల్గొండ జిల్లాలో మొత్తం 1766 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 46 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని, 30 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు, 30 మహిళా నిర్వహణ పోలింగ్ కేంద్రాలు, 6 యూత్ పోలింగ్ కేంద్రాలు, మరో 6 పిడబ్ల్యుడి పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. 14.9 లక్షల ఓటర్లు ఉండగా, 7.35 లక్షల పురుష ఓటర్లు, 7.54 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారని, కొత్తగా 52,000 మంది ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. హోమ్ ఓటింగ్ కోసం ఆదివారం నుండి ఫార్మ్ 12 -డి అందుబాటులో ఉంచడం జరిగిందని, ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సాక్ష్యం యాప్ ద్వారా దరఖాస్తు చేససంచాలకులు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలలో 80 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్లకు హోమ్ ఓటింగ్ సౌకర్యం ఉండేదని, దానిని కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికలలో 85 సంవత్సరాలకు పెంచినట్లు ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది, ఈవీఎంలు, వివి ప్యాడ్లు అన్ని సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల వ్యయాన్ని నిర్వహించేందుకు జిల్లా కోపరేటివ్ అధికారి నోడల్ అధికారిగా ఎక్స్పెండిచర్ టీంను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, విఎస్ టి బృందాలు ఇదివరకే వారి పనులను మొదలుపెట్టాయని తెలిపారు.రాజకీయ పార్టీలు ప్రభుత్వ ఆవరణలను, స్థలాలను అధికారిక కార్యాలయాలను ఎన్నికల ప్రచారం కోసం వాడకూడదని, ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులను సి -విజిల్ తో పాటు, 1950 కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి చెప్పవచ్చని ఆమె పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ఎన్నికలలో విధులు నిర్వహించే సిబ్బది అందరికీ పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకొనే ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల వ్యయ




నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీలు పాంప్లెంట్లు, పోస్టర్లు తదితరవాటికి ముందస్తు అనుమతి తీసుకోవాలని, అలాగే వాటిలో ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ముద్రించినట్లయితే తప్పనిసరిగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్ పై యాక్షన్ తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం జిల్లా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించుకుని ఎన్నికల ప్రచారం చేయకూడదని, అదే విధంగా ఏవైనా వేడుకలను ఎన్నికలకు అనుకూలంగా మార్చుకోకూడదని, నామినేషన్ల సందర్భంగా 3 వాహనాలకు మించి వినియోగించరాదని, ప్రైవేట్ ఆవరణలో ఏదైనా ప్రచారానికి సంబంధించి వాడుకున్నట్లయితే యజమాని ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి శనివారం నుండి అమల్లోకి వచ్చిందని, ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లు వంటి వాటిని తొలగించడం జరుగుతుందని, 72 గంటల్లో పూర్తిగా వీటిని తీసివేస్తామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఏ ఒక్కరు 50 వేల రూపాయలకు మించి నగదును తీసుకువెళ్ల వద్దని, ఒకవేళ తీసుకు వెళ్ళవలసి వస్తే సరైన ఆధారాలను రుజువుగా ఉంచుకొని తీసుకు వెళ్ళవలసి ఉంటుందని, ఎక్కడైనా డబ్బు స్వాధీనం చేసుకున్నట్లయితే జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ కమిటీ వాటిని పరిశీలించిన తర్వాత విడుదల చేస్తుందని తెలిపారు. ఏదైనా ర్యాలీ తీయాల్సి వస్తే పది వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని ,10 దాటితే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆమె తెలిపారు. స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,డిఆర్ఓ డి రాజ్యలక్ష్మి, బిఎస్పీ నుండి ప్రధాన కార్యదర్శి షేక్ చాంద్ పాషా, బిజెపి ప్రధాన కార్యదర్శి లింగస్వామి ,ఎంఐఎం కోశాధికారి గౌస్ మహమ్మద్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నల్గొండ అశోక్ ,సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నుండి పిచ్చయ్య,ఈ సమావేశానికి హాజరయ్యారు.



# చెక్ పోస్ట్ ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్,పోలీసు కమీషనర్

**ఖమ్మం, మార్చి 17 (జనంసాక్షి):**
చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తణిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. కలెక్టర్, ఆదివారం పోలీసు కమీషనర్ సునీల్ దత్ తో కలిసి ఇల్లందు రోడ్, ఎన్ఎస్పి కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన తెలిపారు. నగదు, మద్యం రవాణా నియంత్రించాలన్నారు. సిసి కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్ పోస్ట్ లో వీడియోగ్రఫీ కి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అప్రమత్తంగా వుంటూ, 24 గంటల పటిష్ట నిఘా పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం అర్బన్ తహశీల్దారు సిహెచ్. స్వామి, అధికారులు తదితరులు ఉన్నారు.

## లోక్ సభ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

### జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

**ఖమ్మం అర్బన్, మార్చి17(జనంసాక్షి):**
లోక్ సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా రద్దు చేయడం జరిగిందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకట్రావు

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నందున ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని కోరారు.



## ప్రభుత్వ పథకాలపై ప్రకటనలు ప్రచారం చేయడం , ప్రచురించడం నిలిపివేయాలి

### జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన



**నల్గొండటౌన్, మార్చి 17 (జనంసాక్షి):**
పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలలో ఉన్నందున అన్ని టెలివిజన్ ఛానళ్లు, వార్త పత్రికల లో ప్రభుత్వ పథకాల పై ప్రకటనలు ప్రసారం చేయడం,ప్రచురించడం వంటివి నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసిందని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలమేరకు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 72 గంటలలోపు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అన్ని రకాల ప్రకటనలను ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయటం, ప్రచురించడం నిలిపివేయాలని, అలాగే ప్రభుత్వం సాధించిన విజయాలను సైతం ప్రచురించవద్దని, అలా కాదని ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘిస్తే ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్లు, ప్రభుత్వం సాధించిన విజయాలు వంటివి ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో ప్రచురించడం వంటివి నిలిపివేయాలని స్పష్టంగా కోరారు.

## ప్రపంచ శాంతికి పాలకులు కృషి చేయాలి

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
దేశాల మధ్య సోదర భావం నెలకొల్పి ప్రపంచ శాంతికి పాలకులు కృషి చేయాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్ లో ఆ సంఘ జిల్లా సమావేశం ఆదివారం జరిగింది.ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో మత సామరస్యాన్ని నెలకొల్పి రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాటుపడాలని తెలిపారు. ప్రపంచంలో ఘర్షణకు తావులేని యుద్ధ రహిత సమాజం కొరకు అందరూ కృషి చేయాలని అన్నారు. ఇటీవల పరిణామాలు చూస్తుంటే రాజ్యాంగబద్ధమైన పాలనకు బదులు సెక్యులర్ విధానానికి తూట్లు పొడిచే విధంగా పాలకులు వ్యవహరించడం బాధాకరమని ఆక్షేపించారు.దేశాల మధ్య ఘర్షణ,యుద్ధ వాతావరణం సంభవించకుండా ప్రపంచ శాంతికి ఐక్యరాజ్యసమితి కృషి చేయాలని కోరారు.చట్టసభల విలువలను కాపాడాలని ఆ దిశగా చైతన్యవంత సమాజాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.ఎన్నికల్లో డబ్బుల ప్రాధాన్యత పెరిగే విధంగా ఎన్నికల్లో పోటీ చేసే నాయకులు వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ఓటుకు నోట్లు తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమైన ప్రక్రియని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.ఈ ప్రాంతంలో స్వాతంత్ర సమరయోధులు ధర్మ బిక్షం, బిఎన్.రెడ్డి, రావి నారాయణరెడ్డి, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, ఎందరో మహనీయులు యువకులను, విద్యావంతులను చైతన్యవంతులు చేసి చట్టసభల్లో విలువలు కాపాడారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తొగిటి మురళి, బొమ్మగాని శ్రీనివాస్, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, పెంద్ర కృష్ణ, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా లోని విద్యార్థులు, తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త

### ప్రగతి సాధిస్తున్న ప్రభుత్వ కళాశాలలను కూడా పరిగణలోకి తీసుకోండి

**ఖమ్మంజిల్లా బ్యూరో, మార్చి 17 (జనంసాక్షి):**
పదో తరగతి పరీక్షలు కాకముందే కార్పొరేట్ శక్తులు, పల్లె పల్లెకు మీ గడపకు వస్తారు.మా కళాశాలలో ర్యాంకులు బాగా వస్తున్నాయి. చదువు బాగా చెబుతాము, అంటూ ఊదరకొడతారు.రంగురంగు కరపత్రాలతో ర్యాంకులతో మీ ముందుకు వస్తారు.దయచేసి చాలా జాగ్రత్తగా "అడ్మిషన్ ఫామ్" ఫిలప్ చేయండి.కేవలం 5000/- కట్టండి అడ్మిషన్ ఓకే చేస్తాము,ఆ తర్వాత ఫీజు మాట్లాడుకుందామని నమ్మపలుకుతారు.మీ వద్దకు వచ్చే కళాశాల బ్రోకర్లతో జాగ్రత్తగా వ్యవహరించండి.అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించండి.కళాశాల యొక్క వివరాలను పూర్తిగా తెలుసుకోండి.ఈ సందర్భంగా మెరుగైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలను ,సాధిస్తున్న ఫలితాలను కూడా గమనించి,పిల్లలను సరైన దిశగా పచనింప చేయండి.రంగురంగుల బిల్డింగులు రంగురంగుల కరపత్రాలు కాదు, హాస్టల్ వసతి బాగుందా లేదా, చదువు బాగుంటుందా లేదా అక్కడ ఉన్న ఫ్యాకల్టీ వివరాలు మన పిల్లవాడు లేదా మన పాప ఉండగలిగిద్దా, లేదా ఒకసారిఆలోచించండి. కళాశాలను

# ప్రైవేట్ కళాశాలల మోజులో పడకండి

సందర్శించండి.దయచేసి మీ దగ్గరకు వచ్చే బ్రోకర్లకు ఎలాంటి డబ్బులు కట్టకండి.కళాశాలకు వెళ్లి మీరు స్వయంగా చూసి అక్కడ వసతి, సౌకర్యాలు భోజనం తదితర విషయాలు బాగున్నాయి అనుకుంటేనే అడ్మిషన్ ఓకే చేసుకోండి.దయచేసి మీరు మాట్లాడుకునే ఫీజును జాగ్రత్తగా అడ్మిషన్ ఫామ్ మీద పెన్నుతో రాయించుకోండి.మాట్లాడేటప్పుడు ఒకరు ఫీజు ఫైనల్ చేసేటప్పుడు ఇంకొకరిని కళాశాలకు తీసుకెళ్లి ఇబ్బంది పడకండి.ఏదైనా యాజమాన్యంతో క్లుప్తంగా మాట్లాడుకొని, ఒక పేపర్ మీద మంచిగా ఫీజు వివరాలను రాసుకొని అక్కడ మీ సంతకాన్ని పొందుపరచండి.ఆ తర్వాత కళాశాల యాజమాన్యం ఫీజు పెంచారనో లేదా ఎక్కువ రాసారనో..రాజకీయ నాయకుల చుట్టూ తెలిసిన వారి చుట్టూ తిరిగి ఇబ్బంది పడకండి.ఈరోజు మీతో తియ్యగా మాట్లాడిన వారే రేపు మీతో, మీకు అన్ని చెప్పి చేసాం కదా అంటారు.క్షుణ్ణంగా క్లుప్తంగా వివరంగా మీరే వివరాలు కనుక్కొని సంతకం చేయండి.పెన్సిల్ తో అడ్మిషన్ చేస్తున్న వారిని దయచేసి నమ్మకండి.కళాశాల తరపున మీ వద్దకు వచ్చే బ్రోకర్లతో జాగ్రత్తగా వ్యవహరించండి.ఇప్పుడు మీకు మాయ మాటలు చెప్పి అడ్మిషన్ ఓకే చేసుకుని ఆ తర్వాత మిమ్మల్ని కాలేజీ చుట్టూ తిప్పించు కుంటారు. జాగ్రత్త.




# లోకసభ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ - పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి సమావేశం

**ఖమ్మంజిల్లా బ్యూరో, మార్చి 17 (జనంసాక్షి):**
భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ లోకసభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ కోరారు. ఆదివారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి జిల్లాలో సాధారణ లోకసభ ఎన్నికల నిర్వహణపై పాత్రికేయులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ లోకసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఓటరు జాబితా ప్రకారం 15 మార్చి నాటికి 16 లక్షల 23 వేల 814 మంది ఓటర్లు, 886 మంది సర్వీస్ ఓటర్లు, 222 ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారని ఆయన అన్నారు. ఇందులో 10318 మంది 85 సంవత్సరాల వయస్సుకు పైబడిన వారు, 30389 మంది దివ్యాంగులు ఉన్నట్లు ఆయన తెలిపారు. వీరిలో కావాల్సిన వారికి ఫారం-12డి ద్వారా హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 1083 లోకేషన్లలో, 1896 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్ కు రెండు కిలోమీటర్ల రేడియస్ లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. బఫర్, రిజర్వ్ బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన శనివారం నాటి నుండే జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించు కునేందుకు సింగిల్




విండో సిస్టం సువిధ యాప్ ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎం.సి.సి., సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎం.సీ.ఎం.సీ. కమిటీ, వ్యయ పర్యవేక్షణ, తదితర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. నూతన జిల్లా కలెక్టరేట్లో ఫిర్యాదులు స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు, సి -విజల్ యాప్ లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారు లు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదు పై చర్యలు తీసుకుంటా రని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు,ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ స్థలాల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదేవిధంగా ఎవరు ప్రింట్ చేయమన్నారు వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని, ఈ అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సమాచారం అందించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల వరకు దరఖాస్తు చేసిన వారందరికీ ఎపిక్ కార్డులు అందజేశామని, 35837 ఎపిక్ కార్డులు పంపిణీ కి పోస్టల్ శాఖకు అందజేసినట్లు, 41013 ఎపిక్ కార్డులు ముద్రణకు వెండర్ దగ్గర ఉన్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్టి, 15 ఎస్ఎస్టి, 27 ఎంసిసి టీములు, 141 సెక్టార్ అధికారుల ను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. 50 వేల పైబడి నగదు కు ఆధారాలు వెంట వుండాలన్నారు. పెట్రోల్ బంక్, జ్యూవెల్లరి, షాపింగ్ మాల్ నుండి ప్రతిరోజూ నగదు తరలింపు, బ్యాంక్ డిపాజిట్ వివరాలు, డబ్బు రవాణా చేసే ఏజెంట్ వివరాలు అందజేస్తే, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదు తో ప్రయాణించవద్దని, ప్రతిరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో, స్వేచ్ఛ, న్యాయబద్ద ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ట్రైనీ ఐపీఎస్ మౌనిక, జెడ్పి సిఇఓ వినోద్, డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి చీకటి రాంబాబు, బిజెపి పార్టీ ప్రతినిధి గంటేల విద్యాసాగర్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు, పసుమర్తి శ్రీనివాసరావు, సిపిఎం పార్టీ ప్రతినిధి ప్రకాష్, టిడిపి పార్టీ ప్రతినిధి రాజేశ్వరి, పాత్రికేయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విపణి

# పెట్రోల్ ధరల్లో ఏపీనే టాప్..

## డీజిల్‌లోనూ అత్యధికం



**దిల్లీ(జనంసాక్షి):** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో కేరళ, తెలంగాణ రాష్ట్రాలున్నాయి. లక్షద్వీప్, అండమాన్ నికోబార్, దిల్లీ వంటి ప్రాంతాల్లో పెట్రో ధరలు అతి తక్కువగా ఉండటం గమనార్హం. స్థానికంగా సేల్స్ టాక్స్ లేదా వ్యాట్ రేట్లలో వ్యత్యాసం వల్లే ధరల్లో ఈ మార్పులు చోటుచేసున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన ముందు (గతవారం).. ఆయిల్ కంపెనీలు లీటరుపై రూ.2 తగ్గించినప్పటికీ అనేక రాష్ట్రాల్లో వీటి ధరలు వంద రూపాయల దిగువకు చేరలేదు. వైసీపీ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.109.87గా ఉంది. దేశంలోనే ఇది అత్యధికం. ఎల్‌డీఎఫ్ కూటమి అధికారంలో ఉన్న కేరళలో రూ.107.54, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణాలో పెట్రోల్ ధర రూ.107.39గా ఉన్నాయి. భాజపా పాలిత ప్రాంతాల్లోనూ పెట్రోల్ ధరలు అధికంగానే ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో (భోపాల్) రూ.106.45, భాజపా-జేడీయూ కూటమి ప్రభుత్వమున్న బిహార్‌లో (పట్నా) రూ.105.16, రాజస్థాన్‌లో 104.86, ముంబయిలో రూ.104.19గా ఉన్నాయి.మమతా బెనర్జీ టీఎంసీ అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో పెట్రోల్ ధర రూ.103.93, ఒడిశా రూ.101.04, తమిళనాడు 100.73, ఛత్తీస్‌గఢ్ రూ.100.37లుగా ఉన్నట్లు తాజా నివేదిక వెల్లడించింది. అండమాన్ అండ్ నికోబార్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.82గా ఉంది. సిల్వస్సా, దమణ్ దీవ్‌లో రూ.92గా ఉంది. దిల్లీలో లీటరు పెట్రోల్ రూ.94.76, గోవాలో రూ.95, ఐజోల్ (మిజోరం)లో రూ.93, గువహటి(అస్సాం)లో రూ.96గా ఉన్నాయి. డీజిల్ ధరలు కూడా ఇదే రీతిలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా లీటరు ధర రూ.97.6గా ఉండగా, తిరువనంతపురం(కేరళ)లో రూ.96.41, హైదరాబాద్(తెలంగాణ)లో రూ.95.63, రాయ్‌పుర్(ఛత్తీస్‌గఢ్)లో రూ.93.31గా ఉన్నాయి. మహారాష్ట్ర, బిహార్‌లలో లీటరు డీజిల్ ధర రూ.92-93గా ఉన్నాయి. ఒడిశా, ఝార్ఖండ్‌లలోనూ ఇదే విధంగా ఉన్నాయి. అతి తక్కువగా అండమాన్ నికోబార్‌లో (రూ.78) ఉండగా.. దిల్లీ, గోవాలలో డీజిల్ లీటరుకు రూ.87గా కొనసాగుతున్నాయి.

# తరలిపోనున్న టెకీలు

### అంతర్జాతీయ విపణులకు వచ్చే 3-5 ఏళ్లలో 2.4 కోట్ల మంది



**సింగపూర్(జనంసాక్షి):** వచ్చే 3-5 ఏళ్లలో 2.4 కోట్ల మంది సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణులైన మానవ వనరులు(టెకీలు) అంతర్జాతీయ విపణుల కోసం భారత్ నుంచి సిద్ధంగా ఉంటారని ఫౌండిట్ (జాబ్ ప్లేస్‌మెంట్ ప్లాట్‌ఫామ్) సీఈఓ శేఖర్ గరిస అంటున్నారు. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫౌండిట్, ఇప్పటికే 9 కోట్ల మంది నమోదిత ఉద్యోగార్థుల(ఫ్రెషర్స్)తో కలిసి పని చేస్తోంది. ఇందులో 70 శాతం (6.3 కోట్ల) మంది భారతీయ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచే ఉన్నారు. తదుపరి తరం రిక్రూట్‌మెంట్ సొల్యూషన్ యాప్‌ను సింగపూర్‌లో విడుదల చేసిన అనంతరం శేఖర్ ఈ వివరాలు తెలిపారు. నిపుణులైన మానవ వనరులకు అతి పెద్ద కేంద్రంగా భారత్ ఉండబోతోందని పేర్కొన్నారు ప్రస్తుతం తమ ఉద్యోగ ఏర్పాట్లలో 60% భారత్‌లో, 35% ఆగ్నేయాసియా దేశాల్లో, 5% పశ్చిమాసియా దేశాల్లో ఉన్నాయని తెలిపారు. వచ్చే 3-5 ఏళ్లలో 60 కోట్ల మంది నిపుణులతో అంతర్జాతీయ డేటాబేస్ రూపొందిస్తామని, ఇందులో 8 కోట్ల మంది భారత్ నుంచే ఉంటారని వివరించారు. గతంలో మాన్‌స్టర్‌గా ఉన్న సంస్థను 2022లో ఫౌండిట్‌గా రీబ్రాండ్ చేసి ఆసియా పసిఫిక్, పశ్చిమాసియాలపై ఎక్కువ దృష్టి నిలిపినట్లు తెలిపారు. తమ తదుపరి తరం రిక్రూట్‌మెంట్ సొల్యూషన్‌ను సింగపూర్, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌ల్యాండ్, హాంకాంగ్, ఇండొనేషియా, వియత్నాం లకు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

| నెక్ గుడ్ల ధరలు | ఒకటి | వంద |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 4.05 | ₹ 405 |
| వరంగల్ | ₹ 4.05 | ₹ 405 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹60,590 | ₹66,100 |
| చెన్నై | ₹61,150 | ₹66,710 |

**వెండి ధరలు (కేజీ)** హైదరాబాద్ ₹80,300

## భారత్‌లో పెట్టుబడులకు స్విస్ కంపెనీల ఆసక్తి



**దిల్లీ(జనంసాక్షి):** చాక్లెట్ తయారీ సంస్థ బారీ క్యాలిబాట్, టెక్ సంస్థ బుహ్లర్ సహా స్విట్జర్లాండ్‌కు చెందిన అనేక కంపెనీలు భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని ఆ దేశ ఆర్థిక వ్యవహారాల సెక్రటరీ హెలెన్ బడ్లిగర్ తెలిపారు. హెస్ గ్రీన్ మొబిలిటీ 2025 నాటికి భారత్‌లో 3,000 విద్యుత్తు బస్సులను తయారు చేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. అందుకోసం వచ్చే 6-8 ఏళ్లలో 110 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. బారీ క్యాలిబాట్ తన మూడో తయారీ కేంద్రాన్ని భారత్‌లో 2024లోనే ప్రారంభించే యోచనలో ఉందని బడ్లిగర్ తెలిపారు. గత ఐదేళ్లలో కంపెనీ ఇక్కడ 50 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. మరోవైపు భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించి 30 ఏళ్లు నిండిన సందర్భంగా వచ్చే 2-3 ఏళ్లలో బుహ్లర్ 23 మిలియన్ డాలర్ల పెట్టుబడులకు ఆసక్తిగా ఉందని వెల్లడించారు. వీటితో పాటు అనేక చిన్న కంపెనీలు భారత్ వైపు చూస్తున్నాయని చెప్పారు. రవాణ/రైల్వే, ప్రెసిషన్ ఇండస్ట్రీస్, ఆటోమేషన్ వంటి రంగాల్లో ఇరు దేశాల మధ్య వ్యాపారానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని బడ్లిగర్ తెలిపారు. ఈ పరిశ్రమల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందించడానికి స్విస్ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అత్యంత వేగవంతమైన వృద్ధి నమోదు చేస్తున్న భారత్ వంటి దేశాలకు అది చాలా అవసరమని వివరించారు. భారత్-ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరిన విషయం తెలిసిందే. దీంతోపాటు రాబోయే 15 ఏళ్లలో మన దేశంలోకి రూ.8.3 లక్షల కోట్ల కచ్చిత పెట్టుబడులకు హామీ లభించింది. ఇందువల్ల 10 లక్షలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయి. ఈఎఫ్‌టీఏలో స్విట్జర్లాండ్, ఐస్‌లాండ్, లిక్టన్‌స్టైన్, నార్వే సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ ఒప్పందంతో స్విట్జర్లాండ్ వాచీలు, కట్ అండ్ పాలిష్డ్ వజ్రాలు, చాక్లెట్లు, బిస్కెట్లు, గోడ గడియారాల వంటివి తక్కువ ధరలకే లభించే అవకాశం ఉంది.

## భారత్-యూకే వాణిజ్య చర్చలకు విరామం

### ఎన్నికల షెడ్యూలు విడుదల నేపథ్యం

భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాని కి సంబంధించి తాజాగా జరిగిన చర్చలు ఎలాంటి పురోగతి లేకుండానే ముగిశాయి.అయితే, ఈ ఒప్పందం ఇప్పుడప్పుడే ఖరారయ్యే అవకాశాలు కన్పించట్లేదు. ఎన్నికల షెడ్యూలు ప్రకటన నేపథ్యంలో చర్చలకు తాత్కాలికంగా విరామమిచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్రిటిష్ అధికారిక వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. మరికొద్ది రోజుల్లో భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.అటు బ్రిటన్ కూడా ఈ ఏడాదే సాధారణ ఎన్నికలకు వెళ్లనుంది. ఈ క్రమంలోనే పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలను నిలిపివేయాలని ఇరు దేశాలు అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. 'చర్చల నుంచి ఇరు వర్గాలూ వైదొలగడం లేదు. ఉమ్మడి ఆశయాలకు అనుగుణంగా ఒప్పం దాన్ని ఖరారు చేయడానికి ఏకాభిప్రాయం ఇంకా కుదరలేదు' అని బ్రిటిష్ అధికారి ఒకరు చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇటీవల ఈ ఒప్పందంపై మోదీ, రిషి సునాక్ ఫోన్లో మాట్లాడుకున్న విషయం తెలిసిందే.

## సింగిల్ క్లిక్‌తో ఆధార్ హిస్టరీ..

బ్యాంకుల్లో ఖాతా తెరవాలన్నా, కొత్త సిమ్ కార్డు తీసుకోవాలన్నా ప్రతి దానికి ఆధార్ కార్డ్ సమర్పించాల్సిందే. ఇలా అవసరమున్న ప్రతి చోటా ఆధార్ నెంబర్ ఇచ్చేస్తున్నాం. దీంతో ఈ కార్డ్‌ని ఎక్కడెక్కడ ఉపయోగిస్తున్నామో తెలియట్లేదు. వేరెవరైనా దీన్ని వినియోగిస్తున్నారా అనే అనుమానం కూడా కలుగుతూ ఉంటుంది. ఇలాంటి విషయాలను తెలుసుకోవాలంటే మీ కార్డ్ హిస్టరీ తెలుసుకోవాలి. దీంతో ఆధార్‌ని మీ అనుమతి లేకుండా ఎవరైనా వినియోగించారో సులువుగా కనిపెట్టేయొచ్చు. ఇంకా ఎటువంటి మోసపూరిత చర్యలకైనా పాల్పడుతుంటే ఇట్టే తెలిసిపోతుంది. దీని కోసం ఉడాయ్ పోర్టల్‌కు వెళ్లాలి. ఆధార్‌కు లింక్ చేసిన ఓటీపీ, బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ ద్వారా మీ ఆధార్ కార్డును ఆరు నెలలుగా ఎక్కడెక్కడ వినియోగించారనే డేటా కనిపిస్తుంది




# ఎన్నికలు @ సామాజిక మాధ్యమం

## వాట్సాప్, ఫేస్‌బుక్‌లదే హవా



దిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియకు దేశం సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే ప్రజలను తమవైపు ఆకర్షించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రచార వేడిని పెంచాయి.ఇందులో సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లదే కీలక పాత్ర. గతంలో ఓట్ల కోసం కరపత్రాల పంపిణీ, సభల నిర్వహణ, గడప గడపకూ వెళ్లి ఓటర్లను కలవడం ఇలా సాగేది ప్రచారం. ఇప్పుడు పంథా మారిపోయింది. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఎఅ) అభివృద్ధి చెందడంతో సోషల్ మీడియా ప్రధాన ప్రచార మాధ్యమంగా మారిపోయింది. గత ఎన్నికలతో పోలిస్తే 2024 ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా లేకుండా గెలవలేవమని చాలా పార్టీలు భావిస్తున్నాయట.ప్రస్తుతం దేశంలో స్మార్ట్‌ఫోన్‌లు వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. తక్కువ ధరకే డేటా లభిస్తోంది. ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం దేశంలో యువ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఉదయం లేచింది మొదలు నిరంతరం తమ స్మార్ట్ ఫోన్లలో ఏదో ఒక సోషల్ మీడియాలో వీళ్లు కంటెంట్ చూస్తున్నారు. ఇదే అంశం పార్టీలకు సానుకూలంగా మారింది. వీటితోపాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు పార్టీలోని ముఖ్య నాయకులు ఇంటర్వ్యూలు ఇస్తూ.. యూట్యూబ్ ద్వారా పార్టీ ప్రధాన అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. గత కొద్ది నెలలుగా కేంద్ర మంత్రులు జైశంకర్, స్మృతి ఇరానీ, పీయూష్ గోయల్, రాజీవ్ చంద్రశేఖర్‌లు ప్రముఖ పాడ్‌కాస్ట్ యూట్యూబ్ ఛానల్‌కు వరుస ఇంటర్వ్యూలు ఇచ్చారు. దానికి సుమారు ఏడు మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. అదే సమయంలో రాహుల్ గాంధీ కూడా మరో పాడ్‌కాస్ట్ ఛానల్ ముఖాముఖిలో పాల్గొన్నారు.ఓటర్ల అభిప్రాయం తెలుసుకునేందుకు 'లెటర్ ఫ్రమ్ ది ప్రైమ్ మినిస్టర్' పేరుతో భాజపా వాట్సాప్‌లో ఓ లేఖను ప్రచారం చేస్తోంది. దాంతోపాటు 'మై ఫస్ట్ ఓట్ ఫర్ మోదీ' పేరుతో వెబ్ పేజ్‌ను ప్రారంభించి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసింది. అందులో ఆయన నేరుగా ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతారని ప్రచారం చేస్తోంది. ఎక్కువ వాట్సాప్ గ్రూప్‌లు ఉంటే సులువుగా ప్రజలను చేరుకోవచ్చని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రచారానికి ప్రధాన మాధ్యమంగా ఫేస్‌బుక్‌నే ఎక్కువ మంది ఎంచుకుంటున్నారని ఎన్నికల విశ్లేషకుడు అమితాబ్ తివారీ తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం ఫేస్‌బుక్‌కు 36.6 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. ఇవికాకుండా.. ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్ ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారు.ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం.. 2019 పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం భాజపా రూ.325 కోట్లు ఖర్చు చేయగా, కాంగ్రెస్ రూ.356 కోట్లు ఖర్చు చేసింది. కొవిడ్-19 పరిస్థితుల తర్వాత సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల సంఖ్య పెరిగింది. వాళ్లకు ఇచ్చే ప్రత్యేక ఇంటర్వ్యూలను పార్టీ అనుకూల ప్రచారానికి మాధ్యమాలుగా ఉపయోగిస్తున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రచారం లేకుండా గెలిచే పరిస్థితి లేదని పార్టీలు గట్టిగా నమ్ముతున్నాయని అమితాబ్ చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా జిల్లా, నియోజకవర్గాలకు బృందాలను ఏర్పాటు చేసుకుని ప్రచారంలో ముందుకు సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఇందులో మరింత మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఓటర్లను నేరుగా కలవకుండా.. ఏఐ సాంకేతికతతో వారితో నేరుగా సంభాషించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయంటున్నారు. మరోవైపు ఎన్నికల సంఘం కూడా సోషల్ మీడియా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించింది. నకిలీ సమాచారం వ్యాప్తి చెందకుండా జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి వాటిపై నిఘా పెట్టింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఇన్‌ఫ్లూయెన్సర్లు, ప్రముఖులు, సినిమా తారలతో ప్రచారం చేయిస్తోంది.

# సీట్లు.. 543, షెడ్యూల్.. 544

## లోక్‌సభలో స్థానాల మధ్య వ్యత్యాసం ఎందుకంటే?

లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.అయితే, దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలుండగా.. ఈసీ మాత్రం 544 పార్లమెంటు స్థానాలకు షెడ్యూల్ ప్రకటించింది. దీంతో ఇది చూసిన వారికి కాస్త గందరగోళంగా అనిపించింది. అయితే, ఈశాన్య రాష్ట్రంలో ఒక పార్లమెంటు స్థానానికి రెండు దశల్లో పోలింగ్ జరగడమే ఇందుకు కారణం.ఈసీ శనివారం ప్రకటించిన లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌లో మొత్తం 544 పార్లమెంటు స్థానాలున్నాయి. కొత్తగా మరో పార్లమెంటరీ స్థానం చేరలేదు. అలా అని తప్పుగానూ ప్రకటించలేదు. ఇదే విషయంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌ను మీడియా ప్రశ్నించగా.. వివరణ ఇచ్చారు. ఔటర్ మణిపుర్ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఇక్కడ రెండు దఫాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.మణిపుర్‌లో ఇన్నర్, ఔటర్ మణిపుర్ లోక్‌సభ స్థానాలుండగా.. అందులో ఏప్రిల్ 19, 26 తేదీల్లో అక్కడ పోలింగ్ జరగనుంది. ఇన్నర్ మణిపుర్‌తోపాటు ఔటర్ మణిపుర్‌కు చెందిన పలు సెగ్మెంట్లలో తొలి, రెండోదశలో పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో ఇటీవల నెలకొన్న ఘర్షణల కారణంగా అక్కడ ఇలా పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది.



## జాతీయం అంతర్జాతీయం



### 18 మంది పాక్ హిందూ శరణార్థులకు

# భారత పౌరసత్వం

**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లో నివాసముంటున్న పాకిస్థాన్‌కు చెందిన 18 మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం లభించింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపునకు హాజరైన గుజరాత్ హోంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి వారికి పౌరసత్వం ప్రదానం చేశారు.2016, 2018 గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ మైనారిటీలకు భారత పౌరసత్వాన్ని మంజూరు చేయడానికి గుజరాత్‌లోని అహ్మదాబాద్, గాంధీనగర్, కచ్ జిల్లా కలెక్టర్లకు అధికారం ఉందని ప్రకటన తెలిపింది. ఇప్పటి వరకు 1,167 మందికి పౌరసత్వం ఇచ్చినట్లు పేర్కొంది.నూతన భారత్ కల సాకారానికి అందరితో కలిసి పనిచేయాలని తాజాగా పౌరసత్వం పొందిన వారికి మంత్రి పిలుపునిచ్చారు. భారత అభివృద్ధి పథంలో భాగస్వాములవుతారని ఆశిస్తున్నామన్నారు. భారత పౌరసత్వం పొందిన వారందరినీ ప్రధాన స్రవంతిలో భాగం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. పాక్, అఫ్గాన్, బంగ్లా నుంచి వచ్చిన బాధిత మైనారిటీలకు సులువుగా, వేగంగా ఇక్కడి పౌరసత్వం ఇచ్చేందుకు ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్ షా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.



# అమెరికా వారికి పౌరసత్వం ఇస్తుందా..?

**- హరీశ్ సాల్వే**



భారత్ పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలు చేయడంపై ఇటీవల అమెరికా ఆందోళన వ్యక్తం చేయడాన్ని సీనియర్ న్యాయవాది, మాజీ సోలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే తప్పుపట్టారు.ప్రపంచ వ్యాప్తంగా వేధింపులకు గురవుతున్న మైనార్టీల కోసం అమెరికా సరిహద్దులు తెరుస్తుందని వ్యంగ్యంగా అన్నారు. ఓ ఆంగ్లవార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. "పాకిస్థాన్‌లో వేధింపులకు గురయ్యే అహ్మదీయాలు, మయన్మార్‌లోని రోహింగ్యాలు, దారుణంగా ప్రాణాలు కోల్పోతున్న పేద పాలస్తీనా వాసులకు అమెరికా పౌరసత్వం ఇస్తుందా..? ఒక వేళ ఇవ్వకపోతే నోరుమూసుకోవాలి" అని అన్నారు.ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చే అంశాన్ని అగ్రరాజ్యం పునఃపరిశీలించుకోవాలని, అంతర్గత సమస్యలపై దృష్టిపెట్టాలని సాల్వే అమెరికాకు హితవు పలికారు. పాక్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లో మైనార్టీల సంఖ్య వేగంగా పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో భారత్‌కు శరణార్థులను తట్టుకొనే శక్తి పరిమితంగానే ఉందన్నారు. శ్రీలంక, మయన్మార్ మత రాజ్యాలు కాదని.. అందుకనే వాటిని సీఏఏలో చేర్చలేదని అభిప్రాయపడ్డారు. సీఏఏ అమలు కోసం భారత్ జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఇటీవల అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశం తమను ఆందోళనకు గురిచేస్తోందని, దీని అమలును నిశితంగా పరిశీలిస్తు న్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తెలిపారు. ఈ వ్యాఖ్యలకు భారత్ దీటుగా స్పందించింది. భారత బహుళ సంస్కృతులు, దేశ విభజన అనంతర చరిత్రపై పరిమిత జ్ఞానం ఉన్నవా రు అనవసర ఉపన్యాసాలు ఇవ్వొద్దని విదేశీ వ్యవహా రాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

## రెండు రోజుల ముందే ఓట్ల లెక్కింపు

### అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం ప్రత్యేకంగా అమలు

దిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది.వాస్తవానికి ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఓట్ల లెక్కింపు లోక్‌సభతోపాటే జూన్ 4న చేపట్టనున్నట్లు ఈసీ శనివారం ప్రకటించింది. అయితే.. వీటి అసెంబ్లీల గడువు జూన్ 2కే ముగియనుంది. దీంతో జూన్ 4న బదులు.. జూన్ 2నే ఈ రాష్ట్రాల్లో కౌంటింగ్ చేపట్టి, మొత్తం ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఎన్నికల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. ఇక్కడి పార్లమెంటు స్థానాల ఓట్ల లెక్కింపులో ఎలాంటి మార్పులు లేవని వెల్లడించింది.60 అసెంబ్లీ సీట్లు కలిగిన అరుణాచల్ ప్రదేశ్‌లో ఏప్రిల్ 19న ఒకే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. భాజపా, నేషనల్ పీపుల్స్ పార్టీ, ఒక స్వతంత్రుడితో కూడిన ఎన్డీయే కూటమి పాలన సాగుతోంది. సరిహద్దు ప్రాంత అభివృద్ధి, మౌలిక సదుపాయాలు ఎన్నికల అంశాలుగా ఉన్నాయి.సిక్కింలో మొత్తం 32 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈ రాష్ట్రంలోనూ ఏప్రిల్ 19న ఒకే దశలో పోలింగ్‌కు షెడ్యూల్ విడుదలైంది. భాజపా, సిక్కిం క్రాంతికారి మోర్చాలతో కూడిన ఎన్డీయే కూటమి అధికారంలో ఉంది. మహిళా సంక్షేమ పథకాలు, అవినీతే ప్రధాన ప్రచారాంశాలు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కనమేని చక్రధర్ రెడ్డి

**ముస్తాబాద్ మార్చి 17 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 100 రోజులలో 16 కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన సందర్భంగా పిల్లల భవిష్యత్తుకు బాట వేసిన ముఖ్యమంత్రిని ముస్తాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కనమేని చక్రధరెడ్డి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టించుకోని పనులను కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్డి నెరవేరుస్తున్నందుకు యావత్తెలంగాణ రాష్ట్ర.ప్రజలుసంతోషపడుతున్నారు. గెలిచిన మూడు నెలల్లోనే ముస్తాబాద్ మండలంలో అన్ని గ్రామాలలో సిసి రోడ్లు గాని డ్రైనేజీ గాని అభివృద్ధి పనులకు భూమి పూజలు నిర్వహిస్తున్నారు. గృహలక్ష్మి పథకం. ఉచిత బియ్యం . ఉచిత కరెంటు 24. గంటలు. కరెంటు. మరి చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పార్టీ చెప్పి చేయదు. చేసి చూపించే అటువంటి సత్త గల పార్టీ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికలు తెలంగాణ రాష్ట్రంలో 12 సీట్లు ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారు. ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారు. అభివృద్ధిని చూసి ఓటేస్తారని అన్నారు.

## శంభు లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శంకర్ గౌడ్ ను సన్మానించిన రైస్ మిల్లర్స్

**సుల్తానాబాద్,మార్చి 17(జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని పూసాల శంభు లింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన వేగోళం శంకర్ గౌడ్ ను ఆదివారం రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షులు నగునూరి అశోక్ మాడూరి ప్రసాదులు ఘనంగా శాలువతో సన్మానించారు.శంకర్ గౌడ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.శంకర్ గౌడ్ తన పదవి కాలంలో శంభులింగేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దన్నమనేని వెంకటేశ్వరరావు, వెనిశెట్టి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా నాగరిగారి ప్రీతం ఎంపిక పట్ల హర్షం

**సుల్తానాబాద్,మార్చి 17(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా టి పి సి సి ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ నాగరి గారి ప్రీతం నియామకం పట్ల పెద్దపల్లి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు న్యాతరి శ్యాంసుందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాతరి శ్యాంసుందర్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా నాగరిగారి ప్రీతం తన పదవి కాలంలో ఎస్సీలను అన్ని రంగాలలో అభివృద్ధి రంగంలో నడిపిస్తారని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నియామకం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి న్యాతరి శ్యాంసుందర్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీ కమిషన్ సభ్యునికి మాస్ సన్మానం

**పెద్దపల్లి,మార్చి 17(జనంసాక్షి) :** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యునిగా బాధ్యతలు చేపట్టి మొట్ట మొదటిసారిగా పెద్దపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన వడ్డేపల్లి రామచందర్ ను మహనీయుల ఆశయ సాధన సంఘ వ్యవస్థాపక అద్యక్షుడు బొంకూరి కైలాసం మర్యాద పూర్వకంగా కలిశారు.వారికి పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.పెద్దపల్లి జిల్లా రామగుండం మండలానికి చెందిన వడ్డేపల్లి రామచందర్ కు ఉన్నతమైన పదవి లభించడం అభినందనీయమన్నారు.వడ్డెపల్లిని కలిసి అభినందనలు తెలిపిన వారిలో మాల మహానాడు జిల్లా నాయకులు గాదం శంకరయ్య,పట్టణ అధ్యక్షులు ఖండే కరుణాకర్ తదితరులు ఉన్నారు.

## బొగ్గు అవసరాల దృష్ట్యా

# బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలి

### అడిషినల్ కోల్ సెక్రటరీ విస్మితా తేజ్, సింగరేణి చైర్మన్ బలరాం

**యైటింక్లయిన్ కాలనీ మార్చి 17 (జనంసాక్షి) :** బొగ్గు అవసరాల దృష్ట్యా బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అడిషనల్ కోల్ సెక్రెటరీ విస్మితా తేజ్, సంస్థచైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం లు అన్నారు. ఆదివారం అడిషనల్ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్ విస్మితా తేజ్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాంతో కలిసి ఓసీపీ-3 సీహెచ్‌పీని సందర్శించారు. సీహెచ్‌పీ నుండి బొగ్గు రవాణా జరుగుతున్నా ఫ్రీ వెబిన్ వ్యాగన్ లోడింగ్ సిస్టమ్‌ను పరిశీలించి రోజుకు ఎన్ని ర్యాక్స్ లోడింగ్ జరుతున్నవి. త్వరితగతిన బొగ్గు రవాణా మరియు వెమెంట్ విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో చేపట్టబోతున్న ప్రణాళికల, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాకు సంబందించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత కు కంపెనీ చేపడుతున్న ప్రణాళికలు మరియు రక్షణ పట్ల తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు, కంపెనీలో చేపడుతున్న నూతన సాంకేతికత, రానున్న రోజులలో కంపెనీలో చేపడుతున్న నూతన ఆవిష్కరణలు, తదితర విషయాలను అడిషనల్ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్‌కి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వేసవిలో బొగ్గు అవసరాల దృష్ట్యా బొగ్గు ఉత్పత్తి మరియు రవాణాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. యంత్రాల మరమ్మత్తుల విషయంలో ఏలాంటి జాప్యం లేకుండా వెంటనే మరమ్మత్తులు చేయాలని, బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని అధికారులకు సూచించారు. వారి వెంట సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్ అండ్ పా)ఎన్వీకె శ్రీనివాస్, ఏరియా జనరల్ మేనేజర్ ఎల్ వి సూర్యనారాయణ, జీఎం ఆర్జీ-1 చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ఎస్ఇ సిహెచ్‌పీ జీ. సదానందం, సీనియర్ సెక్యూరిటి అధికారులు వీరారెడ్డి, షరీఫ్ మహమ్మద్ తదితరులు ఉన్నారు.





# ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమం




**పెద్దపల్లి,మార్చి 17(జనంసాక్షి) :** మండలం మారేడుగొండ గ్రామంలో ఎన్ ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ముగింపులో భాగంగా ముఖ్య అతిథిగా ఏ ఎస్ ఐ డి. రవీంద్రరావు ,కొండ రవి యాదవ్ ( ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత) పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ మనిషి కష్టపడితే డబ్బులు దాని అంతట అదే వస్తుందని, ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ద్వారా విద్యార్థులకు సమాజంలో నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటారని మరియు ఇప్పటి యువకులు సోషల్ మీడియా ( ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ ) ద్వారా చెడు దారిన పడుతున్నారని మంచి మార్గాన్ని వెళ్లాలని విద్యార్థులను సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు గురి కాకుండా దూరంగా ఉండమని సూచించారు. విద్యార్థులు సామాజిక సేవ,కార్మిక సేవ అలవర్చుకోవాలని తెలియ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రవి యాదవ్ మాట్లాడుతూ నేటి యువత చెడు మార్గంలో వెళ్లకుండా స్వామి వివేకానంద బాటలో నడిచి స్వార్థాన్ని విడిచి నిస్వార్థ సేవలో ముందుండాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే ఆ ప్రతిఫలాలను ప్రజలకు చేర వేసే విధంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పనిచేయాలన్నారు. అనంతరం దేశభక్తి, ఎన్ఎస్ఎస్ సామాజిక గేయాలతో రవి యాదవ్ అలరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కే. రమ్య,ఈశ్వర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ క్యాంపుకు రాకముందు సామాజిక సేవ మీద అవగాహన ఉండేది కాదని కానీ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు పాల్గొన్న తర్వాత మాలో సామాజిక సేవ మరియు ఇంట్లో తల్లిదండ్రులకు సేవ చేయడం మొదలుపెట్టాము, ఎంఈవో,ఎంఆర్ఓ హెల్త్ ఎడ్యుకేటర్, శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మనోహర్ కు మారేడుగొండ గ్రామ ప్రజలకు వాలంటీర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు మరియు వచ్చిన అతిథులను సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏం ఏ సమద్, అధ్యాపకురాలు ఆమని,ఎన్ఎస్ఎస్ వాలంటరీస్ పాల్గొన్నారు.

# మాదిగ బిడ్డ గజ్జెల కాంతానికే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

### ప్రజాసంఘాల జేపీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



**పెద్దపల్లి,మార్చి 17 (జనంసాక్షి) :** అంబేద్కర్ ఆశయాలను తమ స్వార్థానికి ఉపయోగించుకొని ఆర్థికంగా ఉన్నత శిఖరాలకు ఎదిగిన వ్యాపారులకు పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని కేటాయించి మాదిగలకు అన్యాయం చేయవద్దని మాదిగ శక్తి వ్యవస్థాపకులు, తెలంగాణ ప్రజాసంఘాల జేపీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని నందనగార్డెన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సన్ని మాట్లాడుతూ వ్యాపారాలు, హోదాల కోసం రిజర్వేషన్లను వాడుకునే వారిని దూరం పెట్టాలని, ఉద్యమ నేపథ్యం కలిగిన ప్రజా సంఘాల జేపీసి నాయకుడు గజ్జెల కాంతానికే పెద్దపల్లి పార్లమెంటు సీటుని ఖరారు చేయాలని అన్నారు. దీనిలో భాగంగా ఇటీవల గాంధీభవనులో వెయ్యి మాదిగ డప్పులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఇతర మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. తెలంగాణాలో కుటుంబపాలనను అంతమొందించిన విధంగానే, కాంగ్రెస్ పార్టీలో సైతం కుటుంబ రాజకీయాలను మట్టిలో కలపాలని డిమాండ్ చేశారు. చాలా యేళ్ళుగా మాదిగలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారన్న ఆయన రానున్న ఎన్నికల్లో గజ్జెల కాంతం అభర్థిత్వాన్ని ఖరారు చేస్తే మాదిగలతో పాటు అన్నివర్గాల మద్దతు కూడా పొందే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో ఏఐసిసి కార్యాలయం ముందు మాదిగ డప్పులతో ప్రదర్శన చేపట్టనున్నట్లు వివరించారు. రిజర్వేషన్లను అడ్డంపెట్టుకొని అడ్డగోలుగా సంపాదించిన వారు సైతం రిజర్వుడు స్థానాలను ఆశించడం సిగ్గుచేటని విమర్శించారు. మాదిగేతరులకు టికెట్ కేటాయించి మాదిగలను అణగదొక్కే ప్రయత్నం చేయొద్దని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజాసంఘాల జేపీసీ జిల్లా అధ్యక్షులు పొన్నం సత్తయ్య గౌడ్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్క చంద్రమౌళి, శక్తి జిల్లా కన్వీనర్ కళ్ళేపల్లి రవిమాదిగ, దూడ భూమయ్య, సముద్రాల అజయ్, గజ్జెల ఆనందరావు, సుద్దాల లక్ష్మణ్, గోసిక శంకర్, కొయ్యడ వినోధ్, చొప్పదండి లక్ష్మణ్, మాచర్ల బబ్లూ, ఆర్లకొండ ఈశ్వర్ దాస్, పల్లురి నాగరాజు, సతీష్, కె రవి, గండి గణేష్ కాసరపు కిరణ్, రాచపల్లి సాగర్, సలిగంటి సాగర్, మారంపెల్లి నర్సయ్య, సనీగారపు రాజ మల్లయ్య, మహేష్, కోమురమ్మ, బిక్షపతి, నగేష్, సందీప్, శ్రీశైలం, హన్మంతు, లింగయ్య, భూమయ్య, అంజయ్య కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కమిషన్ చైర్మన్ గా ఎన్నికైన నేరెళ్ల శారద గౌడ్ ఎన్నిక పట్ల హర్షం

### సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్..



**కరీంనగర్ బ్యూరో, మార్చి 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నేరెళ్ల శారద గౌడ్ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ముత్యం శంకర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం జెడ్పిటిసి గా పనిచేసి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పలు సేవలు అందించినటువంటి నేరెళ్ల శారద గౌడ్ సామాన్య గీతకుటుంబంలో జన్మించి అనేక పదవులను వారి సేవలకు గుర్తించి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ ఇవ్వడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.మచ్చలేని నాయకురాలు కష్టకాలంలో కూడా కాంగ్రెస్ పార్టీని వదలకుండా ఒకే పార్టీలో ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. వారికి మహిళా కమిషన్ చైర్మన్ ఇవ్వడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.వారు మహిళా కమిషన్ చైర్మన్ గా మహిళా సమస్యలపై స్పందిస్తూ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరిస్తారని, మహిళ లోకానికి అండగా నిలబడతారని ముత్యం శంకర్ గౌడ్ ఆకాంక్షించారు.

## సీహెచ్‌పీలో పెండింగులో వున్న ప్రమోషన్స్ ఇవ్వాలని ఏఐటీయూసీ వినతి



**యైటింక్లయిన్ కాలనీ మార్చి 17 (జనంసాక్షి) :** సింగరేణి ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 సీహెచ్‌పీలో పెండింగులో వున్న ప్రమోషన్స్, ఇతర సమస్యలపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సీహెచ్‌పీ ఎస్ఈ సదానందంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివారం సీహెచ్‌పీలో ఉన్న సమస్యలను కార్మికులను అడిగి తెలుసుకొని ఎస్ఈకి సమస్యలను వివరించడం జరిగిందన్నారు. కార్మికులు డస్ట్‌తో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందని, డస్ట్‌ను, ఫైర్‌కోల్‌ను పూర్తిగా నియంత్రించాలని, ఫిడర్ క్యాబిన్‌లో ఎసీలను వెంటనే ఎర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు చల్లని త్రాగు నీరు గురించి వాటర్ కూలర్ (ఫ్రిడ్జ్) ను వెంటనే ఎర్పాటు చేయాలని, సర్ఫెస్ ఐఆర్ ఫిడర్‌లో రక్షణ చర్యలు తీసుకోవాలని, పెరిగిన మ్యాన్ పవర్‌కి తగినట్టుగా ప్లేడేలు పెంచాలని యాజమాన్యాన్ని కోరడం జరిగిందన్నారు. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న యాక్టింగ్ ప్రమోషన్స్ ( వ్యాగన్ లోడింగ్ మజ్దూర్, లారీ మొఖదం, ట్రాలీ ఆపరేటర్, పంప్ ఆపరేటర్, టెండాల్‌లాంటి ప్రమోషన్స్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో ఆర్జీ-2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్, అసిస్టెంట్ కార్యదర్శులు బీ. శ్యాంసన్, గందం సాంబశివరావు, ఫిట్ సెక్రటరీ సెగ్గమ్ శంకర్, అసిస్టెంట్ సెక్రటరీ అల్లి రమేష్, రాజ్ కుమార్, ఐ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కోల్ మినిస్ట్రీని సన్మానించిన గుర్తింపు సంఘం నాయకులు



**యైటింక్లయిన్ కాలనీ మార్చి 17 (జనంసాక్షి) :** సింగరేణి ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 సీహెచ్‌పీని ఆదివారం సందర్శించిన సందర్భంగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు అడిషినల్ సెక్రటరీ, మినిస్ట్రి ఆఫ్ కోల్ విష్మిత తేజ్‌ని కలిసి పూలబోకేను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఆనంతరం సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్‌కి సీహెచ్‌పీ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నాయకులు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్, ఉపాధ్యక్షులు బీ. అన్నారావు, సహాయ కార్యదర్శి సాంబాశివారావు, పిట్ కార్యదర్శి సెగ్గం శంకర్, సహాయ కార్యదర్శి అల్లి రమేష్, నాయకులు సీహెచ్.మహేందర్, కిషోర్,రాజ్ కుమార్, సమ్మయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్సీ కమీషన్ మెంబర్‌ని సన్మానించిన అంబేద్కర్ సంఘ నాయకులు

**యైటింక్లయిన్ కాలనీ మార్చి 17 (జనంసాక్షి) :** జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రాంచందర్‌ని అలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం గోదావరిఖనిలోని ఆయన నివాసంలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైనా సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి పూలబోకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలిండియా అంబేద్కర్ సంఘం నాయకులు బొంకూరి మధు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాంచందర్ మాట్లాడుతూ దళితులపైన ఎలాంటి ఆఘయిత్యాలు, దౌర్జన్యాలు, జరిగిన వెంటనే న్యాయం జరిగేలా చూస్తానని, ఏ సమస్య వచ్చిన తన దగ్గరకు రావాలని, వీలుగాని పక్షంలో ఫోన్ ద్వారాగాని సమస్య తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నిర్మాణ కమిటీ బాద్యులు బూడిద సమ్మయ్య, మేకల సురేష్, మంథని రాజయ్య, కండె లక్ష్మయ్య, కనకం సదానందం, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.



# పారమిత ఉన్నత పాఠశాలలో వికసిత ముగింపు వార్షికోత్సవ వేడుకలు





**కరీంనగర్ బ్యూరో, మార్చి 17 (జనంసాక్షి) :** స్థానిక మంకమ్మ తోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో వికసిత అనే పేరుతో నిర్వహించిన రెండు రోజుల వార్షికోత్సవ వేడుకలలో భాగం గా ఆదివారం ముగింపు వార్షికో త్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఇట్టి వేడుకలను పారమిత, ఎక్స్ ప్లోరికా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద రావు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విధ్యార్థులు చేసిన శ్రీ శారదాంబ నృత్య ప్రదర్శన, పల్లెటూరులోని కమ్మతనాన్ని వివరించే నృత్య ప్రదర్శన, నాన్న యొక్క గొప్పతనాన్ని వివరించే నృత్య ప్రదర్శన, రామాయణ నాటక ప్రదర్శన, యోగా ప్రదర్శనల వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ప్రస్తుత ప్రపంచానికి పోటీ పడుతూ, అందుబాటు లో ఉన్న సాంకేతికతను వినియో గించుకుంటూ వారిలో ఉన్న సృజనాత్మకత నైపుణ్యంతో చేసిన ప్రదర్శనలు, ధారాళంగా మాట్లాడిన వైనం, చిన్నారుల ఆత్మ స్థైర్యం అందరినీ మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ... విద్యార్థులు కాలంతో పోటీ పడుతూ, సాంస్కృతిక, నైతిక విలువలను పెం పొందించుకుంటూ, ప్రస్తుత సమాజాన్ని అర్థం చేసుకొంటూ, మారుతున్న టెక్నాలజిని విద్యా విషయాలకు అనుసంధానించుకుంటూ, ఎలాంటి సందేహాలకు తావు ఇవ్వకుండా ముమ్ముందుకు వెళ్లాలని, నేటి సమాజానికి విలవలతో కూడిన విద్యను అందిస్తూ ఆ క్రమంలో పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వ వలసిన మానసిక ప్రోత్సాహం గురించి తగిన సలహాలు సూచన లు ఇస్తూ, విద్యార్థుల కృషిని అభినందించి అన్ని రంగాలలో విజయం సాధించాలని పిలుపు నిచ్చారు. ఇట్టి వార్షికోత్సవ వేడుకలు విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యా లను, సృజనాత్మకతను, సాంస్కృతిక నైపుణ్యాలను పెంపొందించేలా చేస్తుంది అంటూ చిన్నారులను ఆశీర్వదించారు. రెండు రోజుల వార్షికోత్సవ కార్యక్రమానికి సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక క్రతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్, రితేష్ మెహత, శ్రీకర్, శర్మిష్ట, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 'జై షా ఎందుకు..? అతడేమైనా సెలక్టరా..?

- కోహ్లీ సెలక్షన్ విషయంలో ఆయనకు ఏం పని..?
- జై షాపై 1983 వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ మెంబర్ ఫైర్




ఈ ఏడాది జూన్‌లో అమెరికా/వెస్టిండీస్ వేదికగా జరగాల్సి ఉన్న టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని పక్కనబెట్టాలని భావిస్తున్నట్టు వస్తున్న వార్తలపై భారత మాజీ క్రికెటర్, 1983లో వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న కృతి ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. కోహ్లీని టీమ్ నుంచి తప్పించడానికి జై షాకు ఏం హక్కు ఉన్నదని..? అతడేమైనా సెలక్షన్ కమిటీలో సభ్యుడా..? అని నిలదీశాడు. జై షాను ఉద్దేశిస్తూ 'అవివేకి' అని కామెంట్ చేశాడు. ఆజాద్ ట్విటర్ (ఎక్స్) వేదికగా స్పందిస్తూ... 'జై షా ఎందుకు..? అతడేమైనా సెలక్టరా..? కోహ్లీని వరల్డ్ కప్ టీమ్ నుంచి తప్పించడానికి అగార్కర్‌కు బాధ్యతలు ఎందుకు అప్పజెప్పి నట్టు..? కోహ్లీ పొట్టి ప్రపంచకప్ సెలక్షన్ నుంచి దూరంగా ఉండేందుకు గాను అతడు అగార్కర్‌కు మార్చి 15ను డెడ్‌లైన్‌గా విధించినట్టు సమాచారం. ఈ విషయంలో అగార్కర్ వల్ల కాకుంటే ఇతర సెలక్టర్లైనా ఈ పని చేయాల్సి ఉంటుంది. జై షా అంతకుముందే రోహిత్‌ను ఇదే విషయం అడిగితే అతడు కోహ్లీ లేకుండా తాము ఆడలేమని చెప్పినట్టు తెలుస్తోంది. కోహ్లీ తప్పకుండా టీ20 వరల్డ్ కప్ ఆడాలి. అందుకు సంబంధించిన అధికారిక సమాచారం త్వరలోనే వెల్లడవ్వాలని ఆశిద్దాం. అవివేకులు (జై షాను ఉద్దేశిస్తూ) టీమ్ సెలక్షన్ ప్రక్రియలో పాలు పంచుకోవద్దు..' అని ట్వీట్ చేశాడు.అమెరికా / వెస్టిండీస్ వేదికగా జరగాల్సి ఉన్న పొట్టి ప్రపంచకప్‌లో స్లో పిచ్‌ల కారణంగా కోహ్లీని పక్కనబెట్టనున్నారని గత వారం రోజులుగా సోషల్ మీడియాతో పాటు ప్రధాన స్రవంతి మీడియాలోనూ వార్తలు వస్తున్నాయి. దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది. ఈ నేపథ్యంలో కృతి ఆజాద్ పై విధంగా స్పందించాడు.

# స్టేడియంలో 'బాబర్.. బాబర్'

అభిమానుల అరుపులు.. అలా అరిచి అవమానించద్దన్న పాక్ స్పిన్నర్

పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) లో పెషావర్ జల్మీ తరఫున ఆడుతున్న ఆ దేశ జాతీయ జట్టు మాజీ సారథి బాబర్ ఆజమ్‌కు అక్కడ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే. అయితే అతడిమీద అభిమానం ఇతరుల మీద దురభిమానానికి దారితీస్తోంది. తాజాగా ఇటువంటి ఘటనే ఒకటి జరిగింది. పీఎస్ఎల్ - 2024లో భాగంగా పెషావర్ జల్మీ - ఇస్లామాబాద్ యునైటెడ్ మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో బాబర్ అభిమానులు కొందరు.. ఇస్లామాబాద్ ప్లేయర్ ఇమాద్ వసీంను లక్ష్యంగా చేసుకుని 'బాబర్.. బాబర్' అని అరిచారు. ఇలా అరవడం తప్పని, ఆటగాళ్లు ఒక్కోసారి వీటికి చాలా బాధపడుతారని ఇస్లామాబాద్ సారథి, పాక్ జట్టులో ఉన్న స్పిన్ ఆల్ రౌండర్ అయిన షాదాబ్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. శనివారం (మార్చి 16) పెషావర్ - ఇస్లామాబాద్ మ్యాచ్ సందర్భంగా బౌండరీ లైన్ వద్ద ఉన్న ఇమాద్ వసీంను చూసిన బాబర్ ఫ్యాన్స్.. అతడిని చూస్తూ 'బాబర్.. బాబర్' అని బిగ్గరగా అరిచారు. అప్పుడు ఇమాద్ వారిని వారించకుండా ఇంకా అరవండని ఎంకరేజ్ చేశాడు. ఈ వివాదంపై మ్యాచ్ ముగిశాక నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో షాదాబ్ ఖాన్ స్పందించాడు. 'కచ్చితంగా ఇలాంటివి జరిగినప్పుడు చాలా బాధగా ఉంటుంది.

# వరల్డ్ కప్ ఫైనల్లో అందుకే ఓడాం..



సొంతగడ్డపై వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జట్టు ఆఖరి మెట్టుపై తడబడింది. 12 ఏండ్ల తర్వాత స్వదేశంలో కప్ కొడుతుందనుకుంటే రోహిత్ సేన అనూహ్యంగా చతికిలపడింది. వాంఖడేలో జరిగిన ఫైనల్లో భారత జట్టు ఓటమిని ఇప్పటికీ ఫ్యాన్స్ మర్చిపోలేకపోతున్నారు. 'స్లో పిచ్‌ను తయారుచేసి కప్పు పోగొట్టారు?' అని క్యూరేటర్‌పై తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా టైటిల్ పోరులో రోహిత్ సేన ఓటమిపై మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ సంచలన కామెంట్స్ చేశాడు. టీమిండియా ఓటమికి కెప్టెన్ రోహిత్, కోచ్ రాహుల్ ద్రవిడ్‌లే కారణమని కైఫ్ కుండబద్ధలు కొట్టాడు. 'ఫైనల్‌కు ప్రతి మూడు రోజుల ముందు రోహిత్, ద్రవిడ్‌లు పిచ్‌ను పరిశీలించారు. గంటకు పైగా పిచ్‌ను చూస్తుండిపోయారు. అయితే.. పిచ్ రంగు మారడం నేను గమనించాను. పిచ్‌పై అసలు నీళ్లు పోయలేదు. దాంతో, గడ్డి కొంచెం కూడా కనిపించలేదు. ఆస్ట్రేలియాకు స్లో ట్రాక్ ఇద్దామని వాళ్లిద్దరూ భావించారు. అదే నిజం. వాంఖడే పిచ్ అలా ఉండడాన్ని అభిమానులు నమ్మలేకపోయారు. కమిన్స్, స్టార్క్‌లను దృష్టిలో పెట్టుకొని స్లో పిచ్ రూపొందించారు. అసలు.. రోహిత్, ద్రవిడ్‌లు పిచ్‌ను సరిగ్గా అంచనా వేయలేకపోయారు. టీమిండియా కప్ గెలవకపోవడానికి కారణం వాళ్లే' అని కైఫ్ వెల్లడించాడు.

**ధోనీ సారథ్యంలో..**

నిరుడు జరిగిన వన్డే వరల్డ్ కప్‌లో టీమిండియా 10 విజయాలతో ప్రత్యర్థులను భయపెట్టింది. కానీ, ఫైనల్లో మాత్రం సాధారణ జట్టులా ఆస్ట్రేలియాకు తలవంచింది. భారత టాపార్డర్ విఫలమైన చోట ట్రావిస్ హెడ్ సూపర్ సెంచరీతో చెలరేగి ఆసీస్‌కు ఆరో ట్రోఫీ అందించాడు. టీమిండియా 11 ఏండ్లుగా ఐసీసీ ట్రోఫీ కోసం నిరీక్షిస్తోంది. ధోనీ సారథ్యంలో చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన టీమిండియా ఆ తర్వాత ఒక్క ట్రోఫీ గెలవలేదు.

# గాయమైనా ఐదు రోజుల్లో తిరిగొస్తానన్నా



*ప్రస్తుతం ఐపీఎల్ - 17 ప్రిపరేషన్స్‌లో ఉన్న ఆ జట్టు సారథి, టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గతేడాది వన్డే వరల్డ్ కప్ తర్వాత మళ్లీ త్వరలోనే రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు. 2023లో భారత్ వేదికగానే నిర్వహించిన వన్డే ప్రపంచకప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో ఆడిన మ్యాచ్‌లో కాలి మడమ గాయంతో ఇబ్బందిపడ్డ పాండ్యా.. ఆ తర్వాత టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. గాయం తీవ్రత నేపథ్యంలో అతడు వరల్డ్ కప్‌తో పాటు ఆ తర్వాత భారత్ ఆడిన మిగతా సిరీస్‌లకూ దూరంగా ఉన్నాడు. సుమారు ఐదు నెలల విరామం తర్వాత మళ్లీ ఫీల్డ్‌లోకి అడుగుపెడుతున్న అతడు.. ఐపీఎల్ టీవీ ప్రసారహక్కులు కలిగిన 'స్టార్'లో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గాయం నుంచి ఐదారురోజుల్లో తిరిగొస్తానని టీమ్ మేనేజ్‌మెంట్‌కు చెప్పానని కానీ విధి మాత్రం మరోలా తలచిందని చెప్పుకొచ్చాడు.*

*పాండ్యా మాట్లాడుతూ.. 'నేను వరల్డ్ కప్ కోసం ఏదో 2-3 నెలలుగా ప్రిపేర్ కాలేదు. సుమారు ఏడాదికాలంగా ప్రపంచకప్ కోసం సిద్ధమయ్యా. ఆ మేరకు నా షెడ్యూల్‌ను ప్లాన్ చేసుకున్నా. కానీ గాయం మాత్రం నా ఆశలపై నీళ్లు చల్లింది. చాలా తక్కువ మందికి మాత్రమే నా గాయం గురించి తెలుసు. వాస్తవానికి నాకు గాయమైనప్పుడు 20-25 రోజుల్లో పూర్తిగా కోలుకుంటానని అనుకున్నా. కానీ అది నిత్యం వాయిదాపడుతూ నా రికవరీని లేట్ చేసింది. ఒకరకంగా చెప్పాలంటే నాకు ఇది పూర్తిగా కమ్ బ్యాక్ వంటిది. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గాయమై నేను జట్టును వీడేప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్‌తో ఐదు రోజుల్లో తిరిగి వస్తానని చెప్పా. కానీ వరల్డ్ కప్‌తో పాటు నాలుగు నెలలు వేచి చూడాల్సి వచ్చింది..' అని అన్నాడు.*

*అంతేగాక కాలి మడమ గాయం వల్ల తాను కనీసం నడవలేకపోయే వాడినని చెప్పిన పాండ్యా.. తాను వీలైనంత త్వరగా కోలుకునేందుకు చాలా కష్టపడ్డానని తెలిపాడు. నడక కష్టమైనా ఆ నొప్పి తెలియకుండా ఉండేందుకు గాను పెయిన్ కిల్లర్స్ వాడానని, ఇంజెక్షన్స్ కూడా తీసుకున్నానని చెప్పుకొచ్చాడు. దేశం తరఫున ఆడటం ఎప్పుడూ గౌరవంగా భావించానని, కానీ వరల్డ్ కప్ మిస్ చేసుకున్నందుకు మాత్రం చాలా బాధపడ్డానని పాండ్యా తెలిపాడు.*



# పాక్ క్రికెట్‌లో మరో దుమారం రేపిన నసీమ్ షా

పాకిస్తాన్ క్రికెట్ జట్టు అంతర్గతంగా విభేదాలతో సతమతమవుతున్నదని గత కొంతకాలంగా వస్తున్న వార్తలకు తాజాగా ఆ జట్టు యువ పేసర్ నసీమ్ షా మరోసారి ఆజ్యం పోశాడు. పాక్ జట్టులో ఉన్న ఆటగాళ్లు ఏదైనా గాయమైనా.. మ్యాచ్ ఆడేందుకు వంద శాతం ఫిట్‌గా లేకున్నా టీమ్ నుంచి తప్పుకోవడానికి ఆసక్తి చూపరని, ఒకవేళ అలాంటి పరిస్థితుల్లో తప్పుకుంటే తర్వాత వాళ్ల కెరీర్‌లు ఉంటాయో ఉండయోననే అభద్రతాభావంలో ఉంటారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

క్రిక్ విక్‌తో ముచ్చటించిన నసీమ్ షా మాట్లాడుతూ.. 'వాస్తవంగా చెప్పాలంటే పాకిస్తాన్ జట్టులో ఉన్న మెయిన్ ప్లేయర్లు తమ ప్లేస్‌ను వదులుకోవడానికి ఇష్టపడరు. గాయాలైనా, మ్యాచ్ ఆడేందుకు వంద శాతం ఫిట్నెస్ సాధించలేకపోయినా వాళ్ల బాడీలకు రెస్ట్ ఇవ్వాలని కోరుకోరు. ఎందుకంటే పాక్ క్రికెట్ టీమ్‌లో అభద్రతా భావం ఎక్కువ. ఒకవేళ కొత్త ప్లేయర్ వచ్చి రెండు మూడు మ్యాచ్‌లలో బాగా ఆడితే ఇక అతడినే కొనసాగిస్తారేమో.. తనను జట్టు నుంచి తీసేస్తారేమో అనే భయం చాలామందిలో ఉంటుంది. అందుకే జట్టులోని చాలామంది ఆటగాళ్లు రెస్ట్ లేకుండా ఆడుతూనే ఉంటారు. ఒకవేళ బ్రేక్ ఇస్తే తమ కెరీర్‌లు ముగిసిపోతాయని వాళ్లు భావిస్తారు..' అంటూ వ్యాఖ్యానించాడు.


ఇతర దేశాలలో అయితే ఒక ఆటగాడు రెస్ట్ తీసుకుంటే తర్వాత కొన్నిరోజులకు మళ్లీ అతడు రాగానే టీమ్‌లో ప్లేస్ ఉంటుందని హామీ లభిస్తుందని, గాయపడిన ఆటగాడి స్థానంలో వచ్చిన ప్లేయర్ రెండు మూడు మ్యాచ్‌లలో ఆడినా పెద్ద నష్టమేమీ ఉండదని, కానీ పాక్‌లో మాత్రం అలా కాదని షా అన్నాడు. ఈ విషయంలో సీనియర్ ప్లేయర్లు, టీమ్ మేనేజ్‌మెంట్, సెలక్టర్స్, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని షా అన్నాడు.

గతేడాది ఆసియా కప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో భుజానికి గాయమైన నసీమ్ షా.. ఆ టోర్నీతో పాటు వన్డే వరల్డ్ కప్‌కూ దూరమయ్యాడు. సుమారు 6 నెలల తర్వాత అతడు.. ఇటీవలే పాకిస్తాన్‌లో జరుగుతున్న పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో మళ్లీ ఆడాడు. పాకిస్తాన్ త్వరలోనే న్యూజిలాండ్‌తో జరగాల్సి ఉన్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తిరిగి జాతీయ జట్టులోకి వచ్చేందుకు అతడు సిద్ధమవుతున్నాడు.

# బ్లాక్ బస్టర్ కాంబో రిపీట్.. 'కార్తికేయ 3'



2022లో వచ్చిన 'కార్తికేయ 2' సినిమాతో పాన్ ఇండియా లెవెల్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ. చందు మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రం దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ సూపర్‌హిట్ అందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా వచ్చిన రెండు ఏండ్ల తర్వాత నిఖిల్, చందుల కాంబో రిపీట్ కాబోతుంది. తాజాగా కార్తికేయ 3కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. ఈ ప్రాజెక్ట్‌పై నిఖిల్ సిద్దార్థ ఎక్స్ వేదికగా ప్రకటిస్తూ.. సరికొత్త సాహసాన్ని వెతికే పనిలో డాక్టర్ కార్తికేయ నిమగ్నమయ్యారు. త్వరలో రానున్నాం అంటూ నిఖిల్ రాసుకోచ్చాడు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతుండగా.. 'కార్తికేయ 2'తో పోలిస్తే ఇది భారీ బడ్జెట్‌తో రూపొందించనున్నట్లు టాక్. నిఖిల్ మరోవైపు పాన్ ఇండియా చిత్రం స్వయంభు చేస్తున్నాడు. ఈ సినిమాకు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా.. మలయాళ భామ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇక హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రానున్న ఈ సినిమాలో నిఖిల్ ఓ యోధుడి పాత్రలో కనిపించనున్నారు.



# అమ్మే.. నా ధైర్యం

బాలీవుడ్ నటి సారా అలీఖాన్ కెరీర్‌లో ఒక్కో అడుగూ జాగ్రత్తగా వేస్తూ ముందుకు వెళ్తున్నది. ఆమె నటించిన 'మర్డర్ ముబారక్' సినిమా ఓటీటీలో మంచి హిట్ సాధించింది. తాజాగా ఆమె 'యే వతన్ మేరే వతన్' చిత్రంలో నటిస్తున్నది. నటుడు సైఫ్ అలీఖాన్, అమృతా సింగ్ ముద్దుల కూతురు సారా బాల్యం ఆడిందే ఆటగా ఏం సాగలేదు. సైఫ్, అమృత విడిపోవడంతో ఆమె తల్లి దగ్గరే ఎక్కువగా పెరిగింది.

'నా ధైర్యం మా అమ్మే! సింగిల్ మదర్‌కు ఎన్నో సవాళ్లు ఉంటాయి. వాటిని అమ్మ అధిగమించి, నన్ను పెంచిన తీరు అబ్బురమనిపిస్తుంటుంది. అమ్మ పెంపకంలో నేను ఇండిపెండెంట్‌గా పెరిగాను. మన కోసం ఎవరో వచ్చి, ఏదో చేస్తారని అనుకోవద్దని చిన్నప్పుడే అర్థమైంది. నా ధైర్యానికి కారణం అమ్మే!' అని చెప్పుకొచ్చింది సారా. పరిస్థితులకు తగ్గట్టుగా ఉండగలగడం చెప్పినంత తేలిక కాదంటుందామె. 'చాలాసార్లు మనం అనుకున్నట్టుగా ఏదీ జరగకపోవచ్చు. అలాంటప్పుడు చాలా కోపం, చిరాకు కలుగుతాయి. కానీ, ఒక సమస్యను మనం చూసే కోణాన్ని బట్టి దాని పరిష్కారం ఉంటుంది. ఆ పరిస్థితులను అర్థం చేసుకునే శక్తియుక్తులు అమ్మ దగ్గరే నేర్చుకున్నాను' అంటుంది సారా అలీఖాన్.

# 'యానిమల్' వివాదం

## సందీప్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించిన జావేద్ అక్తర్

బాలీవుడ్ బ్లాక్ బస్టర్ యానిమల్ సినిమాపై ఇంకా వివాదం కొనసాగుతునే ఉంది. ఇప్పటికే ఈ సినిమాపై సినీ రాజకీయ ప్రముఖులు విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా బాలీవుడ్ దిగ్గజ లిరిక్ రైటర్ జావేద్ అక్తర్ ఇలాంటి చిత్రాలు ప్రేక్షకులకు ఏం సందేశాలు ఇస్తున్నాయని చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనం రేపాయి. ఇక దీనికి కౌంటర్‌గా 'యానిమల్' దర్శకుడు సందీప్ వంగా కూడా ఘాటుగా రిప్లయ్ ఇచ్చాడు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. అయితే తాజాగా సందీప్ వ్యాఖ్యలపై జావేద్ అక్తర్ స్పందించాడు.

యానిమల్ సినిమాపై జావేద్ అక్తర్ మాట్లాడుతూ.. ఈ సినిమా దర్శకుడిపై నేను విమర్శలు చేయట్లేదు. ఒక డెమోక్రసీ కంట్రీలో నచ్చిన సినిమాను తీసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది. యానిమల్ లాంటి సినిమాలను ఒక్కటి కాకపోతే రెండు మూడు తీయమనండి. కానీ నా బాధంతా ప్రేక్షకుల గురించే. వారు ఇలాంటి హింసను ప్రేరేపించే చిత్రాలను చూసి ప్రేరణ పొందుతారు. నా 53 ఏండ్ల మూవీ కెరీర్‌లో నా సినిమాలలో సందీప్‌కు ఎక్కడా అసభ్య సన్నివేశాలు, మాటలు కనిపించలేదు. అందుకే నా కొడుకు నిర్మించిన మూవీని ఉదాహరణగా చూపించాడు. అందులో ఫర్హన్ నటించలేదు. నిర్మించాడంతే అంటూ జావేద్ వెల్లడించాడు.

ఔరంగాబాద్‌లో ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న జావేద్ అక్తర్ ప్రస్తుత సినిమా పరిస్థితుల గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఇటీవల బ్లాక్ బస్టర్ అందుకున్న యానిమల్ సినిమాను పరోక్షంగా ప్రస్తావించాడు. యానిమల్ లాంటి సినిమాలు భారీ విజయాన్ని నమోదు చేయడం ప్రమాదకరమని తెలిపాడు. ఈ సినిమాలో ఒక సీన్‌లో హీరో తన ప్రేమను నిరూపించుకోవడానికి హీరోయిన్ ను బూట్లు నాకాలని అడగడం, అలాగే మరోక సీన్లో మహిళలను చెంపదెబ్బ కొట్టడం సరైనదేనని చెప్పడం వంటివి ఉంటాయి. అయితే ఇలాంటి సీన్లు ఉన్నప్పటికీ ఆ సినిమా సూపర్ డూపర్ హిట్ గా మారిందని ఇలాంటి చిత్రాలను ప్రేక్షకులు ఎలా హిట్ చేస్తున్నారో అర్థం కావడం లేదని జావేద్ అక్తర్ అభిప్రాయపడ్డారు. సమాజానికి ఇది ఎంతో ప్రమాదకరం అని ఆయన ఆందోళన చెందారు. అయితే దీనికి కౌంటర్‌గా సందీప్ స్పందిస్తూ 'మిర్జాపూర్' నిర్మించిన సమయంలో ఇదే విషయాన్ని ఆయన తన తనయుడు ఫర్హాన్ అక్తర్‌కు ఎందుకు చెప్పలేదు. ఆ సిరీస్‌లో చాలా అసభ్య పదాలు ఉంటాయి. ఇప్పటివరకూ నేను దాన్ని చూడలేదు. మా సినిమాలపై వ్యాఖ్యలు చేసే ఆయన తన కుమారుడి వర్క్‌ను ఎందుకు చెక్ చేయడం లేదు అని ప్రశ్నించారు.

# ఎన్ని మొక్కలు నాటినా..

## మనలో మార్పు రానంత వరకు ప్రకృతికి ప్రమాదం తప్పనట్టే:

**బాలీవుడ్ నటి దియా మీర్జా ప్రకృతి ప్రేమికురాలు. పర్యావరణ పరిరక్షణకు తనవంతుగా పాటుపడుతూ ఉంటుంది. ఇటీవల నైరోబీలో జరిగిన ఐక్యరాజ్యసమితి పర్యావరణ సదస్సుకు ఆమె హాజరైంది. 'ఈ సదస్సులో పేరెన్నికగన్న పర్యావరణ వేత్తలను కలుసుకునే అవకాశం వచ్చింది. మనిషి చేస్తున్న తప్పిదాలు పర్యావరణానికి ఎంత హాని తలపెడుతున్నాయో అర్థమైంది. యునైటెడ్ నేషన్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా 2032 కల్లా ప్రపంచవ్యాప్తంగా 500 మిలియన్ మొక్కలు నాటాలన్న ఆ సదస్సు నిర్ణయం కొంత ఊరట నిచ్చింది.**

**ఎన్ని మొక్కలు నాటినా.. మనలో మార్పు రానంత వరకు ప్రకృతికి ప్రమాదం తప్పనట్టే! మా అబ్బాయి చదివే క్లాసులో దాదాపు 90 శాతం మంది పిల్లలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారు. పర్యావరణ కాలుష్యమే ఇందుకు కారణం. మన అవసరాల కోసం భవిష్యత్ తరాల బతుకును పణంగా పెడుతున్నాం. ముందుతరాలు మనల్ని తిట్టుకో వద్దంటే.. ఇప్పటికైనా మేల్కోవాలి. పర్యావరణాన్ని పరిరక్షించే లా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో వాటిని పక్కాగా అమలు చేయాలి. కాలుష్యాన్ని నియంత్రించాలి. ప్రకృతి వనరులను ధ్వంసం చేసేవారిని కఠినంగా శిక్షించాలి. అప్పుడే ప్రకృతి పదిలంగా ఉంటుంది. ముందు తరాల మనుగడ సాధ్యమవుతుంది' అని పేర్కొన్నది దియా.**



సినిమా





# కీడాకోలా' వివాదంపై తొలిసారిగా స్పందించిన దర్శకుడు తరుణ్ భాస్కర్

టాలీవుడ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ దాస్యం తెరకెక్కించిన 'కీడా కోలా' సినిమా వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. లెజెండరీ సింగర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కొడుకు ఎస్పీ చరణ్ కీడా కోలా టీమ్‌కు లీగల్ నోటీసులు పంపాడు. తన తండ్రి (ఎస్పీ బాలసుబ్రమణ్యం) వాయిస్‌ను ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో రీ క్రియేట్ చేసి కీడా కోలా సినిమాలో వాడుకున్నందుకు 'కీడా కోలా' చిత్ర నిర్మాతతో పాటు సంగీత దర్శకుడు వివేక్ సాగర్‌లకు ఎస్పీ చరణ్ నోటీసులు పంపారు. అయితే ఈ కాంట్రవర్సీపై తరుణ్ భాస్కర్ తాజాగా స్పందించారు. కమ్యూనికేషన్ ఇష్యూ వల్లనే ఇదంతా జరిగిందని చెప్పారు.

మాకు, ఎస్పీ చరణ్ సార్‌కు మధ్య కొంచెం కమ్యూనికేషన్ గ్యాప్ వచ్చింది. అది మా సైడ్ నుంచి.. చరణ్ సార్ సైడ్ నుంచి కూడా జరిగింది. ఎవరైనా సరే ఏదైనా కొత్తగా చేయాలని అనుకుంటారు. అంతే కాకుండా మన సినీ దిగ్గజాలను గౌరవించాల్సిన అవసరం కూడా ఉంది. అంతకు మించి ఏం లేదు. ఎవరినీ అగౌరవపరచాలనే ఉద్దేశం ఏం ఉండదు. మీరు కూడా చూస్తున్నారు.. నేను చేసేది చిన్న సినిమాలు. పెద్ద స్టార్స్‌తో ఏదో కమర్షియల్ గా చెయ్యాలని నేను అనుకోను. నాకు కమర్షియల్ మెంటాలిటీ లేదు. మా వరకు ఏదైనా కొత్తగా చేయాలనే ప్రయత్నం చేశాం అని తరుణ్ భాస్కర్ తెలిపాడు.

పెళ్లి చూపులు ఫేమ్ తరుణ్ భాస్కర్ స్వీయ దర్శకత్వంతో వచ్చిన చిత్రం 'కీడా కోలా'. బ్రహ్మానందం, చైతన్య రావు, రాగ్ మయూర్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించారు. సరికొత్త క్రైమ్ కామెడీ కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీ దగ్గుబాటి రానా సమర్పణలో నవంబర్ 03న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయం అందుకుంది. అయితే ఈ సినిమాలోని ఒక సన్నివేశంలో ఎస్పీ బాలు గొంతుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాడించారు. ఇక అనుమతి లేకుండా SPB వాయిస్ వాడుకున్నందుకు గాను 'కీడా కోలా' చిత్ర నిర్మాతతో పాటు సంగీత దర్శకుడు వివేక్ సాగర్‌లకు ఎస్పీ చరణ్ నోటీసులు పంపారు.

# టూరిస్ట్ నాయకులతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు!

- కాకా కుటుంబానికే అన్ని పదవులా?
- వారిది కుటుంబ పాలన కాదా..?
- తనను గెలిపిస్తే పెద్దపల్లి పార్లమెంటు ప్రజలు గెలిచినట్టే..!
- బిఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



**మంథని, మార్చి 17 (జనంసాక్షి) :** టూరిస్ట్ నాయకులతో ప్రజలకు ఒరిగేదేమి లేదని, కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ వివేక్ కొడుకు వంశీకృష్ణకు కావాలని అడుగుతున్నారని, కాకా కుటుంబానికే అన్ని పదవులా..?, వారిది కుటుంబ పాలన కాదా?, స్థానికంగా ఉండి, మీలో ఒకడిలా ఉండే నన్ను గెలిపిస్తే... పెద్దపల్లి పార్లమెంటు ప్రజలు గెలిచినట్టే..! అని బిఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో నేపథ్యంలో మంథని నియోజకవర్గం పరిధిలోని కమాన్ పూర్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ నాయకులు ఇనుగంటి రామారావు నివాసంలో పార్టీ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ...గడిచిన ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు టిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులను నిరాశ, నిస్పృహకు గురిచేశాయని, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందే ప్రసక్తి లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆచరణ సాధ్యం కానీ హామీలను నమ్మి ప్రజలు ఓటు వేసి, మోసపోయి గోసపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు స్వయంగా రైతు బంధు అడిగితే చెప్పు తీసి కొడతా అంటున్నారని, అభివృద్ధి సంక్షేమం గురించి కాంగ్రెస్ మాట్లాడకుండా కాళేశ్వరం కేసీఆర్ అంటున్నారన్నారు. కెసిఆర్ పాలనలో రైతులకు అందిన నీళ్లు.. కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎందుకు అందడం లేదన్నారు. కెసిఆర్ చేసిన అప్పులు కనిపిస్తున్నాయి కానీ సృష్టించిన ఆస్తులు కనిపిస్త లేవా అన్నారు. పార్లమెంట్ ఎలక్షన్లు కాంగ్రెస్ పార్టీ ఓటు వేస్తే మేము ఏం చేసినా నడుస్తుంది, మాకే ప్రజలు ఓటేశారు.. రేపు ఆరు హామీల విషయం లో ఎన్నికల తర్వాత అమలు చేసిన చేయకున్న మా ప్రభుత్వం నడుస్తుంది.. అని కాంగ్రెస్ పార్టీ ఉద్దేశం అని ప్రజలు గమనించాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు భారీ వర్షాలకు వరదా ద్వారా ఒక పిల్లర్ కుంగిపోయింది... దానికి కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని, అసత్య ప్రచారం చేసి నీళ్లన్నీ సముద్రంలోకి వదిలేసి తెలంగాణలో పంటలు ఎండిపోయే దుస్థితికి తీసుకువచ్చారన్నారు. 30 సంవత్సరాల ఇలాంటి మచ్చలేని ప్రజానాయకంగా ప్రజల మధ్య ఉన్న నాయకున్ని...సాధారణమైన మనిషిగా జీవితం ప్రారంభించి, ఈ స్థాయికి వచ్చాను.. నా కుటుంబమే సింగరేణి కుటుంబం.. అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కావచ్చు.... కాని గెలిచేది మాత్రం పెద్దపల్లి పార్లమెంట్ ప్రజలే అని అన్నారు. ఈ ఎలక్షన్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రతి ఒక్కరూ తామే అభ్యర్థి గా పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ పాలన కుటుంబ పాలన అన్నారు.. కానీ పెద్దపల్లి పార్లమెంటరీ లో చెన్నూర్, బెల్లంపల్లి, ఎమ్మెల్యేలు వారే, ఇప్పుడు ఎంపి టికెట్ వారి కొడుక్కి మీది కుటుంబ పాలన కాదా.. ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. 50 వేల కోట్లకు అధిపతులు, టూరిస్ట్ నాయకులు, ఎలాంటి వారు ఎన్నికలు రాగానే కనిపిస్తారు... అలాంటి వాళ్లు వచ్చాక హడావిడిగా చేరికలు ప్రారంభం అవుతాయి. వాళు గెలిస్తే హైదరాబాద్ లో ఉంటు వారి వ్యాపారాలు చేసుకుంటారా తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోరన్నారు. వలస వస్తు పోతారు..ప్రజా నాయకుడు కావాలా.... పైసల నాయకుడు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు.

## రామ్ దాస్ అగర్వాల్ జయంతి సందర్భంగా

# ఉచిత వైద్య శిబిరం

- ప్రారంభించిన రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్, మార్చి 17 (జనంసాక్షి) :** హైదరాబాద్ లోని ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని, రామంతపూర్‌లో నల్ల పోచమ్మ దేవాలయం దగ్గర అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో రామ్ దాస్ అగర్వాల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. తదనంతరం ట్రై కలర్ హాస్పిటల్ అంబర్ పేట వారు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో డాక్టర్‌ల పర్యవేక్షణలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, సేవలు అందించారు. అవసరం ఉన్నవారికి శస్త్ర చికిత్సలు చేయించే విధంగా వైద్యుల పర్యవేక్షణలో సలహాలు సూచనలు వైద్య సేవలు... అందించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి వారిని అన్ని విధాలుగా ఆదుకునాలనే ఉద్దేశ్యంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 100 మంది ప్రజలు వివిధ వైద్యం సేవల వచ్చారని, కరోనా వంటి విపత్కర సమయంలో డాక్టర్స్ అనేక సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే లక్ష్యంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అందరికీ ఉచితంగా పరీక్షలు మందులు అందించారని, అవసరం ఉన్న వారికి వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా చికిత్సలు చేయించే విధంగా అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో.. ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు పాండయ్య గుప్త, జనరల్ సెక్రటరీ కొత్తపల్లి రమేష్ గుప్త, ఐవీఎఫ్ స్టేట్ ఆధ్యాత్మిక చైర్మన్ జోనగిరి శ్రీనివాసులు గుప్త, ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు,ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లాను ముందువరుసలో ఉంచాలి..
- కలెక్టర్ భవేశ్ మిశ్రా..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, మార్చి 17 (జనంసాక్షి):** పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఫలితాల్లో జిల్లాను ముందువరుసలో ఉంచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కోరారు. టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులకు కలెక్టర్ బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశకు పదో తరగతి కీలక మలుపు అని, విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, మన జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండ సజావుగా, సక్రమంగా పరీక్షలు రాయాలని సూచించారు. సంవత్సరం పాటు విద్యార్థులు ఎంతో కృషి, పట్టుదలతో చదువుకున్నారని, ముఖ్యంగా పరీక్షల సమయంలో వత్తిడికి గురికావొద్దని ఆయన తెలిపారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి విద్యార్థులను ఒక గంట ముందు నుండే అనుమతిస్తారని అన్నారు. చివరి నిమిషం వరకు వేచియుండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ప్రారంభం నుండి ముగింపు వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాల్ ప్రాక్టీస్ జరిగినా సంబంధిత సిబ్బందికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షకు గైర్హాజరైన విద్యార్థుల వివరాలు అందజేయాలని చెప్పారు. కేంద్రాల్లో బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు మరుగుదొడ్లు గుర్తించడానికి వీలుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఒత్తిడికి గురి కాకుండా మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాసినప్పుడే మంచి స్కోరింగ్ సాధిస్తారని అన్నారు. పదవతరగతి విద్యార్థులు మానసికపరమైన ఒత్తిడిలను అధిగమించేందుకు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 98854 62305 కంట్రోల్ రూము నంబర్ కు కాల్ చేస్తే సలహాలు, సూచనలు అందిస్తారని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలియజేశారు.

# బీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్

- కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్‌కు గుడ్‌పై చెప్పనున్న కార్పొరేటర్లు
- కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌లో అయోమయం



**కుత్బుల్లాపూర్ మార్చి 17 (జనం సాక్షి) :** రాష్ట్రంలో కంచుకోటగా ఉండిన బీఆర్ఎస్‌కు బీటలు వారుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఒక్కొక్కరుగా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ వైపు పయనిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మెన్లు ఇలా పెద్ద నాయకులు.. కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు ఇలా చోటామోటా నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరిపోతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో ఆశించిన స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి సీట్లు రాలేదు. దీంతో ఆ పార్టీ ఆ రెండు ఉమ్మడి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో బీఆర్ఎస్ పార్టీకి ఊహించని షాక్ తగలనుంది. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు వచ్చిన ఊపుతో ఆ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ పార్టీ నుంచి కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. రాష్ట్రంలోని అత్యధిక మెజార్టీతో గెలిచిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ స్థానం నుండి నలుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు ప్రాథమిక సమాచారం. ఇప్పటికే పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేయడంతో కాకా వికాలమైన బిఆర్ఎస్‌కు గ్రేటర్ హైదరాబాద్ లో మరో షాక్ తగలనుందా? జరుగుతున్న పరిణామాలు చూస్తే నూటికి నూరు శాతం నిజమని అనిపిస్తుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్, జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్, సూరారం డివిజన్ కార్పొరెడ్డి చింతల్ డివిజన్ కార్పొరేటర్, సూరారం డివిజన్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. టిఆర్ఎస్ పార్టీకి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఊహించని పరిణామాలు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతిద్యం వహిస్తున్న మల్కాజ్గిరి పార్లమెంటు స్థానాన్ని చాలెంజిగా తీసుకున్న టిఆర్ఎస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ అని చెప్పుకోవాలి . ఈ పరిణామంతో టిఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ సీటును దాదాపుగా చేజార్చుకున్నట్లుగానే భావించవచ్చు. పట్నం మహేందర్ రెడ్డి సమక్షంలో వీరు కాంగ్రెస్ పార్టీలో చేరన ఉన్నట్లు సమాచారం.

# రామప్ప దేవాలయం సందర్శించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే

- సన్నాయి మేళాలో పూర్ణకుంభలతో స్వాగతం పలికిన అధికారులు పూజారులు







**వెంకటాపూర్(రామప్ప)మార్చి17(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని ఆదివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే దంపతులు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు,జస్టిస్ వినోద్ కుమార్ లు సందర్శించగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్లు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ మండపంలో శాలువాలతో సన్మానించగా,ఈవో బిల్లా శ్రీనివాస్ మెమెంటోను బహుకరించారు. ఆలయ శిల్పకళా ప్రాముఖ్యతను అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్ కుసుమ సూర్య కిరణ్,టూరిజం గైడ్ గోరంటాల విజయ్ కుమార్లు వివరించగా ఆసక్తిగా తిలకించారు.నీటిలో తేలే ఇటికలను చూసి,ఆ రోజుల్లోనే అద్భుతమైన టెక్నాలజీతో నిర్మించారని కొనియాడారు.పురావస్తు శాఖ వారి వీఐపీ రిజిస్టర్ లో రామప్ప ఆలయం ఆర్కిటెక్చర్ మార్వలెస్ గా ఉందని రాశారు.కాకతీయ డోజర్, రామప్ప హిస్టరీ పుస్తకాలను టూరిజం అధికారులు బహుకరించారు.వారి వెంట హైకోర్టు రిజిస్టర్లు నందికొండ నరసింహారావు,ప్రవీణ్ కుమార్,శ్రీనివాస్ రెడ్డి, ములుగు జిల్లా జడ్జి పి వి లలితా శివజ్యోతి, జడ్జీలు మాధవి,రామ్మోహన్ రెడ్డి,ఆర్డీవో సత్యపాల్ రెడ్డి,డీఎస్పీ రవీందర్, తాసిల్దార్ సదానందం,ఎస్సై చల్ల రాజు, న్యాయవాదులు వేణుగోపాల చారి వినయ్ కుమార్ రవీందర్ మహేందర్, కోర్టు పోలీస్ రెవెన్యూ టూరిజం ప్రావస్ శాఖ దేవదాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రాష్ట్ర స్టేట్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా అయిత ప్రకాష్ రెడ్డి



**మహదేవపూర్ మార్చి 17( జనం సాక్షి) :** ఐటీ శాఖ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి నేతృత్వంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా డిసిసి పార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఐక్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్టేట్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైనందున మంథని శాసనసభ సభ్యులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు మంతిని నియోజకవర్గ ప్రజా ప్రతినిధులకు నాయకులకు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులకు ఎస్సీ సెల్ బీసీ సెల్ మైనార్టీ సెల్ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

# ఎన్నికల కోడ్ వర్తించదా?






**ఖానాపురం, మార్చి17 (జనం సాక్షి) :** ఇక్కడ ఎన్నికల వర్తించదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ వర్తించడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కార్యాలయంలో కానీ గ్రామాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ కార్యాలయంలో కానీ ఎక్కడ ఎన్నికల కోడ్ పాటించడం లేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే బహిరంగ ప్రదేశాల్లో ఉన్నటువంటి రాజకీయ నాయకుల చిత్రపటాలు మరియు విగ్రహాలను కప్పి ఉంచాల్సి ఉంది. ఓటర్లను ప్రభావితం చేయవచ్చు అనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం పార్టీలకు రాజకీయాలకు అతీతంగా నిబంధనలను విధించింది. సంబంధిత అధికారులు దీనిని తూచా తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. కానీ మండలంలో మాత్రం ఇవి ఏమి పట్టినట్టు లేవు. నిత్యం అధికారు లు వస్తున్న మార్గంలోనే పలు రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపిస్తున్న అధికారులకు మాత్రం వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు సంబంధించిన విషయాలు గోడలపై రాసి ఉన్నా కూడా వాటిని చూసి చూడనట్టు మండల అధికారులు ఉన్నట్లుసమాచారం. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి కూత వేటు దూరంలో ఉన్న విగ్రహాలు గోడల పై రాతలు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి అధికారులకు కనబడడం లేదా వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని పలువురు ప్రజలు ఓటర్ లు ప్రశ్నిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపీపీ చల్ల సుధీర్ రెడ్డి



**స్టేషన్ ఘన్ పూర్ , మార్చి 17 , ( జనం సాక్షి ) :** మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన స్టేషన్ ఘన్పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కుతుబుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కొలను హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్ పూర్ వైస్ ఎంపిపి చల్లా సుధీర్ రెడ్డిని శాలువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్ల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలునచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు.

## సోలార్ వైరు తగిలి మహిళ మృతి

**కొమరంభీం, మార్చి 17 (జనంసాక్షి) :** బెజ్జూర్ మండలం చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరి లక్ష్మి 55 సంవత్సరాలు సోలార్ వైర్ తగిలి ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. చిన్న సిద్ధపూర్ గ్రామంలోని తోటలో , కూరగాయలు కోసేందుకు టాకిరే లక్ష్మి వెళ్లగా,ముర్చరవడమోతో ప్రమాదవశాత్తు, సోలార్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు మృతురాలు సోదరుడు సండే శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై విక్రం తెలిపారు. మృతురాలకు భర్తతోపాటు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105